ఆంధ్ర సచిత్ర వారపత్రిక



3-2-78
75 పైసలు





1) ఫిల్మోత్సవ్ - 78


మద్రాసులో జనవరి 3 నుండి 17 వరకూ జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవం "ఫిల్మోత్సవ్ – 78"లో ప్రదర్శించిన చిత్రాలలో ఒకటైన రుమేనియా చిత్రం "పిక్చర్ పోస్ట్ కార్డ్ విత్ ఫ్లవర్స్"లోని ఒక దృశ్యం.

2)

"బేకర్స్ బ్రెడ్" ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ చిత్రంలోని ఒక దృశ్యం.

బ్రూ-కమ్మని రుచికి, సువాసనకి మొదటి రకము

దాని వెల ఎంతో ఆకర్షణీయమైనది



మంచి కాఫీ అభిమానులందరికీ :


బ్రూ ప్రత్యేక 'రుచి దేశ మంతటా కాఫీ అభిమానుల మెప్పును పొందింది. అందువలన ఇన్‌స్టెంట్ లో మేటిగా ఉన్నది. బ్రూ రుచి మీద అభిమానం రోజు రోజుకూ పెరుగుతోంది. మంచి చిక్కని బ్రూ ఎప్పుడూ అసమాన తృప్తినిస్తుంది. మెచ్చిన రుచి, చిక్కదనం ఈ రోజే వాడి చూడండి.



OBM-5223A/1 TEL

భారత దేశంలో అత్యధికంగా అమ్ముడయే ఇన్‌స్టెంట్

లోకంపోకడ



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు.

దేశోద్ధారక - కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938-1972]

శుక్రవారం : 3-2-'78

పింగళనామ సం పుష్య బ. దశమి

సంపుటము 71 : సంచిక 20

సంపాదకుడు

శివలెంక రాధాకృష్ణ

*

పోస్టులో ఏడాది చందా రు 41-60

ఆరు మాసాల చందా రు 20 80

విడిప్రతి వెల 75 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ.


కుమారి జయలక్ష్మి

ఫొటో : ఎస్. సరస్వతి

కథలు : సీరియల్ కథలు.

వ్యాసాలు, శీర్షికలు :

జె. సి. షా × ఇందిరాగాంధీ



జస్టిస్ జె. సి. షా

అధికారంలో లేకపోయినా— ఉన్నప్పటి దర్పంతోనే కాంగ్రెసు పార్టీని రెండుగా చీల్చి— అందులో ఒక ముక్కని లాక్కొని ఫిబ్రవరి 25 నుంచి ఆరు రాష్ట్రాలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో—ఒకప్రక్క తనను 'బద్నామ్' చేయడానికి, క్రిమినల్‌గా నిలబెట్టడానికి చౌధురీ చరణ్‌సింగ్‌గారి ఆధ్వర్యంలో— అధికారంలో వుండి అహర్నిశలు కృషిచేస్తూవున్న జనతాపార్టీతోను, మరోప్రక్క మొన్న మొన్నటిదాకా తనకి "జో హుకుమ్"లు కొడుతూ— యివాళ అన్ని తప్పులకి అమ్మగారే బాధ్యులంటూ— "వేలు పెడితే కొరకలేం? వెన్న పెడితే మింగలేం" మొహాలు పెట్టుకుని—బజారున పడ్డ తన మాజీ అనుయాయుల చేతిలో వున్న కాంగ్రెసు పార్టీతోను— పోరాడటానికి సిద్ధం అవుతూ వున్న మాజీ నియంత 'యిందిరమ్మ' తెగువకి మెచ్చుకోవడానికి మరో సారి 'షా' చెప్పడానికి— జస్టిస్ జయంతిలాల్ ఛోటేలాల్ షా (72)— జనవరి 19 న తనముందు హాజరు కమ్మని సవరించిన సమన్సు జారీ చేయడంతో—నేడో రేపో మాజీ స్ట్రేటు కోర్టులో ప్రాసిక్యూషన్ కేసు ఎదుర్కోవలసిన— భారత మాజీ ప్రధాని రాజకీయ జీవితం అత్యంత క్లిష్ట దశను చేరుకున్నది.

అత్యవసర పరిస్థితిలో జరిగిన అత్యాచారాలను వెలికి త్రవ్వి— యెప్పటికప్పుడు వాటిని పత్రికల పతాక శీర్షికలకు అందించే వీలు కల్పించిన "షా సంఘం" ఏర్పడ్డ ఏడు మాసాల తరువాత శ్రీమతి ఇందిరా గాంధీ 'షా' ఎదుట హాజరైంది కాని ప్రమాణం చేసి ఆయన కోరిన పదకొండు అంశాలమీద "సాక్ష్య వాఙ్మూలం" చెయ్యనన్నది "ఈమెమీద భారత శిక్షాస్మృతి 179వ సెక్షను క్రింద ఒక మాజిస్ట్రేటు కోర్టులో కేసు పెట్టండి" అంటూ తన కార్యదర్శికి ఆదేశాలివ్వటానికి ముందు జనవరి 11, మధ్యాహ్నం— మున్మూరు "మీరు వాఙ్మూలం యివ్వకపోతే దాని పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. అని హెచ్చరించి మరీ సదరు ఉత్తర్వులు జారీచేశాడు— కాని ఇందిరమ్మ కూడా అంతకు ముందు యించుమించు అన్నిసార్లు "షా సంఘం జరుపుతున్న యీ విచారణ— రాజ్యాంగంలోని 75 (4)వ ఆర్టికల్‌ని 'త్రోసిరాజని' చేస్తున్నది అని వాదించడమే గాక— తనకు కూడా తన వద్దగల సమాచారం వెల్లడించాలనే యెంతగానో వున్నప్పటికీ— ఒకటి :— తను ప్రధాన మంత్రిగా చేసిన ప్రమాణం ప్రకారం ప్రభుత్వ రహస్యాలు వెల్లడి చేయలేక పోతున్నానని— రెండు :— షా సంఘం రాజ్యాంగ విరుద్ధమైనందువల్ల — తాను రాజ్యాంగ బద్ధురాలైనందువల్ల కూడా మళ్ళీ ప్రమాణం చేసి— యిదివరకటి ప్రమాణాన్ని భగ్నం చేయలేనని సుదీర్ఘమైన ఉపన్యాసంలో వివరించింది !

మార్చి 20 న ప్రజల 'తీర్పు' ననుసరించి పదవీచ్యుతురాలైన శ్రీమతి యిందిరా గాంధీ తదుపరి రాజకీయ జీవితంలో అక్టోబర్ 3, 1977—జనవరి 2, 1978 జనవరి 11, 1978 కూడా మూడు ముఖ్యమైన తేదీలు — అక్టోబర్ మూడున ఆమెను అరెస్టు చేయడానికి వెళ్ళిన అధికారులను చూసి— "ఏమయ్యా! బేడీలు తేలేదా?" అని నిలదీసిన ఆమె "హైడ్రామా" తయారు చేసిందన్న ఆరోపణకి గురి అయింది.

అయితే నాటి సంచలనం— జనవరి 2 న కాంగ్రెసును చీల్చి— "నేనే అధ్యక్షురాలిని" అని ప్రకటించినప్పుడు— అంత 'హైడ్రామా'గా తయారు కాలేదు—అదంతా "మామూలు వ్యవహారంగా" జరిగింది !

తాజా కాలమ్



రాజ్యాంగ బద్ధురాలైన మాజీ నియంత

"ఛార్జీలు ఏవీ ?-"

తిరిగి జనవరి 11, 1978 న ఆమె విచారణ సంఘం యెదుట "నా మీద మీరు మోపిన "ఛార్జీలు" ఏవీ ?... నేరం మోపండి విచారించండి— మీరింత వరకు సాక్ష్యం నమోదు చేసుకున్న వందమంది సాక్షులని "అడ్డ ప్రశ్నలు" వేసే అవకాశం నాకు యివ్వండి అని నిలదీసి— శ్రీ ఛోటేలాల్ 'షా'ని 'ప్రాసిక్యూషన్' చర్యకు పురికొల్పినప్పుడు దేశ వ్యాప్తంగా ప్రజలలో సంచలనం సృష్టించ గలిగింది

'షా సంఘం కూడా హోం మంత్రి చరణ్ సింగ్ ఆధ్వర్యంలో జనతా గవర్నమెంటు తనని 'అపఖ్యాతి'పాలు చేయటానికి చేయిస్తున్న "తతంగంలో ఒక భాగమేనని" ఆమె నమ్మకం— దాన్ని స్పష్టంగా వెల్లడి చేస్తూ— కోర్టుకీ జైళ్ళకీ తాను భయపడనన్న సహజ ధోరణిలోనే ఆమె షా సంఘాన్ని "న్యాయం చేకూర్చలేని — సత్యాన్ని వెలికి తీయలేని రాజ్యాంగ విరుద్ధ సంఘంగా! అభివర్ణించి మరీ- పాటియాలా భవనం నుంచి తన నివాస గృహానికి వెళ్ళి పోయింది !

ఒకప్రక్క ఆరుమాసాల జైలు లేదా వెయ్యిరూపాయిల జుల్మానా— లేదా రెండూ విధించజేసే 179వ సెక్షన్ క్రింద ప్రాసిక్యూషన్ కేసు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తూనే 'షా సంఘం' తనను .

(50 వ పేజీ చూడండి)

కాలానికి దూరంగా..

బి.వి.రమణరావు



(గత సంచిక తరువాయి)

"మీరు ఇటీవల రాసిన 'రాబందు రాయిబారం' నవల తీసుకోండి. మీ కున్న పేరు ప్రఖ్యాతుల దృష్ట్యా సమాజానికో సందేశాన్నివ్వాలన్న ఆకాంక్షతో దాన్ని రాసి వుంటారు. అందుకే అది అసహజంగానూ పేలవంగానూ వుంది. ఏవో ఆదర్శాలు మనస్సులో పెట్టుకుని పాత్రలకి సంకెళ్లు వేసి రైలును పట్టాలమీద నడిపించినట్టుగా వుంది మీ నవల పోకడ కథానాయకుడు ప్రసాద్ మనిషికాదు దేవత. రూపం, ధైర్యం, చదువూ, సంస్కారం ధైర్యం, దానం, ధర్మం, త్యాగం మూర్తీభవించిన సినిమా హీరో."

"అవును అలాంటి పాత్రనే సృష్టించాలనుకున్నాను ఆ స్వాతంత్ర్యం నాకులేదా!"

ఉందనుకున్నారు కనకనే మీ నవల ఈనాటి సామాజిక వ్యవస్థతో సంబంధంలేని పరమ బుద్ధిమంతుడి కథలా అసహజంగా వుంది. అదే విధంగా మీరు సృష్టించిన జయ పాత్ర కూడా దెబ్బతింది. చదువూ ప్రపంచ జ్ఞానం వుండి బాధ్యత ఎరిగిన వ్యక్తిగా సృష్టించేరు ఆ అమ్మాయి ఓ కుర్రాణ్ణి ప్రేమించింది. తల్లిదండ్రుల్ని ధిక్కరించింది. గర్భవతి అయింది చివరికి దగా పడింది. ఆమె మీద మీరెక్కడలేని సానుభూతి చూపెట్టేరు. ఆ కుర్రాణ్ణి దుర్మార్గుడన్నారు. ఆ కుర్రాడి తల్లిదండ్రుల్నీ సమాజాన్నీ దుయ్యబట్టేరు."

"అవును జయకి అన్యాయంజరగలేదా?"

"అది కేవలం ఇద్దరి వ్యక్తుల పరిమితమైన సమస్య అందులో సమాజం బాధ్యతేమీలేదు పరస్పరం ప్రేమించుకున్నారు. ఆ ప్రేమించుకోవడంలో ప్రేయసీ ప్రియులు ఒకళ్లనొకళ్లు ఎంత బాగా అర్థం చేసుకుంటారో తెలుసుకోడానికి వాళ్లేతార్కాణం. దాన్నిబట్టి ఈ ప్రేమ నిజ స్వరూపమేమిటో. ఎంత తాత్కాలికోద్రేకమో ఎంత ప్రమాదకరమో తెలుస్తుంది."

"ఆ పరిస్థితుల్లో జయగతేం కావాలి?"

"నన్నడిగితే నిలువునా కిరసనాయిలుపోసి కాల్చమంటాను. దాంతో అలాంటి ఆడాళ్ళకి బుద్ధొస్తుంది. దానికి చట్టం ఒప్పుకోదు కనక ఆ అమ్మాయి ఏ ధైర్యంతో తల్లిదండ్రుల్ని కూడా కాదని తాను వలచిన పురుషుడే దేవుడని నమ్మి లేచి వచ్చిందో ఆ ధైర్యంతోనే పరిస్థితుల్ని ఎదుర్కోవాలి. ఆమె పైన ప్రత్యేక సానుభూతి అనవసరం."

"దారుణం !"

"సమాజంలో వున్న నీతికీ అవినీతికీ స్త్రీ పురుషులిద్దరూ భాగస్వాములే. ఒక స్త్రీని మోహించి మరో స్త్రీని పురుషుడే దగా చేస్తే ఒక పురుషుణ్ణి ప్రేమించి మరో పురుషుణ్ణి దగా చేసిన స్త్రీలూ వున్నారు."

"మొగాడి బాధ్యత మరిచి పోతున్నారు."

"భారత స్త్రీని మాతృమూర్తిగా, గృహలక్ష్మిగా తీర్చిదిద్దడం మన సంస్కారం అనాదిగా ఆమె ఆ గౌరవాన్ని అందుకుంటూనే వుంది. అలాంటి స్త్రీకి అన్యాయం చేసిన మొగాణ్ణి ఖండించ వల్సిందే. స్త్రీ పురుషులిద్దరూ సమానమే అనే ప్రాతిపదిక మీద ఆధారపడింది పాశ్చాత్యుల సంస్కారం. పురుషుని రక్షణ స్త్రీకి అవసరం, ఆమెని ఆదరించి గౌరవించడం పురుషుడి ధర్మం అనుకున్నప్పుడు స్త్రీ మన సాంప్రదాయాన్ని సంస్కారాన్ని గౌరవించాలి. అంతేకాని మన సాంప్రదాయం ప్రకారం సానుభూతి రక్షణా యిస్తూ పాశ్చాత్యుల పద్ధతిలో ఆమెకి స్వేచ్ఛ యివ్వాలనుకోవడం సిల్లీగా వుంది."

"ఇదంతా పాత చింతకాయ పచ్చడి వాదన. సహగమనం, బాల్య వివాహాలూ వితంతువులకి జుట్టు తీయించడం లాంటి మూఢాచారాలు కూడా మన సాంప్రదాయమే. వాటిని మనం సంస్కరించ లేదా ?" అన్నారు వాళ్ళు మండి.

"ఏదో ఓ నైతిక ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకుని ఆ నాడు ఆ ఆచారాల్ని సమాజం సృష్టించు కుంది. ఆ నాడు ఆ సమాజానికి ఆ కట్టు బొట్లు గౌరవించే ఆత్మవిశ్వాసం, దైవభక్తి వున్నాయికాబట్టి అవి ఆచారాలుగా వర్ధిల్లేయి. కాలానుగుణ్యంగా అటువంటి తీవ్రమైన కట్టుబొట్లకు తట్టుకునే నైతిక బలం విశ్వాసం సడలడం వలన వాటిని మనం మానుకున్నాం. ఈనాడు వాటిని మూఢ విశ్వాసాలనడమోరకమైన మూఢ విశ్వాసం. ఒకే మొగాడు ఒకే స్త్రీ జీవితాంతం భార్యాభర్తలుగా కలిసుండాలనే ఈనాటి సామాజిక వ్యవస్థకి సంబంధించిన ఆచారం కొంత కాలానికి మూఢ విశ్వాసంగా అనాగరికంగా అనవసరంగా కనబడొచ్చు."

"కావచ్చు. పరిణామం సహజం. సుఖ సంతోషాల ప్రమాణాన్ని పెంచుకోడానికి కావల్సిన మార్పుల్ని కాలానుగుణ్యంగా సమాజం సృష్టించుకుంటుంది."

"నీతి పాపభీతి దైవభక్తి అనే పునాదులమీద భారతీయ సంస్కృతి ఆధారపడింది. ఏ మార్పులు వొచ్చినా మన విశ్వాసాలకి భిన్నంగా వుండే సంస్కృతికిక్కడ మనుగడలేదు. ఏ విశ్వాసాలని మూఢ విశ్వాసాలని అలక్ష్యం చేస్తున్నామో వాటి ఔన్నత్యాన్ని అవసరాన్ని పాశ్చాత్యులు స్వానుభవంవల్ల గుర్తించి గౌరవిస్తున్నారు"

కాలానికి దూరంగా

"మీకు తిరుమల్రావు రచనలు బాగా వంటబట్టినట్టున్నాయి." అన్నాను. ఇటీవల తిరుమల్రావు రాసిన నవలలో ఈ ధోరణి కనబడుతుంది.

*　　*　　*

నిరంజన్‌ని చూసి నిర్ఘాంతపోయాను. ఆనవాలు పట్టలేనంత చిక్కి శల్యమయ్యేడు. నన్ను చూడగానే ఎక్కడ లేని సంతోషంతో పక్కమీద లేచి కూర్చుని నా రెండు చేతులూ పట్టుకున్నాడు.

"మీకు జాబు రాశానుకాని వస్తారోరారో అని సందేహించేను. నిజంగా యింత దయకి నేను పాత్రుణ్ణి కాను." అన్నాడు.

"మీతో పదినిమిషాలు గడిపిన వాడెవడూ అవకాశం దొరికితే మళ్ళీ కలుసుకోకుండా వుండలేడు చాలా కాలానికి మళ్ళీ కల్సుకున్నాం" అన్నాను.

"తెలుగు రచయితల మహాసభలకి కలుసుకోవడమే మళ్ళీ నాటికి నేడు, తిరుమలరావుగారు ఇంత అకస్మాత్తుగా పోతారనుకోలేదు. కనీసం రెండు రోజులకో సారొచ్చి ఒకటి రెండు గంటలు గడిపే వారిక్కడ."

"ఏభయ్యేళ్ళు నిండాలేవు. ఒడుదుడుకులు లేని సాఫీ అయిన జీవితం. గుండె పోటొచ్చి పోయాడంటే నమ్మలేక పోయాను." అన్నాను. అతనికి కొద్దిగా బ్లడ్‌ప్రెషర్ వున్నట్టు నాకు రాసిన మాట వాస్తవమే. అయితే అది తన రచనల మూలంగా సంక్రమించిన మానసిక ఉద్రిక్తత వల్లనై వుంటుందనీ విశ్రాంతి పట్ల అలక్ష్యం చేయొద్దనీ రాశాను.

"తాగుడు మానెయ్యి, సిగరెట్ మానెయ్యి చచ్చిపోతావు, చచ్చిపోతావు అంటూ డాక్టర్లు నన్ను రెండేళ్ళుగా బెదిరిస్తున్నారు. గేస్ట్రిక్ అల్సర్‌కి ఆపరేషన్ చేశారు. ఎపెండి సైటిస్‌కి ఆపరేషన్ చేశారు. సెరిబ్రల్ థ్రాంబోసిస్ అన్నారు బ్రతికేను. ఇప్పుడు లివర్ కేన్సర్ అన్నారు. మరి నాకు చావు రాలేదు."

"ఎన్నాళ్ళుండాలీ హాస్పటల్లో?" అడిగాను. వెంటనే నా తెలివి తక్కువ ప్రశ్నకి నేనే సిగ్గుపడ్డాను.

"భూమ్మీద నూకలున్నన్నాళ్ళూ ఈ గదే నా ప్రపంచం. ఇంక రెండు మూడు నెలలకంటే బ్రతకనంటున్నారు. కాని నాకు నమ్మకం లేదు. ఇలా మరో ఏడాది డేకిం చేసినా డేకించేస్తాను." అన్నాడు నవ్వుతూ. నాకూ అలాగే అనిపించింది, అతని మనోబలం చూస్తుంటే. అయితే అతని శరీరం కేసి చూస్తే రోజుల్లెక్కపెట్టాలన్నట్టున్నాడు.

"తప్పకుండా బ్రదర్. కీపప్ ది స్పిరిట్" అన్నాను.

"మనిషి చావు రావడంవల్ల పోస్తాడు. ఏ రోగంవల్ల ఏ కారణంగా ఎలా చచ్చేడూ అన్నది డాక్టర్లకు సంబంధించిన విషయం. పిడుగులాంటి తిరుమల్రావుగారు పోయేక చావంటే అసలే భయం పోయింది."

"చస్తామేమోనన్న భయంతో చచ్చినవాడిలా బ్రతకడం కంటే చచ్చేవరకూ నిర్భీంతగా బ్రతకడం వివేకవంతుడిలక్షణం. ఏమిటి విశేషాలు చెప్పండి?" అన్నాను నాకు కబురంపిన అవసరమైన పనేమిటో తెలుసుకుందామని.

"మీరు మూడు పనులు చేసి పెట్టాలి. మళ్ళీ మనం కలుసుకోకపోతే యివే నా తుదికోరిక లనుకోండి.''"

"ఏమిటవి?"

"తిరుమల్రావుగారి పిల్లలకి ఏభై వేలివ్వదల్చుకున్నాను. చెక్కు రాసిస్తాను వాళ్ళ పేర ఫిక్సెడ్ డిపాజిట్ వేస్తారో ఏంవేస్తారో ఆలోచించి చెయ్యండి. వాళ్ళు నన్నెరుగరు. నే నిచ్చేనంటే మొహమాట పడొచ్చు."

"తప్పకుండా."

"మరో యిరవై వేలకి మీపేర చెక్కు రాసిస్తాను. మీకు తెలిసిన పబ్లిషర్స్ కిచ్చి తిరుమల్రావు రచనలు స్పెషల్ డీలక్స్ వాల్యూమ్స్ కింద వేయించి రేట్లు తగ్గించి అమ్మేలాగ ఏర్పాటు చెయ్యండి. ఆపుస్తకాల మీద వచ్చే రాయల్టీ ఆయన పిల్లలకి పొచేలా ఏర్పాటు చేయండి."

"మీ ఔదార్యం చూస్తే నేనే తిరుమల్రావునైతే ఎంత బాగుండేదా అనిపిస్తుంది" అన్నాను.

"నా మూడో కోరికదే మీరు తిరుమల్రావుగారవాలి కొంతకాలం." అన్నాడు నవ్వుతూ.

"అంటే?"

"ఏంలేదు. తను రాయదల్చుకున్న తర్వాత నవల తాలూకు కథంతా నాకు చెప్పేడు దాన్ని మీకు చెబుతాను. మీరా కథ పూర్తిచేసి తిరుమల్రావుగారి పేర పత్రికకు పంపాలి."

"తిరుమల్రావు రచనలకో ప్రత్యేక స్థానముంది. నేను రాసి తిరుమల్రావు రచనని చెప్పి నమ్మించలేను"

"పోనీ మీ పేరులోనే రాయండి"

"నా కలాంటి గ్రంథచౌర్యం యిష్టం లేదు. ఇంతకీ ఆ కథ నన్ను రాయమనడం కంటే మీరే రాయొచ్చుగా. మీ పేరనే వేయిస్తాను" అన్నాను సంతోషిస్తాడేమోనని

"ఈ లోకం నేనొక రచయితనంటే నమ్మదు. రచయితగా నేనొక అనామకుణ్ణి. మీరు తిరుమల్రావుగారికి ఆప్త మిత్రులు. మంచి పేరున్న రచయిత. అందుచేత మీ పేరు పెట్టి రాయమన్నాను."

"ఆ నవల అసంపూర్తిగా వుండటం వల్లనే తిరుమల్రావుకి మంచి పేరొస్తుంది" అన్నాను.

"పూర్తిచేస్తే అతని ఆత్మ శాంతిస్తుంది."

ఆయుర్దాయానికి నడక !

ఒక వృద్ధుడు సహస్ర మాసోత్సవం చేసుకుంటున్నాడు. దానితోనే ఆయన వివాహ స్వర్ణోత్సవం కలిసి వచ్చింది. ఆ వయస్సులో మంచి దృఢంగా ఆరోగ్యంగా వున్నాడు. చూసిన వాళ్ళంతా మెచ్చుకున్నారు ఇంత ఆరోగ్యంగా దృఢంగా వుండడానికి ఆయన జీవితంలోని కిటుకేమిటో చెప్పమని కూర్చున్నారు.

ముసలాయన వాళ్ళని చూసి "ఓరి అమాయకుల్లారా!" అన్నట్లు ఓ చిరునవ్వు నవ్వేడు.

"ఏముంది? పెళ్ళి రోజున నేను మా ఆవిడా ఒక నియమంచేసుకున్నాం. మాకేమన్నా మాట పట్టింపు వస్తే, నేను నిశ్శబ్దంగా మా వూరి చెరువు చుట్టూ మూడు ప్రదక్షిణాలు చెయ్యాలని నియమం. రోజూ చేసిన ఆ ప్రదక్షిణలు నా ఆరోగ్యాని కెంత వుపయోగకరం అయ్యేయో చూస్తున్నారు కదా !"

"మనం యిష్టం మెచ్చినట్టు పూర్తి చేస్తే అతని ఆత్మ శాంతి మాటటుంచి పిశాచమై పీక్కుతింటాడు."

"ఆ తిరుమలరావే ప్రత్యక్షమై మిమ్మల్ని రాయమంటే !"

"ఎందుకు లెద్దురూ యీ అర్థంలేని వాదన. పోయిన తిరుమలరావెలాగపోయాడు మన ప్రయోగాలతో సాహిత్యపరంగా కూడా అతన్ని చంపడ మెందుకు !" అన్నాను, ఇంక ఆ ప్రస్తావన ఆపుతాడేమోనని.

"అర్థం వుంది – ఆ తిరుమలరావే మిమ్మల్నిప్పుడు ప్రార్థిస్తున్నాడు" అన్నాడు నా రెండు చేతులూ పట్టుకుని. ఒక్క క్షణం నిర్ఘాంత పోయాను

"ఏమిటి మీరనేది ! ఇన్నాళ్ళూ తిరుమలరావు పేర రాసింది మీరా !"

"అవును మనిద్దరికీ తిరుమలరావుగారు ఆత్మీయులు కాబట్టి ఈ రహస్యం మీ దగ్గర బయట పెట్టాను. ఆయన కూడా మీలాగే మొదట నిరాకరించారు. చివరికి నా బలవంతం మీద ఎంతో దయతో ఆయన పేరు ఎరువిచ్చి పుణ్యం కట్టుకున్నారు. నాలో వుండే రచయితకి జీవం పోసి పుణ్యం కట్టుకున్నారు. ఆయన పోవడంతో నాలో నాలుగు ప్రాణాలు పోయాయి. మిగిలిన యీ కాస్త ఊపిరినీ నిలబెట్టమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను." అన్నాడు నల్లద్దాల కళ్ళజోడు తీసి కన్నులు తువ్వాలుతో సున్నితంగా తుడుచుకుంటూ. అతనికి ఒక కన్ను పోయిందని అప్పుడే గమనించాను.

"ఇంతటి మేధావంతుడవై వుండీ, బ్రదర్, ఎందుకిలా కీర్తి ప్రతిష్ఠల్ని కాలదన్ని అజ్ఞాతంగా వుండాలనుకున్నావో నాకర్థం కాలేదు." అన్నాను.

"నా రచనలు ప్రజాదరణ పొందడమే నేను కోరేది. నా రచనే నేను. ఈ శరీరం నేనుకాదు. అందవికారమైన నా శరీరం అంటే నా కసహ్యం. నా రచనలమీదుండే ప్రజల అభిమానాన్ని కుళ్ళి రాలడానికి సిద్ధంగావున్న నా శరీరంమీదకి మళ్ళించలేను. ఇతరులు నామీద జాలిపడటం నేను భరించలేను ప్రజల గౌరవాన్ని మన్ననల్ని అందు కోడానికి తిరుమలరావుగారి శరీరాన్ని వాడుకున్నాను నా రచనల్ని ప్రజలు మెచ్చుకోవడమే నాకు ఆనందం."

"భగవంతు డెంత నిర్దయుడు! ఇన్ని తెలివితేటలు ఇంత ఐశ్వర్యం యిచ్చి మీకు ఆరోగ్యం యివ్వలేదు!" అన్నాను.

"పొరపాటు భగవంతుడు దయామయుడు కార్యదక్షుడు కనకనే నాకు మానసిక ఆరోగ్యాన్నిచ్చి నేనుండటానికి మాత్రం అహంకార మమకారాలు పెంచుకోకుండా ఈ రొచ్చుకొంపలాంటి శరీరాన్నిచ్చేడు" అన్నాడు చిరునవ్వుతో.

ఇటీవల సీరియల్‌గా వొచ్చిన "కాలానికి దూరంగా" అన్న నవల తాలూకు నల్లిశర్మ తిరుమలరావుకు పెద్ద యెత్తున సన్మానసభ ఏర్పాటు చేశారు ఆ సభ జరగకముందే తిరుమలరావు కన్నుమూశాడు. ఒక ఖరీదయిన జరీ కాశ్మీర్ శాలువా ఒక ఫౌన్‌టెన్ పెన్ సెట్ ఒద్దంటున్నా బలవంతంగా నా చేతులో పెడుతూ "తిరుమలరావు గారికి ప్రత్యేకంగా నా

కృతజ్ఞత చెప్పుకోడానికి నా చేతుల్లో యిక్కడే సన్మానం చేద్దామని యిది తెప్పించేను. ఆ రోజుకు నేనుంటానో వుండనో అనుకున్నాను కాని ఆయనే వుండడనుకోలేదు. ఆయనకి ఆప్త మిత్రులు, అన్ని అర్హతలూ వున్నవారు కనుక మీరుస్వీకరిస్తే నేను సంతోషిస్తాను. ఈ కాస్త కోరిక చెల్లించండి'' అన్నాడు.

'కాలానికి దూరంగా' అన్న నవల సంచలనం తీసుకొచ్చిన ఒక విప్లవాత్మకమైన రచన. అదొక లేడీ డాక్టరు జీవిత గాథ. అగర్భ శ్రీమంతురాలు, డాక్టర్ పరీక్ష పాసయింది— మనస్తత్వ శాస్త్రంలో ప్రత్యేకమైన కృషి చేసి పెద్ద సైకియాట్రిస్ట్ అన్న పేరు గడించింది. ఎందరెందరి మానసిక వ్యాధులో కుదిర్చింది. ఒకే ఒక వ్యక్తి మనస్తత్వం మాత్రం తనకి అర్థం కాలేదు. అతను తన భర్త. అడ్వొకేట్‌గా డబ్బు సంపాదించలేకపోయినా పేరు సంపాదించుకున్నాడను కుంటుంటే, చివరికి ఆ వృత్తికి కూడా స్వస్తి చెప్పి సంఘసేవంటూ రాజకీయాల్లో దిగేడు. భర్త కొరకరాని కొయ్యయ్యేడనీ, ఇక అతనితో జీవించడం అసంభవమనీ, తీరని కోరికలతో వివాహ బంధం తెంపుకుని విదేశాలు వెళ్ళింది.

ధనం యౌవ్వనం యివ్వగలిగిన ఆనందాన్నంతా ఆస్వాదించింది. విదేశ దేశాల్లో వైవాహిక సంబంధాలూ, కుటుంబ సభ్యుల అనుబంధాలు తాలూకు సమస్యల్ని పరిశీలించి సలహాలిచ్చేది. ఎన్నెన్నో రకాల సమస్యలు! తన స్నేహితుల్ని, తన ప్రేమ కలాపాల్ని, తన అనుభవాల్ని వైజ్ఞానిక దృష్టితో, విమర్శాత్మకదృష్టితో పరిశీలించేది. ఏదో తీవ్రమైన లోటు అశాంతి ఆమెని వెంటాడసాగింది. తనకు ఏంకావాలి? ఏం చేసింది? ఏం సాధించింది? తనూ ఆ రకం పేషెంటేనా? తనకి అన్నీ వున్నా ఏదీలేదని ఆమెకీవ్యథ?...

పశువుల్లో కుక్కల్లో పిల్లుల్లో కోతుల్లోనూ ఆడ జంతువులకుండే తాపత్రయం, మమకారం, బాధ్యత మొగ జంతువులకెందుకుండవు? మనిషికూడా ఇలాంటి జంతువేనా? పురుషుడికక్కర్లేని బరువు బాధ్యతలు మమకారం స్త్రీకిమాత్రం ఎందుకు? అడుగడుగునా యివే ప్రశ్నలు.

ఆమె అన్వేషణ ఫలితంగా ఒక సత్యాన్ని గ్రహించింది. స్త్రీ ప్రకృతి సిద్ధంగా తనను తానే అర్పించుకునే త్యాగమూర్తి. సోదరిగా భార్యగా, తల్లిగా ఆమె ఆశించిన ప్రేమకు వెయ్యిరెట్లు ప్రేమను గుమ్మరించే ఆశాజీవి. ఆత్మార్పణమే ఆమె జీవిత పరమావధి. తనను తాను అర్పించుకోకుండా ఏకాకిగా స్త్రీ జీవించడం ప్రకృతి విరుద్ధం.


అనారోగ్యంతో దారిద్ర్యంతో భర్త కృంగిపోతున్నాడని తెలిసి తన శేష జీవితాన్ని అతని సేవకే అంకితం చెయ్యాలన్న ఆలోచన కలగగానే ఆమె మనస్సు నిర్మలమై ఆనందంలో తేలి పోయింది. ఆనిర్ణయం తీసుకున్న సాయంత్రం ప్రపంచ వనితలకల్లా భారత స్త్రీయే ఆదర్శ మూర్తి అనీ, వైవాహిక బంధంలో వుండే పవిత్ర విశ్వాసమే భారతీయ సంస్కృతికి ఆధారమనీ మహోద్వేగంతో క్లబ్బులో ఉపన్యసించి సాయంత్రం ప్లేన్లో బయల్దేరి మర్నాడు భారతదేశం చేరుకుంది. రెక్కలు కట్టుకు వాలినా అప్పటికే ఆలస్యమై పోయింది. ఇదీ టూకీగాకథ ఇంచుమించు ఒక సంవత్సరం పాటు వారపత్రికలో సీరియల్‌గా వొచ్చి సాహిత్య జగత్తులో సంచలనం కలిగించింది.

నేను తిరిగి వొచ్చేసేముందు నిరంజన్ త్వరలో కథరాసి పంపడానికీ దాన్ని అవసరమైన హంగులతో నేను నవలగా రూపొందించి తిరుమలరావు పేరనే ప్రచురించడానికి ఒప్పందం చేసుకున్నాం. కొన్నిముఖ్యమైన సన్నివేశాల గురించికూడా చర్చించాం. పదిహేను రోజుల తర్వాత నేను స్క్రిప్టు కోసం ఎదురు చూస్తుంటే అతను మరణించినట్టు వార్త వచ్చింది. వార్డుబాయ్ వుత్తరం రాశాడు. అతనికి సీరియస్‌గా వుందని తెలియగానే, రెండు రోజులకు పోతాడనగా పోర్ట్ బ్లెయిర్ నుంచి వాళ్ల కంపెనీ డైరెక్టర్లంతా వచ్చేరుట. అంత్యక్రియలు అండమాన్‌లోనే జరగాలని శవాన్ని ప్లేన్లో తీసుకెళ్ళేరుట.

* * *

అరుణా విశ్వనాథ్‌ల దగ్గిర్నుంచి శుభలేఖొచ్చింది. వాళ్ళు కొత్తగా కట్టుకున్న 'నిరంజన్ కుంజ్' లో గృహప్రవేశం. విందు భోజనానికి రమ్మని ఆహ్వానం. నిరంజన్ కుంజ్ పేరు బాగుంది. నాకు నిరంజన్ జ్ఞాపకమొచ్చేడు. అప్పటికి అతనుపోయి ఆర్నెల్లయింది. అతనిచ్చిన కాశ్మీర్ శాలువా కూడా జ్ఞాపకమొచ్చింది. దానికింకా పసుపుబొట్టు పెట్టలేదు.

నేను వెళ్ళేటప్పటికి వాళ్ళిద్దరూ పీటల మీద కూర్చున్నారు. డోలు సన్నాయి వాయిద్యాలు నిర్విరామంగా మోగుతున్నాయి. నన్ను చూడగానే వాళ్ళిద్దరూ ఒకళ్ల మొహాలొకళ్ళు చూసుకుని గుసగుసలాడుకుని కుర్చీలో కూర్చోమని సౌజ్ఞ చేశారు కూర్చోగానే "ఇదేదో సన్మానం బాపతులా



గుండే!'' అని నేను కండువాలాగ కప్పుకున్న శాలువా జరీ అంచు పట్టుకుని ముత్యం పలకరించగానే అరుణ విశ్వనాథ్ దంపతులు కూడా నా వైపు తేరి పారి చూడటాని కదే కారణమని గ్రహించాను.

భోజనాలకి కూర్చునే ముందు విశ్వనాథ్ నా దగ్గిరకొచ్చి శాలువాని పరిశీలనగా చూస్తూ "చాలా బాగుంది. ఎక్కడ కొన్నారు ?'' అని అడిగేడు.

"కొనలేదు. ఓ మంచి స్నేహితుడు ప్రజెంట్ చేశాడు. అంత బాగుందా !'' అన్నాను.

"ఆ ర్నెల్ల క్రితం నేనూ అరుణా హైదరాబాదంతా తిరిగి తిరిగి యిలాంటిదే కొని మా బావమరిది కిచ్చేము'' అన్నాడు.

"మీ బావమరిది పేరు ?''

"నిరంజన్ ఇండో అండమాన్స్ మేనేజింగ్ డైరెక్టర్. పాపం ! కేన్సర్ జబ్బుతో పోయేడు'' అన్నాడు.

"ఆ నిరంజనే నాకిచ్చేడు. అరుణ నిరంజన్ చెల్లెలా ?'' అన్నాను ఆశ్చర్యంగా. అప్పుడే అర్ధమయింది యింటికి 'నిరంజన్ కుంజ్' అని ఎందుకు పేరెట్టుకున్నారో.

"అవును తిరుమ్మలావు గారికి సన్మానం చెయ్యాలి మంచి కాశ్మీర్ శాలువా తీసుకు రమ్మని పురమాయిస్తే యిది తెచ్చి యిచ్చేం. అది మీ దగ్గిరకి రావడం నాకెంతో సంతోషంగా వుంది. అరుణ కూడా బ్రహ్మానంద పడుతుంది'' అన్నాడు.

తిరుమ్మలావు కోసం కొన్న శాలువా నా దగ్గిరకి రావడంవల్ల వీళ్లిద్దరూ యింత ఆనందిస్తున్నారంటే వాళ్లకి తిరుమ్మలావంటే ఎంత దురభిప్రాయముందో తెలిసింది. బోజనాలయ్యేక అందరూ వెళ్ళిపోయినా, వాళ్ల నిర్బంధం మూలంగా కాస్సేపు కూర్చున్నాను. మాటల సందర్భంలో నేను గ్రహించిందేమిటంటే తిరుమ్మలావు పేరుతో వొచ్చిన నవలలు నిరంజన్ రాసినవేనని అరుణకి తెలుసు. గత మూడు సంవత్సరాలుగా నిరంజన్ హైదరాబాద్ వొచ్చినప్పుడల్లా అరుణ వెళ్ళి అతని యోగ క్షేమాలు తెలుసుకుని ఒకటి రెండు రోజులుండి వచ్చేది. తిరుమ్మలావుతో కూడా నిరంజన్ గదిలోనే పరిచయమైంది. అయితే నిరంజన్‌కి చేసిన వాగ్దానానికి కట్టుబడి తిరుమ్మలావు రచనల నిజ స్వరూపాన్ని గురించి ఎక్కడా నోరు మెదపలేదు.

'మా పాప' శిల్పంలో కూడా అక్కడక్కడ స్ఫురించే చక్కని నగిషీపని నిరంజన్‌దే అయి వుంటుందన్న సందేహాన్ని నివృత్తి చేసుకోడానికి "మా పాప వ్రాత ప్రతి నిరంజన్ చూసేడా?'' అని అడిగేను.

"చూసి చాలా మెచ్చుకున్నాడు. అసలు మా అన్నయ్య తన కథలూ నవలలూ నా పేరుతో పత్రికలకి పంపమన్నాడు; నేనే వొద్దన్నాను.'' అంది. నిరంజన్ నాకు చెప్పిన విషయాల దృష్ట్యా అది శుద్ధ అబద్ధమని నాకు తెలుసు. అయితే తన అన్న రాసిన వాటికి మరొకడు పేరు ప్రతిష్టలు సంపాదిస్తున్నాడనే అసూయ చెల్లెలికుండటంలో ఆశ్చర్యంలేదు.

"మన మెవళ్లం నిరంజన్ స్థాయికి చేరలేము. నేను వేరు, నాలో వుండే రచయిత వేరు. నా దృక్పథం, నా నమ్మకాలు

డాక్టర్ సలహాలు

కె. వి. కె — ఏలూరు

నా వయస్సు 19 సం. లు. నేను 10 సం. ల నుండి కళ్ళజోడు పెట్టుకుంటున్నాను. అద్దాలు చాలా దళసరిగా వుంటాయి. జీవితాంతము ఇలా పెట్టుకోవలెనా లేక ఏదైనా వేరే మార్గము వున్నదా?

దృష్టిలోపం ఏ వయసులో వచ్చినా—ఆ లోపం ప్రకృతి సిద్ధంగా ఏర్పడేదే గనుక దాదాపు జీవితాంతం కళ్ళజోడు వాడవలసినదే! అద్దాలు దళసరిగా ఉండటం ఆ అద్దాల పవర్‌ను బట్టి ఉంటుంది. ఇక వేరే మార్గాల విషయంలో — కాన్‌టాక్ట్ లెన్స్ అనేవి వాడుకలో ఉన్నాయి. ప్రయత్నించి చూడండి. కానీ నా సలహా ప్రస్తుతం మీరు వాడుతున్న కంటి అద్దాలే వాడటం మంచిదనే. పై రెండు మార్గాల మినహా వేరే ఏ ఇతర మార్గాలు లేవు.

టి. ఎస్ — గుంటూరు

నా వయస్సు 16 సం. లు. 4 సం. ల నుండి నా చేతికి వేళ్ళపై పులిపిరి కాయలులాగ వచ్చినవి. మొదట చిన్నవిగా వుండి క్రమేణా పెద్దవగుచున్నవి. మందులు వాడినా ప్రయోజనము కన్పించ లేదు. ఇవి గట్టిగాను తెల్లగాను వున్నాయి. వీటికి నివారణోపాయము తెల్పండి.

వీటిని మొల్లస్కం కన్‌టేజియోసమ్ అని అంటారు. ఇవి సాధారణంగా 5 సం. ల వయసు నుంచి 20 సం. ల వయస్సులోపు ఎక్కువగా ఏర్పడతాయి. ఇవి అరచేతులు, అరికాళ్ళలోని చర్మంలో తప్ప మిగతా ఏ భాగంలోని చర్మంలోనైనా రావచ్చును.

వీటిని— అడుగు భాగం నుంచి సమూలంగా వైద్యులచే తీసివేయించుకోవటం వల్ల నయం చేసుకోవచ్చును. 11 వ నెంబరు బ్లేడు (స్కాల్‌పెల్ నెం. 3 కి సరిపోయేది) ను వాడటంమంచిదని అనుభవ పూర్వకంగా తెలుసుకోబడింది.

జి. టి. పి — హగిరి

మా పాప వయస్సు 7 మాసములు. పుట్టిన రోజు నుండి పాప కుడి కన్ను కొంచము పెద్దదిగా కన్పడుచున్నది. పరీక్షగా చూస్తే తేడా కనిపిస్తోంది. దీనికి తగిన వైద్యము తెలుప ప్రార్థన.

పుట్టగానే ఏర్పడిన, లేక కనపడిన — కొన్ని లక్షణాలను గురించి ఎక్కువగా బాధపడటం అనవసరం.

కుడి కన్ను మీరు చూసినది పెద్దదిగా కనిపించడం నిశ్చయం అయితే అది— మెదడునుంచి ముఖంలోని కండరాలకి వెళ్ళే ఫేషియల్ నర్వ్ తల్లి గర్భంలోనుంచి బయటకు వచ్చే సమయములో దెబ్బతినటం వల్ల కంటి రెప్పలు సరిగా మూత పడక పోవటం వల్ల పెద్దదిగా కనబడటం జరిగి వుంటుంది. కాలక్రమేణా ఇది తగ్గి పోతుంది. ప్రస్తుతం మీరు ఏ విధమైన వైద్యం చేయించవలసిన అవసరం లేదు.

జి. వి. కె — హైదరాబాద్

నేను ఒక గాయకుణ్ణి. నా గొంతులో జీర వున్నట్లుగా నాకు అనుమానము వస్తోంది. అంటే పాట తారస్థాయి నందుకున్నప్పుడు రెండు గొంతులుగా వినపడుతోంది. దీనికి ఏమైనా మందులు వున్నాయా?

దీనికి మీరు ఇ. ఎన్. టి. వైద్యులచే పరీక్ష చేయించుకొని గొంతులోని శబ్దోత్పత్తి కండరాల అమరికలో (వోకల్ కార్డ్స్) ఏదైనా లోపం ఉన్నదో లేదో తెలుసుకోవటం మంచిది.

రోగ నిర్ధారణ తర్వాత ఆ వైద్యులు— చేయవలసిన వైద్యం గురించి చెబుతారు. ముందుగానే మందులనేవి ఈ రోగానికి ఉన్నవీ లేనివీ చెప్పటం కష్టం.

—డా. కె. వెంకటేశ్వరరావు

కాలానికి దూరంగా

వేరు, నాలో వుండే రచయిత దృక్పథం నమ్మకాలు వేరు నేను రాస్తే ఓలాగుంటుంది. నాలో వుండే రచయిత రాస్తే మరోలా వుంటుంది, మొదట్లో మనలో వుండే రచయితకి స్వాతంత్ర్యం యిస్తాం. అందుకే ఆ రచనల్లో ప్రత్యేకమైన హృదయ స్పందన వుండి, సహజంగా వుంటాయి, నిరంజన్‌కి రచయితగా తప్ప వేరే వ్యక్తిత్వం లేదు. అతనికి కీర్తి ప్రతిష్ఠలమీద ఆశలేదు అతని రచనే అతని జీవం అందుకే అంతటి రచయితయ్యేడు'' అన్నాను.

''కాని లోకానికి తెలిసిన రచయిత తిరుమ్మలావుగారు.'' అంది అరుణ.

''అభిమానాన్ని త్యాగం చేసిన తిరుమ్మలావు కృషి కూడా ఫలించడం వల్లనే నిరంజన్ ఉత్సాహంతో ఇన్ని రచనలు చేయగలిగేడు'' అన్నాను.

''తిరుమ్మలావుగారు చేసింది ఎంత వరకూ త్యాగమో నాకు తెలీదు. తన పేరుతో మా అన్నయ్య రచనలు ప్రచురించుకోడమే కాకుండా మా వదినను కూడా పెళ్ళాడేడు'' అంది.

''మీ వదినంటే!''

''మా అన్నయ్య భార్య తిరుమ్మలావుగారి రెండో భార్య.''

''నిరంజన్‌కి తెలుసునా ?''

''తెలియదనుకుంటాను.''

''ఈ విషయం నీ కెప్పుడు తెలిసింది?'' అడిగేను.


''తిరుమ్మలావుగారు పోయే ముందు మేము హైదరాబాద్ వెళ్ళినప్పుడు 'ఎండ మావులు' ఫిల్మ్ ప్రివ్యూకి వెళ్ళేం. తలవని తలంపుగా వాళ్ళనక్కడ చూశాం. మా వొదినని తన భార్యగా పరిచయం చేశాడు నేను నిర్ఘాంత పోయేను. ఆమె నన్ను చూసి తెల్లమొహం వేసింది. అప్రయత్నంగా ''వొదినా!'' అన్నాను ఏడెనిమిదేళ్ళ క్రితం ఆమెని మా అన్నయ్య పెళ్ళికి చూడటమే. తర్వాత వాళ్ళు అండమాన్స్ వెళ్ళిపోయేరు. నన్ను గుర్తుపట్టి నా రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకున్నప్పుడు మా యిద్దరి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగేయి. పెళ్ళైన తర్వాత రెండేళ్ళయినా వాళ్ళు కాపరంచెయ్యకుండానే మా అన్నయ్యకి మశూచికం వొచ్చి నో కన్ను పోయింది. ఆ తర్వాత ...''

''నాకు తెలుసు ఆమె అమెరికా వెళ్ళిపోయింది అక్కడామె వుండగానే తిరుమ్మలావు ఆమెని కలుసుకున్నాడు. ఇండియాకి తిరిగొచ్చి ఏదో వ్యాపకం కల్పించుకోటానికి ఉద్యోగం చూసుకునే సందర్భంలో ఆమె మళ్ళీ తిరుమ్మలావుని కలుసుకుంది. ఆ తర్వాత పరిణామాలు మనకి తెలుసు ఇంతకీ ఆమె నిరంజన్ భార్యని తిరుమ్మలావుకు తెలుసునా ?''

''మొన్న యీ సంఘటనతో ఆయన ఆశ్చర్యంతో మూర్ఛపోయినంత పని చేశాడు అది నిజమో నటనోకాని.''

''ఆషాక్‌తోనే అతనికి గుండె పోటొచ్చి మరణించి వుంటాడు తిరుమ్మలావు వారం రోజుల్లో పోతాడనగా తనని కలుసుకోవడం మానేశాడని నిరంజన్ చెప్పాడు. తిరుమ్మలావు జీవించివుంటే మరికొన్నాళ్ళు నిరంజన్ జీవించి వుండేవాడేమో?'' అన్నాను. అరుణ మౌనంగా శూన్యంలోకి చూస్తూ ఆలోచనలో పడింది.

(అయిపోయింది)



చిక్కులు తెచ్చిన చెప్పుల మోజు!

అమెరికాలో భారతరాయబారిగా వుంటున్న ప్రఖ్యాత న్యాయవాది ఫల్కీవాలాఅమెరికా ప్రసిడెంటు కార్టర్ తల్లిపాదాలకు వంగి నమస్కరించుతూన్న ఫోటో అమెరికాపత్రికలలోవచ్చిందట. ఈ విషయం పార్లమెంటు చర్చలోకివచ్చి భారతదేశపు రాయబారిగా వున్నటువంటి వ్యక్తి యిటువంటి పని చేసి, భారద్దేశపు మర్యాద మంటకలిపినట్లు అమెరికాలో భారతీయులు గలాటా చేశారని ఒక సభ్యుని ప్రశ్నకు సమాధానంగా కార్టర్ తల్లిగారు భారద్దేశపు చెప్పులు నాకు కావాలి అని అడిగితే, తెల్లకాగితం మీద ఆవిడ పాదాల కొలతలు తీసుకునే సందర్భంలో ఎవరో ఆ ఫోటో తీశారని తనకి ఫల్కీవాలా చెప్పారని వాజపాయి అన్నారట.

విడాకులకు దారి తీసిన గురక!

తనభర్త భయంకరంగా గురకపెడ్తాడనీ, దాని వల్ల తన జీవితం చాలా దుర్భరంగా తయారయ్యిందని తనకు అందువలన విడాకులిప్పించాలని, 32 ఏళ్ళ ఎలిజబెత్ అనేఆవిడ కాలిఫోర్నియా కోర్టులో మొర పెట్టుకుని, జడ్జీగారు గురకకి విడాకులేమిటి పొమ్మనే సరికి గురకను తాను టేపు రికార్డర్ ద్వారా కోర్టుకు వినిపించిందట. దాంతో జడ్జీగారు ఏసు ఏసూ అని చెవులు మూసుకుని విడాకులు శాంక్షను చేశారట.

నొప్పికి నిద్రమందా?

సేలం పోర్టు ప్రాంతంలోని ఓ యింట్లో ఉద్దేకుండే 35 ఏళ్ళ రాజేశ్వరి అనే ఆవిడకు గుండె నొప్పి అధికంగా వచ్చి, తత్ఫలితంగా నిద్ర పట్టేది కాదట. దానివల్ల ఆమె నిద్రమాత్రలు అలవాటు చేసుకుందట. రాత్రిపూట నొప్పివచ్చినప్పుడల్లా నొప్పిని బట్టి మాత్రలు వాడేదట. మొన్న 10వ తేదీ రాత్రినొప్పి కొంచెం ఎక్కువగా రాడంవల్ల ఒకటికి రెండు, రెండుకు మూడు అని నిద్ర పట్టేవరకూ మింగేసిందంట. దాంతో మయకం వచ్చి పడిపోయిందట. తెల్లారినా, తెల్లారేకఎండ ఎంతఎక్కినా తనభార్య లేవకపోవడాన్ని చూసి భయపడిన ఆమె భర్త ఆమెను ఆసుపత్రిలో చేరుస్తే, వైద్యం ప్రారంభించేలోగానే ఆమె చనిపోయిందట.

నగల చోరీ

తమిళనాడుకు చెందిన ఆడయారిపట్టి అనే గ్రామంలో 50 ఏళ్ళ పెరియి అనే సుమంగళి ఓ రాత్రి లఘుశంకకు పెరట్లోకి వెళ్ళేసరికి ఎవరో కొంతమంది ఆమె మీదపడి, నోట్లో గుడ్డలుకుక్కి

ఫాలాక్షుని డైరీ


రెక్కలు విరిచికట్టి, కత్తితో మెడమీదో పోటుపొడిచి మంగళసూత్రాన్నీ మెడలోని గొలుసునూ, చేతి గాజులనూ తస్కరించి, పారిపోయారట. దైవికంగా ఆమెకు ప్రాణాపాయం మాత్రం కలగలేదట.

ఇంజనీర్ల నిరసన!

తమిళప్రభుత్వకర్మాగారంలో పని చేస్తున్న ఇంజనీర్లలో ఏడేళ్ళసర్వీసు వున్నవారిని పనినుంచి తొలగించినందునకు నిరసనగా మద్రాసులో ఆ యింజనీర్లందరూ బుర్రలు గుండు చేయించుకుని ఊరేగింపు చేశారట. అంతేగాకుండా నిరాహారదీక్ష ప్రారంభించారట. రెండోది సరేగాని మొదటిదే— ఆ గుండు చేయించుకోడాలెందుకు? తెలియాదు. ●

ఋణం

పెద్దింటి విజయలక్ష్మి



శేఖరం యింట్లోకి అడుగు పెట్టడం, సీతాపతిగారికి దగ్గుతెర ప్రారంభమవటమూ - రెండూ ఒకేసారి జరిగాయి.

ఆఫీసులో ఎన్నో కష్ట నిష్ఠూరాలు భరించి, దీపాలు పెట్టే వేళకి, చిటికెడు మనశ్శాంతి కోరుతూ యిల్లు చేరే మామూలు గుమస్తా అతను! కానీ, ఎక్కడవున్నా, ఆ మనశ్శాంతి దొరకక ఆవేదనతో అగాధాలను చేరుకున్న మనస్సైపోయింది శేఖరానిది!

సీతాపతిగారు ఎవరో కారు. శేఖరానికి రక్తాన్ని పంచి యిచ్చి, ప్రాణం పోసిన అతని తండ్రి. ఆయనకు యీ సుస్తీ యీనాటిది కాదు. నాలుగైదు నెలలు వయిన్నుంది!

కానీ కన్న తండ్రి బాధలో వరిగి పోతుంటే వుండవలసిన ఆరాటమూ ఆవేదనా లేదు శేఖరంలో. ఒకవైపు తండ్రి దగ్గుతుంటే. "యీ బాధ నేను భరించ లేను" అన్నట్టుగా నుదురు చిట్లిస్తున్నాడు. అంటే తండ్రి బాధ ననుభవిస్తుంటే, అతని మనసు కరగటంలేదు. జాలిపుట్టటం లేదు. మంచి మందు లిప్పించి, ఆయన బాధను మాపి, ఆరోగ్యవంతుణ్ణి చేయాలన్న తపన కలగటం లేదు. దానికి బదులుగా నిర్లక్ష్యం. "చేసిన పాపాలకు అనుభ విస్తున్నాడు మానవుడు" అని అదోరకమైన కచ్చ. "ఎంత తొందరగా ఆ ప్రాణం పోతే అంత తొందరగా తనకు మోక్షం చిక్కుతుందన్న" ఎదురుచూపు! ఇవి. యివే అతని హృదయంలో ఎల్లవేళలా ప్రజ్వరిల్లేది ఈ అసహజత్వానికి కారణం— అదో పెద్ద కథ!

నాలుగేళ్ల బాబుని బుజాన వేసుకుని, అతనికి ఎదురైంది శాంత.

వడలి, తల్లి భుజంమీద తలవాల్చి, నీరసంగా పడుకునున్న బాబుని చూశాడు శేఖరం.

"ఏమిటి శాంతా. బాబు కేమైంది? అలా వున్నాడేంటి?" ఆరాట మంటే అది! అది పాఠం నేర్పితేనట్టు నేర్చటానికి వీలు కానిది. అనుకోకుండా హృదయంలో నుంచి పుట్టుకురావాలి. అందుకు దోహదంగా ప్రేమ, అనురాగం, అనుబంధం వుండాలి. ఇవి ఒకదాన్ని ఒకటి అంటిపెట్టుకున్నచోటే హృదయం చలిస్తుంది. లేకుంటే బండ బారి పోతుంది.

"ఊఁ, కొంత నలత జేసింది" అర్థాంగిగా ఆమె ధర్మమన్నట్టు పరిస్థితిని తేలిక పఱచింది కానీ తనకు వెచ్చగా తగులుతున్న బాబుని తలుచుకుని, "బిడ్డకు ఎంత జ్వరం వచ్చిందో" అని ఆమె హృదయం తల్లడిల్లిపోతూంది.

శేఖరం బాబు ఒళ్లు ముట్టుకుచూశాడు అతని హృదయం ద్రవీభవించే కాక తగిలింది అతని చేతికి. చిట్లించిన ఆ నుదుటిమీద భారమైన ముడుతలు పడ్డాయి.

"అరె, యింత జ్వరంగా వుంటె కాస్త అంటావు! డాక్టరు దగ్గరకు తీసుకెళ్లానా?" అంటూ, బాబుని ఆమె చేతుల్లోనుంచి తీసుకున్నాడు, ఆదుర్దాగా.

"లేదింకా. ఉండండి కాఫీ తెస్తాను. తర్వాత ఆలోచిద్దాం" అంటూ, భర్తకు తెలియకుండ కన్నీళ్లు ఒత్తుకుంటూ, వంటింట్లోకి వెళ్లింది శాంత. ఆమెకు తమ అసహాయతకు లోలోన కుములుకోవటం బాగా అలవాటైపోయింది!

బాబుని భుజాన వేసుకుని, ఆలోచిస్తూ అటు యిటు తిరుగుతున్నాడు శేఖరం.

గదిలో ముసలాయన ఆలసిపోయి, ఆయాస పడుతున్నాడు. "కొంచెం యీ వేడినీళ్లు త్రాగండి" అంటూంది సీతమ్మ —ఆయన భార్య!

ఇవతలున్న శేఖరానికి వద్దనుకున్నా, అన్నీ తెలుస్తూనే వున్నాయి కానీ, అతనికి వాళ్ల ఆరాటం చికాకుగా వుంది! ఆ గది గుమ్మం దాకనైనావెళ్లి, ఆ ముసలాళ్ల బాధేమిటో తెలుసుకోవాలని లేదతనికి!

తలంటె ప్రాణం యిచ్చే శేఖరం ఆ తల్లి తండ్రి కోసం ఆరాట పడుతుంటే, ఆమెను ఆదరించలేదు! పైకి మౌనం వహించినా, మనసులో కోపించు కుంటాడు! మళ్లా ఆ నుదుటి 'కథ' మారిపోతూంటుంది.

కొడుకు వచ్చిన అలికిడి పసిగట్టిన సీతమ్మ, గది నుండి బయటికి వచ్చింది. అతని రాక కోసమే ఆమె కూడ యిందాకటి నుండీ ఎదురు చూస్తూంది. వేయికళ్లతో!

"వచ్చావా బాబూ, మీ నాన్నకు దగ్గు ఎక్కువైందిరా. కాస్త, మంచి వైద్యుడికి చూపించి, మంచి మందు కొనిపెడతావా నాయనా"

కొడుక్కి చెప్పినంత మాత్రానే తన ఆశ ఫలించినట్టుగా, యిప్పటి దాకా పడుతున్న ఆవేదన కాస్త తేలికైనట్టు వుంది సీతమ్మగార్కి!

భుజాన బాబుని వీపు నిమురుతూ, తల్లినే నిశితంగా చూశాడు శేఖరం.

ఆమె దీన వదనం అతనిలో జాలిని రేపింది.

ఆమె పడ్డ శ్రమ, అతని ధర్మాన్ని గుర్తు చేస్తూంది!

కానీ, ఒక్క క్షణం. ఒకే ఒక్క క్షణం! మనసు మారిపోయింది. తన దేహానికి వేడిగా తగులుతున్న బాబు, "నాన్నా"అంటున్నాడు. తనకు కర్తవ్యాన్ని బోధిస్తున్నాడు.

సీతమ్మ కొడుకు మాట కోసం, అతన్నే ఆశగా చూస్తూ నిలుచుంది. కానీ యీ విషయంలో శేఖరం తల్లిని మొదటి నుంచీ నిర్లక్ష్యం చేస్తున్నాడు. పరిస్థితులూ అలా వస్తున్నాయి.

"అమ్మా, బాబుకి జ్వరంగా వుంది చూశావా" అని తల్లిని ప్రశ్నించాడు.

"అవున్రా నాయనా. యిందాకటి నుంచీ శాంత వాడితో, నేను మీ నాన్నతో వలిగిపోతున్నాముర్రా. ఇద్దర్నీ మంచి డాక్టరు దగ్గర చూపెట్టి, మంచి మందిప్పించు బాబూ" అంటూ, నిట్టూరుస్తూ, మళ్ళా 'ఆ' గదిలోకి వెళ్లింది సీతమ్మ.

ఆమెనే చూస్తూ నిలుచున్నాడు శేఖరం.

"కాఫీ తీసుకోండి" అన్న శాంత మాటలకి యిహంలోకి వచ్చాడు.

బాబుని శాంత అందుకుంది. కాఫీ తాగుతున్న శేఖరం ఆలోచిస్తున్నాడు.

"అమ్మకు ఆయనంటె యింకా యీ ఆరాట మెందుకు?! అసలెలా ఆయనమీది మమకారాన్ని చంపుకోలేక పోతూంది. ఆ రోజుల్లో ఆయనపెట్టిన ఆరడి ఒకటా, రెండా ఇవన్నీ అనుక్షణం తపకు మెదడు లోనే వుంటాయి గదా. అసలు అమ్మకు అవెప్పుడూ గుర్తురావా? వచ్చినా, వాటిని లక్ష్యపెట్టదా? ఎలా? వుండగలుగుతుందీ విధంగా?"

కప్పులో కాఫీ అయిపోయినా, ఆ కప్పింకా అతని నోటి దగ్గరే వుంది!

ముసలాయన దగ్గుతున్నాడు ఆ దగ్గు మళ్ళా శేఖరాన్ని ప్రస్తుతంలోకి తెచ్చింది. ఇటు తిరిగాడు.

సీతమ్మ వేడి కాఫీతో, ఆయన గదిలోకి పరుగులాంటి నడకతో వెళుతూంది. ఇలాటి వాటికి తానెప్పుడూ ఆంక్షలు విధించలేదు. కానీ, "పిచ్చిది!" అని, తల్లిని చూసి హేళనగా నవ్వుకున్నాడు,

"అబ్బాయి వచ్చాడా?" దగ్గు మధ్య నుంచి, ముసలాయన పలికిన పలుకులు కూడ శేఖరం చెవిలో పడ్డాయి.

"ఆఁ. వచ్చాడు. మీకు మంచి మందు లిప్పిస్తానన్నాడు" మాటలతో ఆయన్ని మభ్యపెట్టేస్తూంది సీతమ్మ. ఇటు తండ్రికి కొడుకుపట్ల, కొడుక్కి తండ్రి పట్ల ప్రేమవాహిని ప్రవహించటానికి వారధిగా అయిందామె!

ఈసారి ఆశ్చర్యపోయాడు శేఖరం.


"నాన్నా" అని. ఆ కన్నతండ్రిని నోరారా పిలవలేదు తను! ప్రత్యక్షంగా అతనివల్ల నరకాన్ని చూసిన మనిషి, యీవిడిలా తపించిపోవటమా! ఒక్కనాడన్నా భార్యని భార్యగా చూశాడా ఆమానవుడు, ఆమె కివ్వాల్సిన గౌరవం యిచ్చాడా. ఎందుకీమె యిలా ప్రాకులాడుతూంది? ఇదేనా సృష్టి వైపరీత్యమంటె!" అనుకున్నాడు శేఖరం. అమ్మని ఆదరించని ఆ తండ్రంటే ఏహ్యం శేఖరానికి.

శాంత బాబుని వుయ్యాల్లో వూపుతూంది.

"శాంతా, వెళ్లి త్వరగా తెముల్చు. బాబుని డాక్టరు దగ్గరకు తీసుకు పోదాం.

తన బాధ్యత గుర్తుకొచ్చినట్టుగా, భార్యని పంపి తానాపని అందుకున్నాడు.

"ఈ పసివాడు తన రక్తం పంచుకు పుట్టినవాడు. ఇప్పుడు తండ్రిగా వీడికి చేయవలసినవన్నీ తాను చేస్తే, రేపు తనని వాడు ఆదుకుంటాడు. వృద్ధాప్యంలో తలిదండ్రుల్ని పిల్లలు కరుణతో ప్రేమగా చూడాలంటే వాళ్లకి నేడే తాము ఆ జ్ఞానాన్ని బోధించాలి. అంటె తమ విధి తాము సక్రమంగా నెరవేర్చాలి. ఏందులోనూ వాళ్లకి లోటు తెలియనీయకూడదు. 'నాకోసం మా నాన్న ఎంత కష్టపడ్డాడు' అన్న పశ్చాత్తాపం తనగురించి ఆ పసివాని హృదయంలో లేవాలి. తండ్రి కొడుకుల మధ్య అనుబంధం





వ్యాపారంలో పెట్టుబడి లాంటిది. వస్తే మొచ్చినా తట్టుకునే శక్తి వుండి నిలదొక్కుకోవాలి. అలాగే ఎన్ని కష్టాలొచ్చినా వాళ్ళిద్దరి మధ్య వుండవలసిన ప్రేమానురాగాలు గట్టిగా నిలిచి పోవాలి దానికేం చేయాలి ? ముందు తండ్రన్నవాడు తన బిడ్డలకోసం పాటుపడి తీరాలి. వాళ్ల అవసరాలు న్యాయమైన వారి కోరికలు తప్పక తీర్చాలి. ఆప్యాయత పంచి యివ్వాలి. అండదండగా నిలవాలి

హుం యివన్నీ చేయలేదు కాబట్టే యీ ముసలోడు నేడు కొడుకు అనుగ్రహాన్ని పొందలేక పోతున్నాడు. కానీ, కానీ- తాను యీ తండ్రి కొడుగ్గా వుండ కూడదు. తన బిడ్డకు నిజమైన తండ్రిగా నిలవాలి. ఎంత ఖర్చయినాసరే, తన బాబు కోసం తాను గడించాలి. వాణ్ణి గొప్పవాణ్ణి చేయాలి.

సుదీర్ఘమైన ఆలోచనలో పడిన శేఖరం బాబు నిద్రపోయాడని గమనించేలేదు.

“డాక్టరు దగ్గరకు వెళ్దామని, బాబుని నిద్రపుచ్చారా” అన్న శాంత మాట విని, వుయ్యాల్లో బాబుని చూశాడు.

జ్వరంలో హాయిగా నిద్రపోతున్నా దీనంగా కనిపించాడు.

గదిలో ముసలాయన, రొప్పుతూ, రొజుతూ వున్నాడు.

“బాబు శేఖరం” అని పిలుస్తున్నాడేమో కూడా ! కానీ, అది శేఖరం చెవులకెక్కలేదు.

“అమ్మా ఆయన దగ్గరికి బాబు లేస్తాడేమో, తలుపులు మూస్తాను”

ఋణం

అంటూ ఆ గది తలుపులు మూసి వచ్చాడు.

సీతమ్మ హృదయానికి కూడ మూతలు పడ్డట్టు, మనోభారంతో వో నిట్టూర్పు విడిచింది. నిర్జీవంగా చూశారు సీతాపతి !

ఇటు భర్తనీ కాదన నేరదు; అటు కొడుకునీ వదులుకోనేరదు. జరిగిన దాన్నే పదేపదే గుర్తు చేసుకుంటూ, ఏ నాడూ ఆప్యాయత కనబరచని తండ్రిని ప్రేమించలేని కొడుకుని, ఆ ధోరణి నుంచి మార్చ నేరదు.

ఎన్ని అన్యాయాలూ, అకృత్యాలు చేసి, తనని హింసించించినా, బంధమన్నది ఏర్పడ్డాక, ఆ మనిషి బలహీనతలో వున్నప్పుడు ఆదుకోక తప్పదని భర్తని వదులుకోనేరదు-సీతమ్మ !

కోరలు పీకేసిన పాములా, సుస్తీతో మంచం పడ్డాడు సీతాపతి. వో చెయ్యా, వో కాలూ, స్వాధీనం తప్పాయి. డబ్బంతా హరించుకపోయి, ఒంట్లో జవసత్వాలు పుడిగిన తర్వాత, తాను చేరదీసిన జల్సారాయుళ్లు తనని కాదు పొమ్మన్నారు. సర్వస్వం అనుకున్న ‘ఆమె’ అన్యాయం చేసింది. (సీతాపతి దృష్టిలో) మెల్లిగా కనువిప్పు కలిగి కట్టుకున్న భార్య పాదాల దగ్గరకు చేరాడు. అయినా తాను జీవితంలో విలువైన వెంత పోగొట్టు కున్నాడో, యీనాడు రోజు రోజుకీ కొంత కొంత తెలుసుకుని, లోలోన కుమిలిపోయినా లాభం లేదు.

కాళ్లమీద పడ్డ భర్తని, సీతమ్మ కాదన లేక పోయింది. పైగా ఆమె మాంగల్యాన్ని ఒకసారి కళ్లకద్దుకుని, భర్త ఆ దీనస్థితికి కన్నీళ్లు కార్చింది. మూడు ముళ్ళ బంధమేర్పరచుకున్నందుకు యిక తన శేష జీవితం ఆయన కోసమే' అనుకుంది.

అతన్ని యింట్లోకి రానిచ్చి, ఆదరించటం కొడుకైన శేఖరం మొదట యిష్టపడ లేదు. ఎంతసేపూ అతనికి పిల్లలకోసం తపించే తండ్రికి, తన తండ్రికీ పోలికలెంచి బేరీజు వేసుకోవటంలో సరిపోయింది. తన తండ్రి పట్ల విముఖతే మిగిలిపోయింది.

“సరిగా చదువు చెప్పించాడా ? మంచి బట్టలు కొనిపెట్టాడా ? నోరారా ‘బాబా’ అని పిలిచాడా ? ఒడిలోకి తీసుకున్నాడా ? కోపంవచ్చి కొట్టడంతప్ప మరేమీచేయలేదు. ఎందుకు, ఎందుకు కన్నాడు తనని ? హుం. తాను కావాలనా, కాదు, కామ వాంఛకు ప్రతిఫలంగా తాను పుట్టాడంతే. ఇలాంటి మనిషిని తండ్రిగా తానెలా భావించ గలడు ! చిన్ననాటి నుంచీ మనసులో పుట్టి, వయసుతోపాటు పెరిగొద్దూ ! ఉన్నట్టుండి యిప్పుడు రమ్మంటే ఎలావస్తుంది ప్రేమ? ఎక్కడినుంచి వస్తుంది ? తనతో పెరిగేది తండ్రిపట్ల ద్వేషం మాత్రమే !

కానీ, కానీ—కనీసం యీ నాలుగురాళ్ళు సంపాదించి, తనకంటూ వో యిల్లూ తన మనుషులను ఏర్పఱచుకునేదాకా, తనకోసం తల్లిగా తండ్రిగా కూడా పాటుపడ్డ ‘అమ్మ’ కోసం తాను చివరికి తలవంచక తప్పడం లేదు.

“నాయనా శేఖరం; ఆయన రక్తం పంచుకు పుట్టిన ఆయన బిడ్డవి. వద్దనుకుంటే తెగేబంధం కాదురా యిది. నీధర్మం నీవు చేయాలి” అని బంధం, గంధం అని తనకు హితోపదేశం చేసింది.

కానీ తనకీ బంధం బలవంతంగా తాళ్లతో బంధించినంత బాధగావుంది ! మనసు లేని మనిషికి బాధ్యత లెరగని తండ్రికి కొడుకుగా పుట్టినందుకు, తానూ వో జులాయిగా తయారై వుంటె, యిప్పుడిలాంటి బాధే లేక పోను ! కానీ, వో పుత్తమురాలి పెంపకంలో తన మనసు సున్నితమై, ప్రతి చిన్న దానికీ అమితంగా నలిగి పోతూంది!

భార్యాభర్తలు బాబుని డాక్టరుకి చూపించి, మందులు తీసుకొచ్చారు.

“బాబూ, నాన్నగారికి మందు తేలేదురా?” అడుగుతున్న సీతమ్మ కంఠంలో ఎక్కడో నిరాశ !

శేఖరం విననట్టు వూరుకున్నాడు.

“విన్నేరా శేఖరం” ఆతృత ఎక్కువై, కంఠం పెద్దదైంది సీతమ్మకు.

“ఏమమ్మా” అన్నాడు [illegible].

“ఎందుకూ ?”

“నాదగ్గర వున్నది కాస్త డబ్బే. ఎంత మందికి మందు లిప్పించ గలను ?” ఆలోచిస్తే, శేఖరం అన్న ఆ రెండు మాటల్లో ఎంతో నిజం, ఎన్నో అర్థాలు నిండి వున్నాయి

కానీ, సీతమ్మ కిప్పుడు ఆలోచించే శక్తి లేదు.

ఋ ణం

"ఎవరికైనా అడక్కు పోయావురా" అంది వింతగా!

శేఖరం తల్లి ని బాధగా చూశాడు.

"అమ్మా, కన్నతల్లివి. నువ్వు నన్ను అప్పుల పాలు చెయకమ్మా" అలా అనేసి నందుకు అతని మనసు నలుగుతూంది. కానీ, ప్రయత్నించినా అతనికి మృదువైన మాటలు రావటంలేదు.

"ఎవరికోసమో కాదు శేఖరం, మీ నాన్న కోసం" పదిసార్లు అదేమాట వుచ్చరించి, అతనిలో లేని మమతాను బంధాల్ని అతని బుర్ర కెక్కించాలన్న ప్రయత్నంలా వుంది సీతమ్మది.

శేఖరానికి అసహనం పెరిగిపోయింది.

"నాకా భావం లేదమ్మా" అనేశాడు గబుక్కున.

"శేఖరం!" సీతమ్మ కంఠం వణికింది. మరుక్షణం, కొడుకు యీ ధిక్కారానికి, ఆమెలో వో పట్టుదల పుట్టింది. "నా కొడుకు నేను గీచిన గీత దాటటానికి వీల్లే" దన్న నిశ్చయం పుట్టింది.

"పోనీ, నీ తల్లి కోసమైనా, ఆమె పసుపు కుంకుమలను నిలపటానికైనా ... నువ్వావని చేయలేవా ? అంతగా యిష్టం లేకపోతే, నేను పసుపు త్రాడు కట్టు కుంటాను– యీ నా మంగళ సూత్రాలని పట్టుకెళ్లి, అమ్మి, డబ్బుతే" అది ఆమె ఆజ్ఞలాగ కంఠం స్పష్టంగా పలుకుతున్నా, ఎందుకో, ఏ మూల దాగిన బాధో ఆమె కన్నుల్లో నీటిని కూడ నింపింది.

శేఖరం చలించాడు!

"అమ్మా! ఏమిటా మాటలు. నీ కొడుకు అంతటి నీచుడు కాలేదమ్మా, నాకూ మనసుందనే మాట మర్చిపోకు. కాకపోతే, కష్టాలు ఒక్కుమ్మడిగా వచ్చినప్పుడు, రెండూ తన బాధ్యత లే అయినా, రెంటిలో ఏది ముఖ్యమో చూసు కుంటాడు. బలహీనుడు. అలాగే నేనూ ఆలోచించాను కానీ, నీలో యింత క్రోధాగ్నిని రేపుతాననుకోలేదు. నీ అభిమత మిదే అయితే, ఒక్కరోజు గడువివ్వు, తల తాకట్టు పెట్టి అయినా డబ్బు తెస్తాను."

ఆ మాటలు పూర్తిచేసి. జోళ్ళు తొడుక్కుని బైటికి వెళ్లిపోయాడు శేఖరం.

ఎక్కడో గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

సీతమ్మ నోట మాటరాక, మూగదై పోయింది.

భర్త రాక కోసం ఎదురు చూస్తూ, మరో గంట గడిపేసింది శాంత.

* * *

మర్నాడు శేఖరం, తల్లిని పిల్చి ఆమె చేతిలో కొన్ని మందులు, కొంత డబ్బు పెట్టాడు.

"అమ్మా, సాయంత్రం డాక్టరుగారొచ్చి, నాన్నగార్ని పరీక్ష చేసి చూస్తానన్నారు" అన్నాడు.

శేఖరం చాల నిర్లిప్తంగా వున్నాడు. కానీ, కొడుకులో వచ్చిన యీ మార్పుకి సీతమ్మ మనసు ఎంతో సంతోషించింది. ఎన్నేళ్ళకో తండ్రిని 'నాన్న' అన్నాడు. అదృష్టానికి, ఆనందానికీ నోచుకోని తాను యివ్వాళ ఎంతో అదృష్ట వంతురాలిలా ఆనంద బాష్పాలు రాల్చింది.

"నిన్నటి దినం తెలియని ఆవేశంతో వాణ్ణి ఎన్ని మాటలన్నాను. ఎంత అప్పు చేశాడో, ఏమో" అని కొడుకుని తలుచు కుని బాధ పడింది

కొడుకు చెప్పినట్లుగా, భర్తకి, ఆ రోజు ఆ మందులు పట్టించింది. సాయంత్రం శేఖరంతో పాటు, డాక్టరు యింటికొచ్చి, సీతాపతిని చూశాడు. ధైర్యం చిక్కిన దానిలా, ఆనందించింది సీతమ్మ.

అందరి ముందూ "ఫ ర వా లే దు" అన్నాడు కానీ "యిక యీయనకు వైద్యం చేయటం అనవసరం" అని, చాటుగా శేఖరంతో అన్నాడు.

తనకిది ముందరే తెలిసిన విషయం లాగ శేఖరం మామూలుగా వుండి పోయాడు. ఇదొక "ఋణా"ను బంధంగా భావించాడు.

మర్నాడుదయాని కల్లా సీతాపతి పరమపదించారు. పాపం, యీ పిడుగు పాటుకి వోర్చుకోలేని సీతమ్మ కృంగి పోయింది.

"తల్లి ఋణం తీర్చుకున్నానని, కాస్త తేలికపడిన శేఖరాన్ని గదిలో చిన్న బల్లమీద మూడు భాగాలకు పైగా మిగిలి పోయున్న మందు సీసాలు వెక్కిరించాయి. ఏమీ చేయలేని "ఋణగ్రస్థు"డి(డా)లా నిలచి పోయాడు శేఖరం.

రాగమాలిక

శ్రీమతి
మాదవపెద్ది పుణ్యశీలాప్రసాద్

(గత సంచిక తరువాయి)

నా కుఘనమైన స్వాగతం పలికారు అందరూను.

ఆ తరవాత నేను, రాధ నిజంగా చాలా హాయిగా ఆనందపుటంచులు చూశాం ఎంత మధురమయిన రోజులవి!

అప్పుడు వెళ్ళాం మేము హనీమూన్‌కి ఒక్కక్షణం కూడా రాధని వదిలి వుండేవాణ్నికాదు ఆమె వెంట వెంటే తిరిగాను.

రాధ కూడా తన అన్నాళ్ళ బాధని మర్చిపోయింది.

నేను లేని మూడేళ్ళూ కూడా రాధ అమ్మని ఎంతో జాగ్రత్తగా చూసుకుంది ఒక్కసారి మాత్రం పుట్టింటికి వెళ్ళివచ్చిందని అమ్మ చెప్పింది. అదీ వాళ్ళ నాన్న పోయినప్పుడు మాత్రమేట! పదిహేను రోజులుండి వచ్చిందిట అప్పుడు.

ఏవో మాటలమధ్య అమ్మ ఇంకోమాట చెప్పింది

రాధ మొదటి భర్త చాలా కష్టాల్లో వున్నాడుట తిండీ గుడ్డా కూడా లేని పరిస్థితిలో వున్నాడుట చూసి ఆదుకునేవారు కూడా లేరుట. రాధ తండ్రి పోయిన సందర్భంలో వచ్చిన రాధ మేనమామలు చెప్పారుట ఈ సంగతి

రాధని ఇక్కడ దింపడానికి వచ్చి అమ్మతో చెప్పారుట ఈ విషయం చెపూ్త, రాధ ఎంతో అదృష్టవంతురాలని అన్నారుట నన్నూ, అమ్మనీ ఎంతో పొగిడి మరీ వెళ్ళారుట

ఇవన్నీ విన్నా చలించని నా మనసు మరో మాటతో చలించింది. రాధ తండ్రి పోయినప్పుడు ఆయనా వచ్చాడుట రాధని క్షమాపణ అడిగాడుట!

అంతే..

మళ్ళీ నాలో రాక్షసుడు మేల్కొన్నాడు! అయినా ఈసారి నేను బయటపడలేదు. రాధని ప్రేమగానే చూసుకుంటున్నాను

రెండు నెలలు గడిచాయి.

ఇంతలో తెలిసింది రాధకి నెల తప్పినట్లు! మొదట్లో పొంగిపోయాను. కానీ, క్రమక్రమంగా నాలో అనుమాన వృక్షం పెరిగి పెద్దదయింది.

నేను లేనప్పుడు రాధ మొదటి భర్తతో.. ఆ ఫలితమేనేమో ఈ గర్భం?

ఆ బిడ్డ నా బిడ్డ కాదు.

పాపఫలం! పాపఫలాన్ని మోస్తోంది రాధ. ఇదే ఆలోచన నన్ను తొలిచివేస్తోంది.

ఎట్లా? ఏం చెయ్యాలి? బిడ్డ పుడితే — ఆ బిడ్డ నా కళ్ళ ఎదుట పెరుగుతుంటే నేను తండ్రిగా వ్యవహరించాలి. ఉహూఁ! వీల్లేదు. ఈ నరకబాధ నేను భరించలేను అడిగెయ్యాలి రాధని!

వేవిళ్ళలో సతమతమౌతోంది రాధ. చాలా బలహీనంగా వుంది. డాక్టరు దగ్గిరికి యాంత్రికంగా తీసికెళ్తూనే వున్నాను. అంత దుర్బలంగా వున్న రాధతో ఈ మాట చెప్తే రాధ ఆరోగ్యానికే ప్రమాదమేమో! అమ్మో — రాధ కేమైనా అయితే నేను బతకలేను.

అందుకని బడబాగ్ని నాలోనే దాచుకున్నాను

నా రాధ కోసం — ఎన్నో సేవలు — సపర్యలూ చేశాను రాధని ఏమాత్రం బాధించలేదు కొన్నాళ్ళ రాధకి వేవిళ్ళు తగ్గాయి కొంచెం కోలుకుంది చూడ్డానికి చాలా అందంగా వుంది. చాలా హాయిగా — సంతోషంగా వుంది రాధ.

అమ్మ రాధని చాలా గారాబంగా చూసుకుంటోంది. అడుగు కిందపెట్టనివ్వడంలేదు ఆ టైములోనే నిన్ను కలుసుకున్నాం గుర్తుందా? అప్పటి మా అన్యోన్యత? ఆరోజుల్లో రోజూ ఎక్కడికో అక్కడికి తీసికెళ్ళేవాణ్ని రాధని

ఇంకా ఎన్నాళ్ళు దాచుకోను ఈ బాధ? అన్నం సరిగ్గా తినలేకపోతున్నాను నిద్ర అసలేలేదు రాధ మెలకువతో వున్నంతసేపూ నేను నిద్ర నటించి రాధ నిద్రపోగానే నేను లేచికూచునేవాణ్ని ఆమె ఎత్తుగా వున్న కడుపుకేసి కసిగా చూసేవాణ్ని

వళ్ళు తెలియని కోపం వచ్చేది ఆ కడుపుని అంతవరకు కోసి — లోపలి బిడ్డని ముక్కలుగా నరికేద్దామనిపించేది. అప్పుడెట్లా నిగ్రహించుకునేవాణ్నో నాకే అర్థంఅయేదికాదు

రాధ మాత్రం తన పుట్టబోయే పాపని ఊహించుకుంటూ — కలలుకంటూ నిద్రపోయేది

జరిగిన కథ - 5 నిద్రమాత్రలు వేసుకుంటేగానీ నిద్రపట్టని జీవితం మంజులది. సంవత్సరమంతా అంధకారంలో గడిపే మంజుల జీవితంలోకి వెలుగుని తెస్తారు శలవులకి ఇంటికొచ్చే సుధ, మధులు. కానీ అందులోనూ అసంతృప్తే. కొడుకు వస్తే కూతురో, కూతురు వస్తే కొడుకో ఎవరో ఒకరు తండ్రి దగ్గర కెళ్ళిపోతారు. ఇద్దరూ ఎప్పుడూ కలిసిరారు చిన్ననాటి స్నేహితుడు రామం కలిసి గుర్తుపడ్తాడు మంజులని. రామం భార్య రాధ. బారసాల చేసుకున్న తర్వాత భార్య సుశీలని తీసుకుని చెల్లెలు మంజుల దగ్గరికి వస్తాడు రాజా. మధు అనారోగ్యం మంజులని మరింతగా కృంగదీస్తుంది. రామంతో పెళ్ళి కాకముందు తనకోసారి పెళ్ళయిందని రాధ నోట విని ఆశ్చర్యపోతుంది మంజుల రాధ సంగతంతా తెలిసే పెళ్ళి చేసుకున్నానుగానీ ఆమె కోసారి పెళ్ళయిందనే విషయం నన్నామెపట్ల రాక్షసుడిలా ప్రవర్తించేలా చేసేది... అని మంజులతో చెప్తాడు రామం

పెదిమలు ఎప్పుడూ నవ్వుతూనేవుండేవి నిద్రలో

ఆమెకు అబార్షన్ అయితే బావుండుననిపించేది ఒకసారి లోపలి పాప చచ్చిపోయి పుట్టాలనుకునేవాణ్ణి ఇంకోసారి

రాధకి మాత్రం ఏం కాకూడదు అనుకునేవాణ్ని రాధ పుట్టబోయే పాపకి స్వెట్టరు అల్లుతూను ఊలూ సూదులూ తెమ్మన్నప్పుడు-

"పురిటికి ముందే అట్లాంటివి చెయ్యగూడదటగదా అమ్మ చెప్పింది" అని దాటవేసేశాను

లోపల పళ్ళు పటపట కొరుక్కున్నాను

ఆఖరికి ఒక రోజు అననే అన్నాను —

"రాధా పుట్టబోయే పాపకి ఏదైనా అయిందనుకో — నువ్వేం చేస్తావు?"

రాధ మొహం వివర్ణమయింది

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

"ఛీ — ఏం మాటలండీ - - మన ప్రేమ ఫలం మనకి ఇన్నాళ్ళకి లభించబోతుంటే మన వివాహ జీవితం ఇన్నేళ్ళకి కొత్తమలుపు తిరగబోతుంటే-"

లాభం లేదు రాధ మొహం చూస్తూ నేనా మాటని అనలేను

అందుకే ఆ రూములోనించి బయటకు వెళ్తున్నట్లు వెనక్కి తిరిగాను

"రాధా — అది ప్రేమఫలం కాదు పాపఫలం! ఆ బిడ్డ.. నా బిడ్డ కాదు.. పుట్టబోయేవాడు... ఎవరైనా సరే. ఈ ఇంట్లో వుండడానికి మాత్రం వీల్లేదు."

"ఏ. .మం. .డీ" అంతే, రాధ విరుచుకుని కింద పడిపోయింది

ఎత్తి మంచం మీదికి చేర్చాను డాక్టరుకి ఫోన్ చేశాను

ఆవిడ వచ్చి రాధని చూసింది

వెళ్తూ నన్ను హెచ్చరించింది "మీ ఆవిడ చాలా వీక్‌గా వున్నారు చాలా జాగ్రత్తగా చూసుకోవాలి -" అని!

//

ఆరోజునించీ రాధ మొహంలో జీవకళ తొలగింది. అన్నం సరిగ్గా తినడం మానేసింది రాత్రుళ్ళు నిద్రపోకుండా కూర్చునేవుండేది.

తరువాత నేను చాలాసార్లు పశ్చాత్తాపపడ్డాను — రాధని బాధపెట్టానే అని! కానీ, నాలో వున్న అనుమానం మాత్రం తొలగలేదు



రాధ కడుపులో వున్న పాప నా కవసరంలేదు. రాధ కావాలి అంతే! రాధ నాకు దక్కాలంటే రాధ మనసు కష్టపెట్టకూడదు!

రాధని అన్నం సరిగ్గా తినమనీ, నిద్ర బాగాపొమ్మనీ, లాలించి బుజ్జగించి చెప్పేవాణ్ణి రాధ అన్నింటికీ మౌనంగానే వుండిపోయేది ఇంకా యిట్లాగే చేస్తే నాకు రాధింక దక్కదేమోననే భయం కూడా నాలో మొదలయింది.

చాలా నిస్సత్తువ ఆవరించిందామెని

అమ్మ కూడా రాధని మందలించడం మొదలు పెట్టింది.

అయినా రాధ మారలేదు. నెలలు నిండుతున్నాయి. రాధ ఒకరోజు అంది — "నేను ఇక్కడే వుండి పురుడుపోసుకుంటాను. పుట్టింటికి వెళ్ళను" అని.

నీ రాకపోకలు నీతో పరిచయం నీతో మాట్లాడడం వలన రాధ కాస్త ఉత్సాహంగా వుండడం చూస్తున్నాను ఈమధ్య!"

మా ఇద్దరిమధ్య మళ్లీ ఆ సంభాషణ రాలేదు. ఆరోజు రాధ 'పుట్టింటికి వెళ్లను' అంటే నేను నిజంగా చాలా సంతోషించాను.

రాధకి నేనంటే ఎంత ప్రేమ. నన్ను వదిలి వెళ్లలేనంటోంది ... కానీ ... ఇక్కడే రాధకి పురుడువస్తే ... ఆ పుట్టిన పసికందుని ఇక్కడే వుంచక తప్పదు. నేను ఏ క్షణంలోనయినా ఆ శిశువుని హత్యచెయ్యక తప్పదేమోననిపించింది శిశు హత్య ... అవును. నా రక్తం కానివాణ్ణి — ఎవరికో పుట్టినవాణ్ణి "నా కొడుకు"ని అందర్నూ అంటే నేను. నేను ఎట్లా సహించగలను? ఊహూఁ! వీల్లేదు.

"వద్దు రాధా! నువ్వు పుట్టింటికి వెళ్లాల్సిందే — పురుడు వచ్చాక పుట్టిన శిశువుని ఏ అనాథాశ్రమంలోనో వదిలివేసి నువ్వు మాత్రం తిరిగిరా! నువ్వు నాకు కావాల్సిందే. కానీ, నీ కడుపులోని శిశువు నాకు వద్దు. ప్లీజ్ రాధా! నన్నర్థంచేసుకో నువ్వు లేకపోతే నేనుండలేను రాధా! నా కోసం ... నా కోసం ఈ పని చెయ్యలేవూ...?" రాధ చేతులు పట్టుకున్నాను.

నిశ్చేష్టురాలయి నిలిచిపోయింది రాధ వెర్రిచూపులు చూడడం మొదలుపెట్టింది.

'ఇంక నాలో మార్పు రాదని గ్రహించింది.' అనుకున్నాను

ఆరోజే సన్నగా నొప్పులు ప్రారంభమయ్యాయి రాధకి. నేను చాలా భయపడిపోయాను. ఇక్కడే పురుడు వచ్చేస్తే ఎట్లా? ఆ షాక్‌కి తట్టుకోలేక పోయినట్లుంది.

డాక్టరుకి చూపిస్తే 'అవి ఫాల్స్ పెయిన్స్' అన్నారు.

వెంటనే రాధ తమ్ముడికి టెల్రిగాం యిచ్చి పిలిపించాను. వాళ్లు రాధని ఏడో నెలలోనే తీసికెళ్దామనే అన్నారు. రాధ ఒప్పుకోలేదు. నేను కూడా అప్పటికి వాయిదా వేశాను.

రాధ వెళ్లడానికి ముహూర్తం పెట్టేశాను నేనే. అప్పటికి తొమ్మిదోనెల వచ్చి వారమయిందట. అమ్మ చెప్పింది.

అమ్మ ఏవో వేడుకలంది వేసే కొట్టిపారేశాను.

"అమ్మా! ఇట్లాంటివి చేస్తే రాధకి మరీ బాధ. వద్దంది." అని అమ్మకి రాధ వినకుండా చెప్పాను. ఆ మాటకి అమ్మ ఏమనలేక ఊరుకున్నా తన సంతృప్తికోసం రాధకి తలంటిపోసి పట్టుచీర, జాకెట్టు పెట్టి చేతులనిండా గాజులు తొడిగించింది

ఆ ఎర్రటి పట్టుచీరలో, ఆకుపచ్చని మట్టిగాజుల్తో పూర్ణగర్భిణి రాధ ఎంతో అందంగా వుంది.

కానీ, మొహం కళావిహీనంగా వుంది

అందుకు కారణం నేనేగా. చాలా బాధపడ్డాను కూడా!

రాధ మొహం చూడలేక ఆరోజంతా తప్పుకు తప్పుకు తిరిగాను.

ఆ తరువాతరోజు మీ ఇంటికి వచ్చింది రాధ. తను వచ్చే టైములో నేను ఇంట్లో లేను."

ఆగాడు రామం.

ఆగి నా మొహంవంక చూశాడు. గడియారం గంటలు కొట్టింది తొమ్మిది! ఇద్దరం ఉలిక్కిపడ్డాం.

అన్నం వడ్డించి పిలిచింది అత్తయ్యగారు

ఇంట్లో భాగ్యమ్మగారు నాకోసం కనిపెట్టుకుని వుంటుంది

కానీ, ఏమయినాసరే! ఇవాళ రామం కథ పూర్తయ్యాకే వెళ్తాను ఇంటికి' అనుకున్నాను

అన్యమనస్కంగా భోజనాలు ముగించాము

చెయ్యి కడుక్కుంటుంటే నా వెనకే వచ్చింది అత్తయ్యగారు.

"మంజూ!" గద్గదస్వరంతో పిలిచింది

"ఏమిటండీ?" అడిగాను

"ఎట్లాగయినా రాధ, రామంలను కలపాలమ్మా! రాధ చాలా మంచిపిల్ల! నా కూతురులాంటిది దానికే అన్ని కష్టాలూను పిచ్చిపిల్ల! ఈ ఇంటికొచ్చి అది సుఖపడిందిలేదు దాన్ని తల్చుకుంటేనే గుండె చెఱువయిపోతోంది

వీడి మాట నేను కాదనలేనుకానీ, రాధ మీద నాకే అనుమానమూ లేదు. 'అది నిప్పులాంటి పిల్ల! రెండు పెళ్లిళ్ళు చేసుకోడం దాని ప్రారబ్ధం

నువ్వే ఏదో ఉపాయం చూడు తల్లీ! ఈ సంగతి వాళ్లిద్దరూ నాకు తెలీదని అనుకుంటు న్నారు నాకు అంతా తెలుసు తల్లీ!

రాధ ఎన్ని నిద్రలేని రాత్రుళ్లు గడిపిందో — రామం ఎన్ని రాత్రులు తాగి కలవరించాడో లెక్కలేదు."

రామం అడుగుల చప్పుడు విని గబగబా కళ్ళు తుడుచుకుందావిడ.

"మీరు బాధపడకండి వాళ్లిద్దరూ తప్పకుండా కలుసుకుంటారు" అన్నాను నేను కూడా తొందరగా రహస్యంగా!

భోజనమయ్యాక రామం హాల్లో కూచుంటూ అన్నాడు— "మంజూ! వుంటావా వెళ్లిపోతావా?"

"ఇవాళ్టికి అత్తయ్యగారిదగ్గర పడుకుంటాలే

రామం! మిగిలింది చెప్పు." అన్నాను నేనూ కూచుంటూ

"మీ ఇంట్లో నీకు ఏం చెప్పిందో తెలీదు నాకు..." రామాన్ని నేనే ఆపాను.

"నీగురించి ఒక్కమాట గూడా చెప్పలేదు రామం! రాధ అంతా తన గురించే చెప్పుకుంది." అంటూ ఆరోజు రాధ నాతో చెప్పినదంతా చెప్పాను.

తల పంకించాడు రామం. రాధ నాతో అన్న చివరి మాటలు చెప్పాను.

రామం కళ్లల్లో కాంతి కదలాడింది

అవి చూస్తూ — "తరువాత నువ్వు చెప్పు" అన్నాను నేను

"ఆ తరవాత రోజే రాధ వెళ్లిపోయింది నీతో మాట్లాడి వచ్చాక రాధ కొంత ఉత్సాహంగానే వుంది నేనప్పుడే గ్రహించాను — నువ్వు ధైర్యం యిచ్చావని వెళ్తున్నప్పుడు రాధ బెంబేలు పడిపోలేదు

వెళ్లనని మొరాయించలేదు.

ఏదో దృఢ నిశ్చయం కనబడింది కళ్లల్లో— ఆ కళ్లు నాలో భయాన్ని రేపాయి.

'రాధేం అఘాయిత్యం చెయ్యదుగదా?' అనుకుంటూ నిలబడిపోయాను.

అమ్మకి నమస్కారం చేసింది.

పండంటి మనవణ్ణి కనివ్వమని అమ్మ ఆశీర్వదించింది నవ్వుతున్న నా మొహంలో నవ్వు మాయమయింది. అది గమనించింది రాధ

నాకూ నమస్కారం చేసింది.

రాధని లేవనెత్తి — "నాకు నువ్వు కావాలి రాధా —" అన్నాను. కళ్లల్లో నీళ్లు తిరిగాయి -- నాకు

"క్షేమంగా వస్తావు గదూ?" అడిగాను.

నవ్వింది చిన్నగా రాధ ఆ నవ్వు అనిర్వచనీయం! రాధ వెళ్తుంటే నేను చూడలేకపోయాను

నా గుండెను. నా ప్రాణాన్ని—ఎవరో లాక్కెళ్తున్నట్టుగా ఫీలయ్యాను.

అప్పట్నించీ నా మనసు మనసులో లేదు మంజూ! నాకు మనశ్శాంతి లేదు — నాలో చిత్రవధ అప్పుడే మొదలయ్యింది.

ఏం చెయ్యమంటావు? చెప్పు మంజూ — రాధ లేకుండా నేను బతకలేను. రాధ — రాధ అసలు బతుకుతుందా? నేను అనుమానించానని ప్రాణం తీసుకోదుగదా? నువ్వే ఏదన్నా మార్గం సూచించు. దీనికి తరుణోపాయం నువ్వే చూపించాలి మంజూ — రాధ లాంటి దేవతని అనుమానించడం — తప్పే - కానీ — నన్ను నేనే సమాధానపరుచుకోలేకపోతున్నాను. పుట్టిన బిడ్డే బతికుంటే — ఆ బిడ్డకోసం — రాధ నన్ను దూరం చేసేస్తుందేమో -- బిడ్డతో వస్తే నేనసలు భరించలేను. బిడ్డ లేకుండా రాధ వుండలేదు — మాతృప్రేమ కదా — ముఖ్యం ఆడవాళ్లకి? రాధ నన్నొదిలిపోతే .. నేనూ వుండను మంజూ... నేను లేకుండా అమ్మ బతకలేదు... ఈ కుటుంబమే అట్లా... సర్వనాశనమైపోతుందేమో..." ఆవేదనగా జుట్టు పీక్కున్నాడు రామం.

"చూడు రామం —"

శాంతంగా అన్నాను

తలెత్తి చూశాడు రామం

"రాధంటే నీకు ప్రాణం - రాధని వదిలి నువ్వుండలేవు. కాబట్టి కాస్త ఓర్పు తెచ్చుకుని రాధ కోసం — ఆ బిడ్డని ఇంట్లో వుండనీలేవా?"

"ఇంపాసిబుల్ - మంజూ - ఆ బిడ్డని చూస్తూ రాధతో ప్రేమగా వుండలేను. రాధ మీద అంతులేని కోపం — కసీ కలుగుతాయి నాకు అది మా ఇద్దరికీ మంచిది కాదు ఆ కోపంలో రాధనే హత్య చేస్తానో. ఆ శిశువునే హతమారుస్తానో -- నామీద నాకే నమ్మకంలేదు. భయంగా కూడా వుంది —"

"రాధకి పెళ్లికి ముందే బిడ్డ వుండి వుంటే... ?"

"ఉంటే నేనసలు రాధని చేసుకునేవాణ్ణే కాదేమో — రాధ కూడా అసలు పెళ్లే చేసుకునేది కాదు. లేదా — ఒకవేళ చేసుకున్నా ముందే తెలును కాబట్టి భరించడం అలవాటయిపోయి వుండేది — అయినా యిప్పుడా ప్రసక్తి అనవసరం —"

"అయినా — రాధ అట్లాంటిది కాదు రామం — నీదే సంకుచిత మనస్తత్వం — ఆ పుట్టబోయే పాప — నీ పాపే. ." దృఢంగా అన్నాను

"దానికి ఋజువేమిటి ?"

"ఛీ — ఛీ!" నా కసహ్యం వేసింది.

"ప్లీజ్ మంజూ—నన్నట్లా అసహ్యించుకోకు నా బాధ నువ్వన్నా అర్థం చేసుకో — మా ఇద్దర్నీ ఏదో విధాన కలిపి పుణ్యం కట్టుకో —"

"హుం! బాధ — నీ బాధ మాత్రం తీరాలి నువ్వు సుఖంగా వుండాలి. కానీ, రాధ సంగతి? పాపం — పుట్టినప్పటినించీ ఏ కొద్ది రోజులో తప్ప ఎన్ని బాధలు పడ్డది? అన్నీ ఎట్లా — ఎంత ఓర్పుగా భరించిందీ? నీకు జాలి కూడా లేదా? గర్భవతి అనే కనికరం కూడా లేకుండా ఆమెని నానా మాటలు అని — మనశ్శాంతి లేకుండా చేశావు. మొదట ఆమె అనుభవించిందంతా శారీరక బాధలే — నిన్ను కట్టుకున్నాక దానికి వెయ్యిరెట్లు మానసికంగా చిత్రవధ ననుభవించింది రాధ మీద ప్రేమంటావు. ప్రాణమంటావు. నీది నిజమైన ప్రేమ కాదు అసలు ప్రేమకి అర్థం నీకు తెలుసా? నిజంగా నీకు రాధ మీద అంత ప్రేమే వుంటే రాధనావిధంగా చూసేవాడివి కాదు ఆమెని కేవలం ఒక మనిషిగా కూడా చూడలేకపోయావు నేనే రాధ స్థానంలో వుంటే — 'నువ్వు పరమ దుర్మార్గుడివి' అనేదానిని. ఆడదంటే ఇంత చులకనా — మీ మగవాళ్లకి?


ఒకసారి నిన్ను మనసారా భర్తగా స్వీకరించాక ఇంకొకళ్ళతో సంబంధం పెట్టుకుంటుందని ఎట్లా అనుకున్నావు? నువ్వు అదే పని అమెరికాలో చెయ్యబోయావన్నావ్? అప్పుడు నీకు దాంట్లో తప్పేం తోచలేదా? మగవాడిననేగా నీ అహంకారం! నీకు రాధమీద వున్నది ప్రేమ కాదు కావే కాదు మోహం — కామం!

తరుణోపాయం నన్ను చెప్పమన్నావు కదూ? చెప్తున్నాను విను ఇన్నాళ్లూ నువ్వు రాధకి బాధలే కలిగించావు నరకమే చూపించావు. ఇంకనైనా రాధ సుఖపడేట్లు చెయ్యి రాధకి నువ్వే త్రికరణ శుద్ధిగా భర్తవి కలలో కూడా రాధ ఏ పాప కార్యమూ చేసివుండదు సంతోషంగా రాధని పాపతో రానియ్యి. పాపతో సహా రాధని ఆదరించు ప్రేమించు సంతోషంగా వుంచు. అత్తయ్యగారికి ఈ ముసలి వయసులో మనస్తాపాన్ని కలిగించకు ఇప్పటికయినా నీ కళ్లకున్న పొరలు తొలగించుకో రాధమీద వున్న అనుమానాగ్నిని - చల్లార్చెయ్యి. మంచి మనస్సుతో — పవిత్ర హృదయంతో రాధని స్వీకరించు —"

ఆగాను రామం వింటున్నాడు శ్రద్ధగా

మొహంలో మారుతున్న రంగుల్ని గమనించాను

"చూడు రామం కలవడం కష్టం - విడిపోవడం చాలా తేలిక జాగ్రత్తగా ఆలోచించుకో తొందరపాటు నీకే విధంగానూ మేలు చెయ్యదు గుర్తుంచుకో --" హితబోధ చేశాను



కూచున్న రామం — లేచాడు.

''అసంభవం మంజూ! నువ్వేమనుకున్నా సరే — రాధమీద నాకు ప్రేమ వుంది. అది ఆ భగవంతుడికి తెలుసు. కానీ... ఆ బిడ్డ నాది కాదు — కాదు — కాదు —'' గట్టిగా అరిచాడు.

''అయితే నేను చెయ్యగలిగిందేమీలేదు. నన్ను క్షమించు —''

అంతే — మా మధ్య మాటలు మరి పెరగ లేదు.

ఆ రాత్రి — నేను అత్తయ్యగారి పక్కనే పడుకుని — ఆవిడతో రాధ చెప్పిన కధ — రామం చెప్పిన గాధ కలిపి — ఒకే కధగా చెప్పాను. అంతా విని ఒక్క క్షణం మౌనంగా వూరుకుంది ఆవిడ.

తరవాత కన్నీరు తుడుచుకుంటూ—''పాపం— రాధ ఎన్ని కష్టాలు అనుభవించింది! రాధ బతుకుతుందంటావా? నాకు భయంగా వుంది. బలవంతాన ప్రాణాలు తీసుకోదుగదా?'' అంది.

''తప్పకుండా బతికేవుంటుంది అత్తయ్య గారూ — రాధ పిరికిది కాదు'' అన్నాను ఆమెని ఓదారుస్తూ నేను.

ఆవిడ మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తూ పడుకుంది. నేనూ కళ్లు మూసుకున్నాను

''విడిపోవడం తేలిక — కలవడం కష్టం! కలవడం కష్టం — విడిపోవడం తేలిక!''

నా మాటలు నా చెవిలోనే మారుమోగు తున్నాయి.

ఇవి నాకూ వర్తిస్తాయిగా?

ఆ రాత్రి నిద్ర శూన్యమే నాకు.

* * *

తెల్లవారింది.

కాఫీ తాగి ఇంటికి బయల్దేరాను.

రామంతో ఏమీ మాట్లాడలేదు నేను.

వరండాలో పేపర్ చేతిలో పట్టుకుని కూచుని వున్నాడు రామం.

చూపులు పేపర్మీద లేవు. దృష్టి ఎటో వుంది. నేను తల వంచుకుని బయటికి నడవ బోయాను.

''వెళ్తున్నావా — మంజూ?'' ఆవేదనగా అడిగాడు.

''అవును—రామం. వస్తాను. రాత్రి నువ్విచ్చిన ఆతిథ్యానికి నా కృతజ్ఞతలు.''

''ఒక్క నిమిషం కూర్చో మంజూ!''

కాదనలేకపోయాను.

''మంజూ — రాత్రి నీతో అంతా చెప్పిన తరవాత నా మనసెంతో తేలికయింది. ఇన్నాళ్లూ నాలోని బాధంతా నాలోనే దాచుకున్నాను. ఎవ్వరి తోనూ చెప్పలేదు నువ్వు నా హితురాలివనీ — స్నేహితురాలివనీ నీకు నా మనసు విప్పి చెప్పగలి గాను నా హృదయభారమంతా నీవలన తీరింది. నువ్వు చెప్తే నమ్మవేమోగానీ — నిన్న రాత్రి — ఇన్నేళ్ల తరవాత నిన్న రాత్రి కంటినిండా నిద్ర పోయాను. నిజం మంజూ!

రాత్రి — నువ్వు పడుకోడానికి వెళ్లాక — ఒక అరగంటసేపు నాలో నేనే తర్జన భర్జన పడ్డాను. చివరికో నిశ్చయానికి వచ్చాను.

రా గ మా లి క

రాధని నేను స్వీకరిస్తాను. బిడ్డతో సహా స్వీకరిస్తాను. అట్లాగని నా మనసులో 'అనుమానం పోయిందా' అని ఎవ్వడగద్దు. రాధ వచ్చాక రాధనేమీ యింక బాధపెట్టను. భగవంతుడిసాక్షిగా చెప్తున్నాను. రాధ కోసం. ఆమె మనశ్శాంతి కోసం నేనీ త్యాగం చెయ్యాలని నిశ్చయించు కున్నాను. నా మనసులోని అనుమానాన్ని — అసంతృప్తిని ఏమాత్రం బయటపెట్టను.

ఈ నిర్ణయానికి నేను వచ్చాక... నేను — నేను ఎంత సంతోషంగా వున్నానో తెలుసా? ఇదంతా నీవలననే మంజూ! నీకు నేను చాలా కృతజ్ఞుణ్ణి! థాంక్యూ — వెరీమచ్ మంజూ—'' అన్నాడు రామం.

మొహంలో చిఱునవ్వు వెలిగిపోతోంది.

నేను నవ్వాను.

''రామం — నువ్వు రాధ 'వివాహిత' అని తెలిసీ, పెళ్లి చేసుకున్నావని విని — ఎంత విశాల హృదయుడవోనని పొంగిపోయాను. నీలాంటి స్నేహితుడు ఉండడం నాకే గర్వకారణమను కున్నాను. నీమీద గౌరవం కలిగింది నువ్వెంతో ఉన్నతుడవని భావిస్తూ వచ్చాను. మన సంఘంలో యిట్లాంటివి అరుదు కదూ? పురుషుడు — భార్య పోతే — భార్యని వదిలేస్తే — వివాహం చేసుకోవచ్చు మళ్ళీ. కాని, స్త్రీకా భాగ్యం — అదృష్టం. అవకాశం వుండవు సాధారణంగా భర్త పోయిన వితంతువుని కొంత జాలిగా చూస్తుంది సంఘం. కానీ, భర్త వదిలేసిన స్త్రీని ఎగతాళిగా, హేళనగా తక్కువగా చూస్తుంది. తప్పు ఎవరిదైనా ఆడదాన్నే అంటారు అందరూ! భర్త ఏం చేసినా భార్య సహించాల్సిందే కదూ?

నువ్వు భర్త వదిలేసిన రాధని — ఆమె భర్త బతికుండగానే పెళ్లి చేసుకున్నావు సంఘ సంస్కర్తవే — నిజంగా — ఇన్నాళ్లూ నువ్వామెనెంత బాధించావో ఎవరికీ అక్కర్లేదు. ఎవరూ అడగరు అది నీ హక్కు ఇప్పుడు నువ్వామెని వదిలేసినా సంఘం నిన్నేమీ అనదు ఆమెనే అంటుంది ''మొగుళ్లని వదిలెయ్యడం — మళ్లీ పెళ్లి చేసు కోవడం — ఆవిడకి పరిపాటే'' అంటుంది.

నువ్వు రాధని వదిలెయ్యవు. నాకు తెలుసు 'బిడ్డతో సహా స్వీకరిస్తాను' అనకపోతే రాధ నీ దగ్గిరికి రాకపోవచ్చు అందుకే రాధని 'పాపతో సహా ఆదరిస్తాను' అంటున్నావు అన్నీ బాగానే వున్నాయి. అయితే. . నువ్వు చేసేది త్యాగమా? ఆ మాట వింటుంటే నాకు నవ్వు వస్తోంది అసలు నువ్వా పాపని మనస్ఫూర్తిగా ప్రేమిస్తే గూడా అది త్యాగం కాదు. నువ్వు వట్టి స్వార్థ పరుడివి రామం! నీ 'త్యాగం' అనే మాట వలననే తెలుస్తోంది నీ అనుమానం పోలేదని మనసులో అనుమానం వుంచుకుని రాధతో — పాపతో మామూలుగా వుండగలవా? అని మీ ఇద్దరికీ మంచిదేనా? ఆలోచించు—''

రామం ఆలోచిస్తున్నాడు

నేను లేచాను

వాకిట్లో సైకిల్ బెల్ మోగింది

టెలిగ్రాం వచ్చింది

దేవుడి పటంవంక చూసి -- వణికే చేతుల్తో టెలిగ్రాం చించి చదివాడు - రామం

నేనక్కడే నిలబడ్డాను

మౌనంగా టెలిగ్రాం నా చేతికి అందించి - చేతుల్లో ముఖం దాచుకున్నాడు నాకు భయ మేసింది ఏమయింది రాధకి?

ఆత్రుతగా చదివాను


రాధ ప్రసవించింది! మృత శిశువుని!!

రాధకి సీరియస్గా వుంది!

అని టెలిగ్రాం సారాంశం

రామంతో ఏం మాట్లాడాలో నాకు తోచ లేదు. రాధపట్ల జాలితో నిండిపోయింది నామనసు. రామం ప్రొబ్లమ్ సాల్వ్ అయింది— ఒక విధంగా

కానీ రాధ. . ? రాధ ఎట్లావుందో? ఈ దెబ్బకి తను తట్టుకోగలదా? భగవంతుడు అన్నీ ఎదురు దెబ్బలే ప్రసాదిస్తున్నాడు ఆమెకి ఎందుకో?



లోపలికి నడిచి అత్తయ్యగారికి చెప్పాను విషయం - వరండాలోకి వచ్చిందావిడ.

ఆవిడ్ని చూసి కన్నీరు నింపుకున్నాడు రామం

తల నిమిరింది మెల్లగా ఆవిడ

ఆవిడ ముఖంలో ఆవేదన - గూడు కట్టు కుని వుంది ఒక అరగంట గడిచింది

రామం -- అత్తయ్యగారు -- నేనూ కూడా తెప్పరిల్లాం. మరో అరగంటకి రామం— అత్తయ్య గారు ప్రయాణమయ్యారు రాధకెట్లా వుందోనని రాధని చూడాలనీ నా మనసు పీకుతున్నా—నేనెట్లా వెళ్లగలను— వాళ్లతో?

''వెళ్లగానే అక్కడి పరిస్థితులన్నీ తెలియ జేస్తూ ఉత్తరం రాయి రామం — రాధ కెట్లా వుందోనని నాకాదుర్దాగా వుంది—'' అన్నాను నేను— కారెక్కనున్న రామంతో

''ఫరవాలేదమ్మా - అన్నిటికీ భగవంతుడే వున్నాడు ఆయన మనకి ఒక దారి చూపించక

పోదు— ' అంది అత్తయ్యగారు — ధైర్యం కూడ దీసుకుంటూ.

వాళ్లకారు కదిలాక నేను ఇంటికి వచ్చాను

12

''అన్నయ్యగారు వచ్చారమ్మా!''

భాగ్యమ్మగారు చెప్పింది రాగానే


'ఇప్పుడే ఎక్కడికో వెళ్లారు—'

'అట్లాగా—' అంటూ లోపలికి నడిచాను. స్నానం చేసి వచ్చేటప్పటికి అన్నయ్య వచ్చాడు.

''ఏం. మంజూ. అట్లా ఉన్నావేం? వంట్లో బావుందా ?'' ఆత్రుతగా అడిగాడు.

''నాకేమన్నయ్యా నేను బాగానే వున్నాను. వదినా. పిల్లవాడు క్షేమమేనా. అసలెప్పుడు వచ్చావు? ''

''నేనొచ్చింది పొద్దునేలే— వంటావిడచెప్పింది నువ్వు రామం వాళ్లింటి కెళ్లావని—''



''అవునన్నయ్యా— అదో పెద్దకథ? టిఫిన్ తీసుకుంటూ మాట్లాడుకుందాం రా—''

''బాబిగాడేమంటున్నాడు? ...''

'అత్త' అంటున్నాడు. నేను ఒకవారం కాంప్ మీద వచ్చాను. నా కాంప్ అవుతూనే నిన్నుకూడా తీసికెళ్తాను—బెజవాడ. మీ వదిన ఒకటే పోరు నిన్ను తీసుకు రమ్మని—''

''ఇప్పుడు కాదులే అన్నయ్యా— ఇంకోనెలా — నెలన్నరలో పిల్లలకి సెలవులొస్తాయి. సుధతో కూడా వస్తాను నేను' అప్పుడు నాకూ సెలవు లుంటాయి ఎట్లాగూ.''

''లేదు. అప్పుడు మళ్లీ రావచ్చు కావాలంటే. శని — ఆదివారాలతోబాటు మరో రెండు రోజులు సెలవు పెట్టు — ఆ నాలుగు రోజులూ సరదాగా గడుపుదువుగాని—నువ్వు ఒక్కదానివీ ఇక్కడుంటే, నాకు నిన్ను వంటరిగా వదిలి వెళ్లాలంటే — ప్రతిసారీ బాధగానే వుంటుంది...''

వాడి గొంతు బాధగా పలికింది.

న కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

''ఏం చేస్తాం — అది నా దురదృష్టం...'' అన్నాను.

'పద - టిఫిన్ తిందాం —' లేచాం—ఇద్దరం

టిఫిన్ దగ్గిర అన్నయ్యకి రామం కథ క్లుప్తంగా వివరించాను.

''రాధ కెట్లా వుందోనని నా ఆదుర్దా - ఆమె మానసికంగా చాలా బాధపడుతోంది ఈ దెబ్బకి అసలు తట్టుకోగలదో — లేదో...'' అన్నాను.

అన్నయ్య నిట్టూర్చాడు.

''నీది ఒక రకం కథ — వాళ్లది ఇంకో రకం కథ —'' అన్నాడు.

నేనేం మాట్లాడలేదు.

''బావ మొన్న బెజవాడ వచ్చాడు. మధు గురించి వివరాలన్నీ అడిగాడు. సుధమ్మ తనదగ్గిరే వుందిగా — ఈ సెలవలకి... మధుని వెళ్లి చూద్దా మనుకున్నాడుట — పడలేదుట. పిల్లలంటే ఎంత ప్రేమే బావకి ? నీ గురించి కూడా...''

''నేను కాలేజీకి వెళ్ళివస్తానన్నయ్యా... టైమయింది —'' లేచాను నేను.

అన్నయ్య ఇంకేమీ మాట్లాడలేదు. నా మనసు నొప్పించడం వాడికిష్టం లేదు.

ఆయన మాటలు— ప్రసక్తి నేనసలు విని భరించలేను. ఆ సంగతి వాడికి తెలుసు! నాగురించి కూడా అడిగారంట. ఏమని అడిగి వుంటారు ? చచ్చానా. బతికున్నానా— అనా ? అంత ప్రేమ వుంటే ఒక్కసారి చూడడానికి రావచ్చుగా ?ఆయన రావాలా ? రావాలని నేను కోరుకుంటున్నానా ? ఆయన వస్తే ఆయన్ని నేనుచూడగలనా ? చూసి భరించగలనా ? ఆయనతో మాట్లాడగలనా ? నన్ను నిర్లక్ష్యం చేసిన ఆయనతో ఇంకా నాకు మాటలేమిటి ? ప్రేమ— పెళ్లి— వీటికి అర్థం ఏమిటి ? అంతా బూటకం— భ్రమ. నటన—

ఎన్ని కలలు గన్నాను నా సంసారాన్నిగురించి ? ఎన్నిరంగురంగుల హర్మ్యాలు నిర్మించుకున్నాను?''

సుధకి పెళ్లిచేసి పంపించి, మధుని పై చదువులు చదివించి - కోడలు రాంగానే ఇద్దరం చిన్న కుటీరంలో 'బాధ్యతలులేని- బంధాలు లేని బతుకు బతుకుదాం -' అని ఆయనంటే—

'మనవలూ— మనమరాళ్లూ కావాలి నాకూ ఆ బాధ్యత లేకుండా నేనుండలేను '' అన్నాను.

ఇప్పుడవన్నీ ఏమయ్యాయి ? ఈ బాసలన్నీ మళ్లీ తన ప్రియమైనవారితో చేసుకుంటున్నా రేమోలే !

నాకేం మిగిలింది ? కన్నీళ్లు మిగిలాయి.

కాలేజీ లోపలికి వెళ్లాకకూడా నా ఆలోచనలు నన్ను వదలలేదు —

మరో రెండు రోజులకి రామం దగ్గిర్నించి ఉత్తరం వచ్చింది.

రాధకి యింకా అట్లాగే వుందని — రాధ బతకవచ్చుగానీ — మతి చలిస్తుందేమోనని అనుమానంగా వుందని డాక్టర్ అంటున్నదనీ — ఇంకా పూర్తిగా స్పృహ రాలేదుగానీ — రామాన్ని చూస్తేనే అర్ధస్మృతిలో కూడా అపర కాళిలా మండిపడుతోందనీ — వీలుంటే నన్ను రమ్మని బతిమాలుతూ రాశాడు. దాంట్లో ఇంకో మాట రాశాడు వివరగా —

రాధ మొదటి భర్త చనిపోయాడుట పోయి పది రోజులయిందిట. అది వీళ్ళు వెళ్లినరోజే తెలిసిందిట.

అన్నీ రామానికి అనుకూలాలే! ఇంక రాధమ్మ కాపురానికి ఢోకా లేదు

రామం ఇంకముందు రాధని అనుమానించ లేదు వాళ్లిద్దరూ ఇంక హాయిగా వుండచ్చు

కానీ రాధ మనసులో పడిన గాయం మాన డానికి ఎంతకాలం పడుతుందో ? ఏ మో--

రామంకి జవాబు రాశాను ధైర్యంగా వుండ మనీ రాధ తప్పకుండా కోలుకుంటుందనీను నేను అక్కడికి రావడానికి ప్రస్తుతానికి వీలు పడ దనీ— క్షమించమనీ— కూడా రాశాను

శనివారం వచ్చింది - అన్నయ్య నన్ను వదల లేదు ఇల్లు భాగ్యమ్మగారికి అప్పజెప్పి అన్నయ్యతో బయల్దేరాను

వాకిట్లోకి రాగానే పోస్ట్‌మాన్ రెండు ఉత్తరాలు తెచ్చిచ్చాడు మధు— సుధలవి

మొదట సుధ రాసింది— చూశాను

''అమ్మకి నమస్కారములు,

నువ్వు ఎట్లా ఉన్నావు ? ఇక్కడ నేను తమ్ముడు క్షేమమే ఇక్కడింకా ఎండలు అంత తీవ్రంగా లేవు అక్కడ బాగా ఎండలున్నాయను కుంటాను నేను ఎంబ్రాయిడరీ నేర్చుకుంటు న్నాను 'స్మాకింక్' చెయ్యడం కొద్దిగా వచ్చింది

ఈ నెలలో మేము మూడు సినిమాలు చూశాము అందులో ఒకటి 'లేతమనసులు' అమ్మా - ఎంత బాగుందోనమ్మా - ఆ సినిమా !

అమ్మా ఒక్క మాట రాయనా ? ఆ సినిమా చూస్తుంటే అదంతా మన కథేనేమోఅనిపించింది నాకు. నువ్వు నామీద కోపం తెచ్చుకోవు గదా ?

ఆ సినిమాలో పిల్లలిద్దరూ గూడా అమ్మా- నాన్నలతో కలసివుండరు ఒకరేమో అమ్మ దగ్గిర ఒకరేమో నాన్న దగ్గిర ఉంటారు మేము అట్లా కాదనుకో మేము ఒకసారి నీ దగ్గర ఒకసారి నాన్న దగ్గిర మారుతూ ఉంటాంగా ?

అమ్మా ఆ సినిమాలో చివరికి అమ్మా—నాన్నా కలుస్తారు మీరుకూడా అట్లా కలిస్తే.. ? చాలా బావుంటుంది కదూ ?

నీకు కోపం వచ్చిందా నామీద? నీ ఎదురుగ్గా ఇవన్నీ మాట్లాడలేను— నేను అందుకే ఉత్తరంలో రాస్తున్నాను

రెండువారాల కిందట నాన్న వచ్చారు నాన్న ఒక్కరే వచ్చారు రెండు రోజులు ఉన్నారు. ఆ రెండు రోజులూ మేముకూడా నాన్నతోబాటు గెస్ట్‌హవుస్‌లో వున్నాము నిన్ను గురించి - మేము ముగ్గురం ఎన్నిసార్లు అనుకున్నామో ! నాన్న నన్ను తమ్ముణ్ణి హార్సీల్లు తీసికెళ్లారు మేము అడిగినవన్నీ కొనిపెట్టారు మాకు. సినిమా కి తీసి కెళ్తానన్నారు—కానీ మేమే వద్దన్నాము మమ్మల్నీ సారి ఎప్పటికంటే ఎక్కువ ప్రేమతో చూశారమ్మా నాన్న !

నీ గురించి నాన్న మమ్మల్ని ఎన్నో సంగతులు అడిగారమ్మా?! నిజంగా నాన్న వచ్చినప్పుడు నువ్వు కూడా వచ్చుంటే ఎంత బావుండేదమ్మా?

అందరి అమ్మా – నాన్నలు కలిసేవస్తారు. నువ్వేమో అసలు రానేరావు.

ఈసారి పెద్ద ఉత్తరం రాశాను గదూ?

రా గ మా లి క


ఇంక ఆపేస్తానమ్మా! నీ ఆరోగ్యం జాగ్రత్త. మామయ్య వస్తానే వున్నాడనుకుంటాను. అడిగానని చెప్పు.

నా మనసులోని మాటలలో కొన్ని రాశానివాళ. కోపం తెచ్చుకోక నన్ను అర్థం చేసుకుంటావు కదూ? ఉంటాను.

నీ సుధ.

పన్నెండేళ్ల మధ ఆరిందాలాగా వ్రాసింది – ఉత్తరం! మ్రాన్పడిపోయాను.

[ఇంకా ఉంది]



daCunha/Nutra/1 F

జి. వి. జి. పేజీ

టాప్ స్టార్స్ అంటే ఎవరు ?

"దక్షిణ భారతంలో ఇటీవల సంభవించిన తుఫాను బాధితుల నిధి సహాయార్థం మన బొంబాయిలోని టాప్ స్టార్స్ అంతా రేలీలో పాల్గొన్నారు." అన్నారెవరో రాజ్‌కమల్ స్టూడియోస్‌లో విఖ్యాత దర్శక నిర్మాత వి. శాంతారాంతో.

"టాప్ స్టార్స్ అంటే ఏమిటి మీ భావం ?" అడిగారు శాంతారాం.

"అంటే ఎక్కువ డబ్బు పుచ్చుకునే తారలు వాళ్ళే కదండీ ?"

"అలాంటి వారిని హైలీ పైడ్ స్టార్స్ అనండి. నటనలో నిష్ణాతులైన వారే టాప్ స్టార్స్," అని నిర్వచించారు శాంతారాం.

రాధాకృష్ణ

అన్నపూర్ణా కళానికేతన్ పతాకంలో దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించే "రాధాకృష్ణ" ఈస్ట్‌మన్ కలర్ చిత్రానికి జనవరి 5న సారథి స్టూడియోస్‌లో ప్రారంభోత్సవం జరిగింది. యద్దనపూడి సులోచనారాణి రాసిన కథ ఆధారంగా కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో తయారయ్యే ఈ చిత్రంలో శోభన్‌బాబు, జయప్రద, చలం, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, అల్లురామలింగయ్య, మాడా వెంకటేశ్వరరావు, భానుప్రకాష్, సూర్యకాంతం, రమాప్రభ, గిరిజ ముఖ్య భూమికలు నిర్వహిస్తారు.

వెండితెర రూపాంతరం : కె. రాఘవేంద్రరావు, సత్యానంద్, డి. మధుసూదనరావు. మాటలు : సత్యానంద్. గీతాలు : కొసరాజు, దాశరథి, సి. నారాయణరెడ్డి, వేటూరి. సంగీతం : ఎస్. రాజేశ్వరరావు. డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ : ఎ. విన్సెంట్. ఛాయాగ్రహణం : కె. ఎస్. ప్రకాష్. కూర్పు : ఎం. ఎస్. మణి. శిల్పం : భాస్కరరాజు. స్థిరచిత్రాలు: శ్యామ్‌కుమార్. అసోసియేట్ ప్రొడ్యూసర్స్ : కె. భానుప్రసాద్, పి. గంగాధరరావు, బి. ఇ. అసోసియేట్ డైరెక్టర్ : ఎస్. ఎస్.రవిచంద్ర. ఏప్రిల్ విడుదల.

వాక్చాతుర్యం

మేకప్ రూమ్ బయట నిలుచొని ఫలహారం ఆరగిస్తున్న ఓ తారామణి తల్లిని చూసి, "నిలుచునే టిఫిన్ చేస్తున్నారేం ? ఆ బల్లమీదెక్కడయినా కూర్చొని తాపీగా తినొచ్చుగా ?" అని ఒకరంటే, "ఇదే మంచిదిలెండి. కూతురు సంపాదిస్తుంటే కూర్చొని తింటుందని ఇప్పుడు నన్నెవరూ ఆడిపోసుకోలేరుగా ?" అందామె. తారామణుల తల్లులకు ఈ మాత్రం తెలివితేటలు లేకపోతే ఎలా ?

[30వ పేజీ చూడండి]

'దూడూ బసవన్న'లో చలం, దీప





'దేవదాసు మళ్ళీ పుట్టాడు'లో జయప్రద, అక్కినేని

దేవదాసుకు ఆఖరి షెడ్యూలు

శ్రీ అక్కినేని... శ్రీ దాసరి... అగ్రనటి కలిసి చారిత్రాత్మకమైన రికార్డును సృష్టించనున్న "దేవదాసు మళ్ళీ పుట్టాడు" చిత్రానికి జనవరి యిరవై నుంచి ఆఖరి షెడ్యూలు నిర్ణయమైనట్లు, నిర్మాతలు శ్రీ నివాసులు, పాండురంగప్ప తెలిపారు.

అగ్రనటుడు... స్వప్నసుందరి (జయప్రద) పాల్గొనే యుగళగీతాన్ని, శ్రీ అక్కినేనికి సంబంధించిన కొన్ని ముఖ్యసన్నివేశాల్ని చివరిషెడ్యూలులో పూర్తిచేయడంతో... చిత్రనిర్మాణం ముగిసినట్టే, అన్నారు నిర్మాత శ్రీనివాసులు.

"దేవదాసు మళ్ళీ పుట్టాడు" చిత్రంలో శ్రీ దాసరి మహానటి సావిత్రికి అపూర్వమైన పాత్రను యివ్వడం... ఆమెకేగాక, ప్రేక్షకులకే గాక, చిత్రానికి కూడా పెద్దయస్సెట్ అనిఎందరో భావిస్తున్నారు.

ఛాయాగ్రహణ దర్శకుడు కె ఎస్ మణి

ఇప్పుడు బిజీగా వుంటున్న ఛాయాగ్రహణ దర్శకులలో శ్రీ కె. ఎస్. మణి ఒకరు.

ఈయన కర్ణన్‌గారి వద్ద "ఆపరేటివ్"గా పనిచేసి, శ్రీ పూర్ణచంద్రరావు నిర్మించిన "జగమేమాయ" చిత్రానికి ఛాయాగ్రాహకునిగా పదవీభారాన్ని నిర్వహించారు.

తరువాతఅగ్రదర్శకుడు శ్రీదాసరి...మణిలోని మేధస్సుకు వలసినంత పనిని కల్పిస్తున్నారు.

శ్రీ నాగేశ్వరరావు నటిస్తున్న "దేవదాసు మళ్ళీ పుట్టాడు" చిత్రానికి తనే ఛాయాగ్రహణ దర్శకుడు అని శ్రీ దాసరి వెల్లడించినప్పుడు ... మొదట, రెండు రోజులు అగ్రనటుడితో తొలిచిత్రం గదా... ఎలా వుంటుందో, ఏమంటారో అని సంశయించారట, మణి.

కానీ, శ్రీ అక్కినేని యిస్తున్న ప్రోత్సాహానికి మణి ఆశ్చెరవు పొందారు.

దాసరికి కృతజ్ఞత

తను ఎవరికయినా ఋణపడివున్నారంటే... అది శ్రీ దాసరికి మాత్రమే అన్నారు మణి. ప్రస్తుతం విజయమాధవీ పిక్చర్స్ వారి స్కోప్ వర్ణచిత్రానికి శ్రీ మణి ఛాయాగ్రహణదర్శకుడుగా నియుక్తులైనట్టు... వుత్తమ ఫలితాన్ని యివ్వడానికి... కొత్త ప్రమాణాల్ని సృష్టించడానికి ఆ కథలో అవకాశం వున్నట్టు శ్రీ మణి చెప్పారు.

అవుట్‌డోర్ దృశ్యాలకు ప్రకృతి సహకరిస్తే చాలు. ఇన్‌డోర్‌ను కళాదర్శకుడి శ్రమను,దర్శకుడి సూచనను, కళాకారుల ఆహార్య అభినయాలను చిత్రీకరించడానికి కెమెరా మరింత శ్రద్ధవహించాలి, అన్నారు మణి.

శ్రీ మణి చేస్తున్న చిత్రాలు : "దేవదాసు మళ్ళీ పుట్టాడు ... శివరంజని ... నిప్పుతో చెలగాటం ... ఖైదీ నెం. 77"

దాసరి దర్శకత్వంలో స్కోప్ వర్ణ చిత్రం

కొత్తవాళ్ళతో చిత్రాన్ని, అగ్ర తారలతో చిత్రాన్ని, లఘుబడ్జెట్ చిత్రాన్ని, భారీ చిత్రాన్ని రూపొందించి... అన్నిటా విజయాన్ని సాధించిన అగ్ర దర్శకుడు శ్రీ దాసరి కొత్త సంవత్సరంలో సినిమాస్కోప్ వర్ణ చిత్రానికి సారథ్యం వహించడం... ముదావహం.

విజయమాధవీ పిక్చర్స్ ఫిబ్రవరి 15న ప్రారంభిస్తున్న "కటకటాల రుద్రయ్య" స్కోప్‌లో నిర్మించబడుతూంది అనేడి అధికార వార్తను, శ్రీ వడ్డె రమేష్ తెలిపారు.

"రెబల్ స్టార్" శ్రీ కృష్ణంరాజు రుద్రయ్యగా మరోసారి తన నటనా ప్రాభవాన్ని ప్రదర్శించే బంగారు అవకాశం... శ్రీ దాసరి రూపకల్పనలో రావడం... ప్రేక్షకులకు ఆనందకరమైన విషయమేగా!

"కటకటాల రుద్రయ్య" స్కోప్ వర్ణ చిత్రంలో జయసుధ, దీప నాయిక పాత్రలను పోషించ, శ్రీ రామకృష్ణకు మరో నాయక పాత్ర యివ్వబడినట్లు, శ్రీ దాసరి చెప్పారు.

ఈ చిత్రానికి జె. వి. రాఘవులు, జి. జి. కృష్ణారావు, భాస్కరరాజు, కె. ఎస్. మణి, హరిశ్చంద్రరావు... రమణబాబు ప్రధాన శాఖలను నిర్వహిస్తున్నారు.

హైదరాబాదులో... నాగార్జున సాగర్‌లో యీ చిత్ర నిర్మాణం జరుగుతుందని, నిర్మాత శ్రీ వడ్డె శోభనాద్రి వెల్లడించారు.



'సీతామాలక్ష్మి'లో తాళ్ళూరి రామేశ్వరి, చంద్రమోహన్

శేషాలు

శివరంజని ఎవరు?

అగ్ర దర్శకుడు శ్రీ దాసరి రూపొందించనున్న న్యూవేవ్ చిత్రం "శివరంజని" బహు చక్కటి ట్రీట్‌మెంటును సంతరించుకున్నట్టు, రచయిత శ్రీ దాసం గోపాలకృష్ణ చెప్పారు.

"శివరంజని" పాత్ర ఎవరిని వరిస్తుందో గాని... ఆమెకు పరిశ్రమలో సుస్థిర స్థానం ఏర్పడడం తథ్యము.

శ్రీ దాసరి చేయి చాలా మంచిది... అందుకనే ఆయన ప్రోత్సహించిన మురళీమోహన్... మోహన్‌బాబు... జయలక్ష్మి... మాధవి... ఈశ్వరరావు గార్లు వున్నత... వున్నత స్థానాలను ఆక్రమించి, ప్రజలకు దగ్గిరవాళ్ళు అయ్యారు.

విలన్ పాత్రలను పోషిస్తూ వచ్చిన కొందరికి... విభిన్నమైన పాత్రలిచ్చి ప్రోత్సహించింది కూడా దాసరిగారే...!

సురేష్‌లో కమల్, కాంత్

"స్టార్ ప్రొడ్యూసర్" శ్రీ రామానాయుడు కొత్త సంవత్సరంలో రెండు చిత్రాలను నిర్మించగలరని, గత వారం తెలిపాను.

ఒక చిత్రానికి నాలుగు భాషల కథానాయకులు కావాలి అని సురేష్ అధినేత వెల్లడించారు. ఇద్దరిని ఎంపిక చేశారు. మరో యిద్దరిని నాల్గయిదు రోజులలో నిర్ణయిస్తారు.

ఎంపిక అయిన యిద్దరు ఎవరన: తమిళం నుంచి కమలహాసన్, కర్ణాటకం నుంచి రజనీకాంత్. హిందీ నుంచి జితేంద్రను, తెలుగు నుంచి కృష్ణను పెట్టగలరని తెలుస్తూంది.


కథకుడు గుహనాథన్‌కు, దర్శకత్వం కూడా యివ్వాలన్న అభిప్రాయం, నాయుడుగారికి లేకపోలేదు.


రామానాయుడు దర్శకత్వం స్కోప్ చిత్ర నిర్మాణం

ఇంతవరకు నిర్మాతగా వుంటూ, అజ్ఞాతంగా దర్శక శాఖలో సహకరిస్తూ వచ్చిన శ్రీ రామానాయుడు- తెలుగు సంవత్సరాదినాడు ఒక కొత్త బాధ్యతను నిర్వహించడానికి సంకల్పించారు.

సురేష్ ప్రొడక్షన్స్ స్కోప్ వర్ణ చిత్రంగా నిర్మించనున్న భారీ తారాగణ చిత్రానికి, సురేష్ అధినేత దర్శకత్వం వహించడమే... ఆ కొత్త బాధ్యత.

ఈ స్కోప్ చిత్రంలో శోభన్‌బాబుగారికి విశిష్టమైన పాత్ర వున్నట్టు, జయసుధ గాక మరో నాయిక వున్నట్టు శ్రీ నాయుడు వెల్లడించారు.







'అల్లరి బుల్లోడు'లో రావుగోపాలరావు, కె. విజయ, రాజబాబు

సినిమా

రాజకుమార్‌తో జయచిత్ర

"కన్నడ నటసామ్రాట్" శ్రీ రాజకుమార్‌తో, "చిట్టెమ్మ" జయచిత్ర నటిస్తున్న మొదటి చిత్రం గూర్చి ఆమె వివరిస్తూ... ఆ మహానటుడి మంచితనాన్ని, సహనటీనటులకు ఆయన యిచ్చే ప్రోత్సాహాన్ని శ్లాఘించారు.

శ్రీ రాజకుమార్‌తో నాయికగా నటించాలనుకున్న తన కోరిక కొత్త సంవత్సరంలో యీడేరినందుకు, జయచిత్ర అమితానందాన్ని పొందుతున్నట్టు చెప్పి, 1978లో తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాభిమానాలను అర్థిస్తున్నాను, అన్నారు.

గత సంవత్సరంలో "చిల్లరకొట్టు చిట్టెమ్మ" పాత్రను యిచ్చిన శ్రీ దాసరికి, "ఆత్మీయుడు"లో శ్రీ అక్కినేని నాయకగా నటించే అవకాశాన్ని యిచ్చిన, శ్రీ తాతినేని, శ్రీ రమేష్‌కు జయచిత్ర కృతజ్ఞతలు తెలిపింది.

'నిండు మనిషి'లో శోభన్‌బాబు



కొత్త సంవత్సరంలో చిత్ర చిత్రాలు

"ఈ సంవత్సరం నాకు గత వత్సరంకన్నా ఆశాజనకంగా వుంది" అంది జయచిత్ర. ఎలాగని అడిగాను.

రెండు సినిమాస్కోప్ చిత్రాలు వస్తున్నాయి. ఒకటి శ్రీ గోపీనాథ్ రూపొందిస్తున్న, కృష్ణగారు నటిస్తున్న "చెప్పింది చేస్తా". రెండు: శ్రీ రాజకుమార్ నటిస్తున్న, శ్రీ విజయ్ రూపొందిస్తున్న కన్నడ చిత్రం. ఈ రెండూ గాక, "అన్నదమ్ముల సవాల్... ముత్తయిదువు... మంచిబాబాయ్... అందడు — ఆగడు — అదరడు... లవ్ మేరేజ్... కూతురా — కొడుకా... నిండు మనిషి" చిత్రాలలో వైవిధ్యం వున్న పాత్రలు లభించాయి.

శ్రీ అక్కినేని, శ్రీ ఎన్టీఆర్ చిత్రాలు మరో రెండు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అందుకనే నా వరకు "ఆనందనామ సంవత్సరం"గా పేర్కొంటున్నాను, అంది చిత్ర.

అన్నపూర్ణా కళానికేతన్‌లో శోభన్

ప్రముఖ చిత్ర నిర్మాత శ్రీ దుక్కిపాటి, మధుసూదనరావు కొత్తగా నెలకొలిపిన "అన్నపూర్ణా కళానికేతన్" జనవరి 5న, సారథీలో కొత్త (వర్ణ) చిత్రాన్ని ప్రారంభించింది.

శ్రీ రాఘవేంద్రరావు దర్శకుడుగా, శ్రీ శోభన్‌బాబు నాయకుడుగా, జయప్రద కథానాయికగా పాల్గొంటున్న యీ నవలాచిత్రానికి "ప్రేమలేఖలు" యూనిట్ పని చేస్తున్నది.

ఈ రంగుల చిత్రంలో సత్యనారాయణ, చలం, రమాప్రభ ప్రధాన సహపాత్రధారులుగా నటిస్తున్నారని తెలిసింది.

జనవరి 5 నుంచి వరుసగా జరిగిన పది రోజుల షెడ్యూలులో ముఖ్య నటీనటులు అందరూ పాల్గొన్నారు.

పి. ఏ. పి. వి రెండు

గత సంవత్సరంలో ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ మూడు చిత్రాలను నిర్మించిన విషయం పాఠకులకు తెలుసు ఈ సంవత్సరం ఆ సంస్థనుంచి రెండు చిత్రాలు వస్తాయి.

శ్రీ నాగేశ్వరరావు నటిస్తున్న భారీ వర్ణ చిత్రానికి శ్రీ ప్రత్యగాత్మ దర్శకుడని;

లఘు బడ్జెట్ చిత్రానికిమరొకరు దర్శకుడుగా వుండగలరని నిర్మాత శ్రీ ఏ. వి. సుబ్బారావు చెప్పారు

"ఆలుమగలు... అత్తవారిల్లు... అర్ధాంగి" చిత్రాలను ప్రేక్షకులు నిండుమనసుతో ఆదరించి నందుకు, శ్రీ ఏ. వి. సుబ్బారావు కృతజ్ఞతలు అందచేస్తూ, రాబోయే చిత్రాలలో జనం కోరే అంశాలు తప్పక వుండగలవన్న హామీని వెల్లడించారు.

—శ్రీనివాస్ ★



daCunha/CS/24h/Tel.

జి. వి. జి. పేజీ

[25 వ పేజీ తరువాయి]



'స్వర్గసీమ'లో శ్రీధర్, ప్రభ

చిన్నపిల్లలకు పెద్ద విషయాలు ...

చలిజ్వరంతో మంచం మీద పడుకొని బాధ పడుతూన్న కుటుంబం తన కూతుళ్ళు బుధమ్మ, గురమ్మలను పిలిచి, "మీ అమ్మతో నేను పడ లేకుండా ఉన్నాను. అందులోకీ జ్వరం వచ్చింది. ఎప్పుడు ఏ నిముషాన ఏం జరుగుతుందో తెలీదు. నువ్వు చూస్తే మగపిల్లవాడై పుడ్తావనుకున్నాను. ఆడపిల్లై పుట్టావు. ఫర్వాలేదమ్మా, ఏదైనా అయితే కొరివి నువ్వే పెట్టాలమ్మా," అన్నాడు పెద్ద కూతురితో. "కొరివిఅంటే ఏంటినాన్నా?" అని అడిగింది గురమ్మ. "పొయ్యిలో కట్టెమ్మా" అన్నాడు కుటుంబం. "అది ఎక్కడ పెట్టాలి ?" అని ప్రశ్నించింది బుధమ్మ. "నా నెత్తి దగ్గర. వెళ్ళి చదువుకోండి," అంటూ కుటుంబం ముసుగు బిగదన్ని పడుకున్నాడు. కాస్సేపటికి గురమ్మ "అక్కా, నాన్న చచ్చిపోయినట్లున్నాడే. మూల్గడం లేదు," అంది. "అట్లా అయితే మనం కొరివి పెట్టాలిగా ?" అంది బుధమ్మ. ఇద్దరూ వంటింట్లోకెళ్ళి మండుతున్న కొరివి తెచ్చి కుటుంబం తల దగ్గరుంచారు. సమయానికి మార్కెట్‌నుంచి వచ్చిన అతని భార్య లక్ష్మి కొరివిని గమనించి, "అయ్యో! లేవండి. ఎంత పని జరిగింది ? లేవండి! ఎవరీ పని చేసింది ?" అని లబోదిబో మొత్తుకుంది. "నాన్నగారు కొరివి పెట్టమంటే పెట్టాను," అంది గురమ్మ. ఉలిక్కి పడి లేచి కూర్చున్న కుటుంబం "ఏమిటి! నేను బ్రతికుండగానే!" అని నెత్తి బాదుకుంటూ, "చిన్నపిల్లలకు పెద్ద విషయాలు చెప్పకూడదనే బుద్ధి నాకు లేక నేనే చెప్పాను." అన్నాడు. కుటుంబం (అల్లురామలింగయ్య), లక్ష్మి (పద్మాంజలి), గురమ్మ (బేబీ పద్మజ) పాల్గొన్న ఈ సన్నివేశం పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో బి. కొండారెడ్డి నిర్మించే శ్రీ దేవీ ఆర్ట్ కంబైన్స్ "స్వర్గసీమ" లోనిది. షూటింగ్ దాదాపు పూర్తయినట్లే.

మరో ఉత్తరం

"అన్నయ్య దగ్గర్నించి ఉత్తరం వచ్చింది" అని హుషారుగా ఇంట్లోకి పరుగెత్తుకుంటూ వచ్చిన రాధ (జయప్రద) చేతిలోంచి గోపి (కృష్ణ) చటుక్కున ఉత్తరం లాగేసుకుని, "ఉత్తరం ఇస్తే నాకేమిస్తావ్ ? ఓ ముద్దిస్తావా?" అన్నాడు. "అబ్బ! ఇవ్వు గోపీ!" అంది రాధ. "నేనడిగిది ఇస్తేనే" అన్నాడు గోపి. ఇంతలో వచ్చిన రాధ తండ్రి మూర్తి (గుమ్మడి)కి అసలు విషయం తెలియక "నువ్వడిగేది నేనిస్తాగాని, ముందా ఉత్తరం ఇవ్వు, గోపీ!" అనగానే "అమ్మ బాబోయ్!" అని కంగారు పడిపోయాడు గోపీ. "బావా, నువ్వు నాకేమీ యివ్వక్కర్లేదు. ఇదుగో ఉత్తరం" అంటూ యిచ్చేశాడు. విదేశాల్లో చదువుతూన్న రాంబాబు రాసిన ఆ ఉత్తరంలో యిలా వుంది. "నాన్నగారికి నమస్కరించి రాంబాబు వ్రాయునది. ఇచ్చట నా చదువు పూర్తయినది. నేను రేపే బయలుదేరి ఇండియాకు వస్తున్నాను. ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చి, ఎల్లుండికల్లా మన ఊరు వస్తాను. చిరంజీవి రాధకు నా ఆశీస్సులు..." జి. సి. శేఖర్ దర్శకత్వంలో గోపాలకృష్ణ నిర్మించే మారుతీ కంబైన్స్ "అల్లరి బుల్లోడు" చిత్రం తుది మెరుగులు దిద్దుకుంటోంది



'పట్నవాసం'లో జయమాలిని



'గోరంతదీపం'లో శశిరేఖ, వాణిశ్రీ

రామకృష్ణా సినీ స్టూడియోస్

"అక్బర్—సలీం—అనార్కలి" చిత్రం మార్చి విడుదల. "శ్రీరామ పట్టాభిషేకం" చిత్రానికి గాను అరణ్యవాస దృశ్యాలను డిసెంబర్‌లో రాజమండ్రి సమీపాన అడవుల్లో చిత్రీకరించారు రామ రావణ యుద్ధ దృశ్యాలను జనవరి 20 నుంచి విశాఖపట్టణం సమీపాన చిత్రీకరిస్తారు బి. బాలకృష్ణ హీరోగా బి. హరికృష్ణ సారథ్యంలో ఒక సాంఘిక చిత్రంతోపాటు "విరాటపర్వం"ను కూడా తెరకెక్కించే సన్నాహాలు జరుగుతున్నాయి స్టూడియోలో నటీనటులు, సాంకేతిక నిపుణులు బస చేసే నిమిత్తం వసతి సౌకర్యాలు గల మూడంతస్తుల భవన నిర్మాణం పూర్తయింది లేబొరేటరీ, రికార్డింగ్ థియేటర్లు త్వరలో నెలకొల్పబడతాయి

ఎన్. టి. ఆర్., ఎ. ఎన్. ఆర్. ఆంధ్ర తుఫాను బాధితుల నిధి


ఎన్. టి. ఆర్., ఎ. ఎన్. ఆర్. బృందం వారు ఇటీవల 9 కేంద్రాలలో విశేషటన, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా సేకరించిన 15 లక్షల రూపాయల విరాళాన్ని తుఫాను బాధితులకు సక్రమంగా వినియోగపడేటట్లు — దీర్ఘకాలిక చర్యగా నిలవాలనే సంకల్పంతో శ్రీ రామకృష్ణ మఠం వారి ద్వారా తుఫాను దెబ్బకు బాగా గురైన కొన్ని గ్రామాలను దత్తం తీసుకొని, అక్కడ పునరావాస గృహాలు నిర్మించాలని ఉద్దేశించారు.

ఫిల్మోత్సవ్ - 78

జనవరి 3వ కేంద్ర సమాచార శాఖామాత్యులు శ్రీ ఎల్. కె. అద్వానీ ప్రారంభోత్సవం కావించిన మద్రాసులో తొలి పోటీ విభాగం లేని "ఫిల్మోత్సవ్ 78" అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శింపబడే వివిధ దేశాల చలన చిత్రాలను చిత్ర పరిశ్రమలోని నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు, దర్శకులు ఎంతోమంది ప్రతి రోజూ ఎలాగో తీరుబడి చేసుకొని చూసి, చర్చించుకోవడం జరుగుతున్నది ★

వేస్టు జోకర

గుడిసేవ సుందరరామయ్య



ప్రసూతి వార్డులో నడుస్తున్న నిండు గర్భిణిలా విజయవాడ స్టేషన్లోకి వచ్చి నిల్చింది గుంటూరు నుంచి మచిలీపట్నం పోయే పాసెంజర్

పుట్టల్లోంచి బయటకు వచ్చే చీమల్లా యూనివర్సిటీ విద్యార్థినీ విద్యార్థులు కంపార్టు మెంట్లలోంచి దిగుతున్నారు.

కొన్ని క్షణాల్లో రైలుబండి అంతా దొంగలు దోచిన ఇనప్పెట్టెలా ఖాళీ అయిపోయింది.

అప్పటివరకు ప్లాట్‌ఫారమ్మీద నిలబడివున్న ప్రయాణీకులు ఒక్కరొక్కరే బండి ఎక్కసాగారు

నేను మాత్రం ఓసారి ప్లాట్‌ఫారమంతా పరిసరాలను పరీక్షగా చూసే రోదసీ యాత్రీకునిలా గుచ్చి గుచ్చి చూశాను కాని నా కళ్లకు కావాల్సిన దృశ్యం కన్పించలేదు. నా మనస్సు వెతుకుతున్న మనిషి అగుపించలేదు.

వాచీ చూసుకొన్నాను—అయిదున్నర దాటింది

బండి నుంచి విడిపోయిన ఇంజన్ రన్నింగ్ రేసులో దప్పికగొన్న ఆటగానిలా ముందుకు పరిగెత్తింది అది తిరిగి రావటానికి కనీసం పదిహేను నిమిషాలు పట్టవచ్చు భూమిలో వున్న చమురు కోసం అన్వేషించే గాస్ కమిషన్‌లా శ్రద్ధగా నేను ప్రతి కంపార్టుమెంట్‌ను చూసు కొంటూ బయల్దేరాను. కాని నా ఆశ ఫలించలేదు కావాల్సినవారు కన్పించలేదు. ప్రతి రోజు గతి తప్పని గ్రహంలా ఈ బండిలోనే తిరిగే వ్యక్తి ఈ రోజు కన్పించకపోయేసరికి నాకు ఆశ్చర్యం కల్గింది.

కళ్లు అలిసిపోయాయి కాళ్ళు నీరసించాయి అలానే సిమెంట్ బెంచీమీద కూర్చుండిపోయాను

మైక్‌లో రైళ్ల రాకపోకల గురించి హడావుడిగా చెప్తున్నారు.

ప్లాట్‌ఫారమ్మీద వెండర్స్ పార్లమెంట్లో అల్లరి చేస్తున్న అపోజిషన్ మెంబర్స్‌లా అరుస్తున్నారు

పరిసరాల్లో ఏం జరుగుతుందో నా మనస్సు పట్టించుకొనే స్థితిలో లేదు నా మనస్సు నిండా ఆ వ్యక్తి గురించే ఆలోచనలు

సృష్టిలో అన్నిటికంటె తీయనిది స్నేహమేనని ఏ క్షణాన అన్నారోకాని అది అక్షరాల నిజం. ఆ పదంలో వున్న లాలిత్యం, ఆ బంధంలో వున్న మాధుర్యం, ఆ ఎడబాటులో వున్న అనుభూతి వర్ణనాతీతం పరిచయం కాకముందు ఎవరికి ఎవరో? పరిచయమయ్యాక ప్రాణస్నేహం! ఆ తర్వాత ఆ స్నేహ మధువు కోసం తహ తహ! ఎందుకీ బంధం? ఏమిటీ ఆకర్షణ? ఈ స్నేహ వలయంలో మనస్సు సాలెగూట్లో పురుగులా ఎందుకు చిక్కుపడిపోతూంది? స్నేహం కోసం ఎలాంటి త్యాగాన్ని చేయటానికైనా మనిషి ఎందుకు సిద్ధపడుతున్నాడు? స్వార్థాన్ని కూడా జయించకల్గే స్నేహం కమ్మని పరిమళాలను వెదజల్లే సుగంధం లాంటిది. అది శాశ్వతం!...

ఆకలితో అలమటించే అన్నార్తుని ఆర్తనాదంలా రైలు అరిచేవరకు నేనీ లోకంలోకి రాలేకపోయాను.

మెల్లగా లేచి నిలబడ్డాను.

దేవదూతలా తెల్లటి దుస్తుల్లో నిగనిగలాడుతున్న గార్డు పచ్చజెండా ఊపుతున్నాడు.

గబగబ నేను అందుబాటులో వున్న కంపార్టుమెంట్లో ఎక్కాను

రైలు కదిలింది తొలిమారు బిడ్డనెత్తుకొని నడుస్తున్న తల్లిలా. నేను కంపార్టుమెంట్లోకి అడుగు పెట్టగానే అగుపించిన దృశ్యాన్ని చూసి ఆనందపడ్డాను. నూతనోత్సాహం నాలో ప్రవేశించినట్టయింది నిధినిక్షేపాలు దొరికే గని దగ్గరకు చేరినంత సంతోషం కల్గింది. రెండు బెంచీల మధ్య ఓ ఎత్తుపాటి అట్టపెట్టెనుపెట్టి దానిమీద టవల్ పరిచి చతుర్ముఖ పారాయణానికి సిద్ధమౌతున్న ఋషులు కన్పించారు నాకు. తప్పకుండా నేను వెతుకుతున్న వ్యక్తి ఆ పరిసరాల్లో వుండితీరాలన్నది నా గట్టి నమ్మకం! చుట్టుప్రక్కల చూస్తూ వాళ్లను సమీపించాను.

దేవుడు సాక్షాత్కారమయ్యాడని గ్రహించి మెల్లగా కళ్లువిప్పిన మౌనిలా శర్మ నావైపు చూశాడు.

నేను కళ్లతోనే అతన్ని ప్రశ్నించాను

అతను నా భావం గ్రహించాడు. నోరు విప్పకుండా కనుబొమలు ముడిచి తల అడ్డంగా ఊపాడు.

ఇదంతా ఓరకంట గమనిస్తున్న ప్రసాద్, "ఏం గురూ! మీ పార్వతింకా రాలేదనుకొంటాను!" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

నన్ను తిరిగి నీరసం ఆవహించింది.

నిస్సత్తువుగా బెంచీమీద కూర్చుండిపోయాను

వేస్టు జోకర్

పార్వతిని కల్సుకోవాలని ఎంతో ఉత్సాహంతో వచ్చాను నేను

అంతకంటె రెట్టింపు ఉత్సాహంతో తనలో దాచుకొన్న శుభవార్తను పార్వతికి చెప్పాలని ఉవ్విళ్లూరుతూంది నా మనస్సు పార్వతి భుజమ్మీద చేయివేసి, చురుకుగా కదలాడే ఆ కళ్ళల్లోకి చూస్తూ ఈ శుభవార్తను చెప్పాలని, శుభవార్త కల్గించే మధుర భావనలు, సంతృప్తి, సంతోషం పార్వతి కళ్ళల్లో ప్రతిబింబించగా తనివితీర చూస్తుండిపోవాలని ఎంతో ఆశతో వచ్చాను.

కాని పార్వతి రాకపోవటంతో నేను పూర్తిగా నిరుత్సాహపడిపోయాను కొన్ని విచిత్ర పరిస్థితులలో పరిచయం ఏర్పడింది నాకు పార్వతితో—

* * *

'సారీ, మాస్టారూ! ఆ సీటు ఖాళీచేయండి!' అన్న కంఠం విన్పించగానే ఆశ్చర్యంగా తలెత్తి చూశాను.

దాదాపు ఆరడుగులు పొడవున్న విగ్రహం, తెల్లటి పైజామా, తెల్లటి లాల్చీ, ఎర్రటి శరీరచ్ఛాయ — మంచులో తడిసి నిగనిగలాడుతున్న మల్లెమొగ్గలా వున్నాడు భుజమ్మీద వున్న తుండు మనిషిని క్రుంగదీసే బాధ్యతలా బరువుగా వుంది కాబోలు వెంటనే తీసి నా ఎదురుగా వున్న ఖాళీ బెంచీమీద పరిచాడు.

'ఆ విండో దగ్గర సింగిల్ సీటు ఖాళీగా వుంది. అక్కడ కూర్చోండి!' అన్నాడు.

ఆ స్వరంలో కాఠిన్యం లేదు! లాలిత్యం వుంది!

ఆజ్ఞ లేదు! అర్థింపు వుంది!

పణుగుడు లేదు! సంస్కారం వుంది!

సభ్యత, సంస్కారం వున్నవాళ్ళంటే నాకెంతో యిష్టం. వాళ్ళకోసం ఏ త్యాగమైనా చేయాలన్పిస్తుంది నాకు.

వెంటనే లేచివెళ్లి అతను చూపించిన సీట్లో కూర్చున్నాను

నా మనస్సులో కుమ్మరిపురుగులా తొలుస్తున్న అనుమానాన్ని నివృత్తి చేసుకోటానికి అతన్ని అడిగాను, 'అక్కడెందుకు కూర్చోవద్దన్నారు' అని అతను చిఱునవ్వు నవ్వేడు.

పున్నమి చంద్రునిలా —

వికసించిన మల్లెమొగ్గలా —

'ఈ అసౌకర్యానికి మన్నించాలి సార్! మా ఫ్రెండ్స్ వచ్చే స్టేషన్లో ఎక్కుతారు' అన్నాడు.

'వాళ్లకోసం మీరిలా రిజర్వ్ చేయటం వలన మిగతావారికి యిబ్బంది కల్గుతుందికదా!' అన్నాను నేను.

'అఫ్‌కోర్స్! కాని తప్పనిసరి సార్! వాళ్ల కోసం సీట్లు రిజర్వ్ చేయటం నా కర్తవ్యం, బాధ్యత కూడాను! ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించుకోవటంలో తప్పు లేదనుకొంటాను!' అన్నాడు సిగరెట్ వెల్గించుకొంటూ

విండోలోంచి బయటకు చూస్తూ ప్లాట్‌ఫారమ్మీద తిరిగే జనాన్ని, పట్టాలమీద జరిగే రైలు పెట్టెలను చూస్తూ కూర్చున్నాను

'ఎక్కడివరకు వెళ్లాలి సార్?' అడిగాడతను

'మచిలీపట్నం!' అన్నాను ముక్తసరిగా

'రోజూ ఇందులోనే ప్రయాణం చేస్తున్నారా?' అని అడిగాడు అతను సిగరెట్ పొగను పైకి వదులుతూ

'ఇదే మొదటి రోజు!'

'హార్టీ వెల్కమ్ టు యు! మీ రెండులో ఏమి చేస్తున్నారో తెల్సుకోవచ్చా?' నేను చేసే వుద్యోగం సంగతి చెప్పాను

'అయితే మీరు కొత్త మెంబరన్నమాట!' అన్నాడు నవ్వుతూ

మళ్లీ వెన్నెల కాసినట్లయింది! మల్లె మొగ్గలు విరబూసినట్లయింది సత్యన్నారాయణ పురం స్టేషన్లో రైలాగింది

ప్లాట్‌ఫారమ్ పొడవునా నిలువుగా పేర్చిన పేకముక్కల్లా జనం బారులుతీరి నిలబడివున్నారు

బండి ఆగగానే తేనెతుట్టెలోకి దూరిపోయే తేనెటీగల్లా జనం కంపార్టుమెంట్లలోకి చొచ్చుకొస్తున్నారు.

అతను విండోలోంచి తల బయటకుపెట్టి చేతిరుమాలు ఊపుతున్నాడు


టిఫిన్ బాక్సులను చేతపుచ్చుకొని వచ్చిన నల్గురు మనుషులు అతను రిజర్వ్‌చేసిన స్థలాన్ని ఆక్రమించారు వారిలో ఒకరు హ్యాండ్‌బ్యాగ్‌లోంచి టవలు తీసి మోకాళ్లమీద పరిచాడు ఇంకో వ్యక్తి చేతిలో వున్న పాకెట్‌ను విప్పి పేకముక్కలు బయటకు తీశాడు.

'మాస్టారూ! మీరు కూడా వస్తారా?' అని అడిగాడతను నవ్వుతూ

'నో థాంక్స్!' అన్నాను

'మొహమాటపడక్కర్లేదు మాస్టారూ!' అన్నాడు వాళ్లలో ఒకడు

అందరూ నవ్వేరు



మీరుకోరిన పాటలు. గుంటూరు నుండి ఉష, అనూరాధ, భవాని, సావిత్రి, తెనాలి నుండి రవి, రాధ, కోటి, సురేష్, శివాజీ, వెంకటేష్....

నా గురించి తెల్సుకొన్న సమాచారాన్ని వాళ్లకు చెబుతూ పేకముక్కలు పంచాడతను.

నేను కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూండి పోయాను.

రైలు వేగాన్ని పుంజుకొని పరుగులు తీస్తూంది.

* * *

'గుడ్‌మార్నింగ్ సార్!' తలెత్తి చూశాను.

'ఓ ... నువ్వా! కమాన్!' అంటూ ఆహ్వానించాను.

'రైలు ప్రయాణానికి అలవాటుపడ్డారా?' సిగరెట్ వెలిగించుకొంటూ అడిగాడు

'చాలా బోర్‌గా వుంది!'

'ఇంతలో మీ ఊరికి ట్రాన్స్‌ఫర్ కాదంటారా?'

'ప్రయత్నాలు చేస్తున్నాను కాని ఎప్పుడు ఫలిస్తుందో దేవుడికే తెలియాలి!'

'అయితే మీరు తప్పకుండా కార్డ్సు నేర్చుకోవాలందే!'

'ఎందుకట?'

'కాలక్షేపం!'


'కాలక్షేపంకోసం ఇువ్వాళ నేర్చుకొంటే రేపు వ్యసనంగా మారి జీవితాన్నే నాశనం చేయొచ్చు!'

అతను నవ్వేడు.

ఈసారి ఆ నవ్వులో వెన్నెల విరియలేదు. మల్లెలు పూయలేదు.

జ్ఞానాన్ని పొందిన సిద్ధుని పెదవులపై విరిసిన దరహాసంలా వుంది ఆ నవ్వు! పేకాటపట్ల అతను నిర్వచించుకొన్న అనుబంధానికి నిదర్శనం ఆ చిఱునవ్వు!

ఎన్నోనెలలుగా అతనితో నాకు పరిచయం ఏర్పడింది. కాని అతని వ్యక్తిగత విషయాలను గురించి ఎప్పుడూ అడగలేదు. పేకాటమీద అతనికంత మక్కువ, ఆసక్తి కల్గటానికి కారణం కూడా తెల్సుకోవాలనిపించింది మెల్లగా సంభాషణలోకి దింపాను.



'ఈరోజు కార్డ్సుకు వెలుగును చూపించలేదే?' అని అడిగాను అతని చేతిలో వున్న పాకెట్స్‌వైపు చూస్తూ.

'మీరు ఊ అనండి!' అంటూ పాకెట్లోంచి కార్డ్సును బయటకు లాగబోయాడు.

'అంత పని చేయకు! అందులో నాకు అ ఆలు కూడా రావు' అన్నాను అతని ప్రయత్నాన్ని వారిస్తూ.

'మీకా భయం అక్కర్లేదు. నా శిక్షణలో మీరు రెండురోజుల్లోనే గుణింతాలు నేర్చుకోకల్గుతారు!'

'థాంక్స్! కాని నాకా అవసరం కన్పించటం లేదు అవునూ, ఈరోజు మీ ఫ్రెండ్స్ ఎవ్వరూ రాలేదేమిటి?'

'వాళ్లకు హాలిడే కదండీ!'

'మరి నీకు హాలిడే లేదా?'

నేను ఆ ప్రశ్న వేయగానే అతను క్షణంపాటు తొట్రుపడి 'వుంది! కాని ఇంట్లో ఏమీ తోచక యిలా వచ్చేను!' అన్నాడు

'మరి మీకు సెలవు లేదా యీ రోజు?' అని అడిగాడు నన్ను.

'సెలవే! కాని మా ఆఫీసర్‌కు ట్రాన్స్‌ఫరయిన సందర్భంలో ఈ రోజు హోటల్లో డిన్నర్ యిస్తున్నాం! అందుకే వెళ్తున్నాను!' అన్నాను

అతను మౌనంగా కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూండిపోయాడు.

'ఇంత కాలంగా నేనడగలేదు. నువ్వు ఏ ఆఫీసులో పని చేస్తున్నావ్?'

ఆ ప్రశ్న వేయగానే అతని ముఖం వాడిపోయిన పేకముక్కలా మారింది కళ్లల్లో దైన్యం తొంగిచూసింది. నా కళ్లల్లోకి సూటిగా చూడలేక ఒడ్డునపడ్డ చేపపిల్లల్లా అతని కళ్లు రెపరెప లాడాయి.

'నేను ఏ ఆఫీసులోను వుద్యోగం చేయటం లేదు సార్!' అన్నాడు నూతిలోంచి మాట్లాడుతున్న వ్యక్తిలా.

ఈసారి ఆశ్చర్యపడటం నా వంతయింది.

ఎక్కడా ఉద్యోగం చేయనివాడు సీజన్ టిక్కెట్టుమీద గుడివాడ నుంచి విజయవాడకు రోజూ ఎందుకు తిరుగుతున్నాడో అర్థం కాలేదు నాకు.

'మరి రోజూ ఎందుకు ప్రయాణం చేస్తున్నావ్?' మెల్లగా అడిగాను

అతను గుండెనిండా గాలి పీల్చుకొని అతి నెమ్మదిగా అన్నాడు,

'ఉద్యోగ రీత్యానే!'

మళ్లీ ఆశ్చర్యపోయాను.

'మరి ఏ ఆఫీసులోను వుద్యోగం చేయటం లేదన్నావుగా?'

'అవున్సార్! నేను ఆఫీసులో చేయటంలేదు! నిజమే! నేను పని చేసేది ఈ రైల్లోనే!' శూన్యంలోకి చూస్తూ సమాధానం చెప్పాడు.

అతను జోక్ చేస్తున్నాడనిపించింది.

'ఏం వుద్యోగం?' అన్నాను ఎగతాళిగా

'పేకాట!'

అతని నోట్లోంచి దూదిపింజెలా వెలువడ్డ ఆ మాట నా మనస్సులో చేరి డైనమైట్‌లా పేలింది.

'మాస్టారికి నా పరిస్థితి అర్థమైనదను కొంటాను!' విరక్తిగా నవ్వుతూ అన్నాడు.

ఎమర్జన్సీ కాలంలో అకారణంగా అరెస్టు చేయబడిన వ్యక్తి ముఖంలో కల్గే ఆశ్చర్యం, అయోమయం, సందిగ్ధత నాలోకూడా కల్గాయి.

'మీరేకాదు మాస్టారూ! నా విషయం తెలియగానే అందరూ యిలాగే ఆశ్చర్యపోతారు!'

'ఎంతవరకు చదువుకొన్నావు?'

'టెన్త్ క్లాసు తప్పాను!'

'పూర్తి చేయటానికి ఎందుకు ప్రయత్నించలేదు?'

'ఒకప్రక్క యింటి బాధ్యత, మరోప్రక్క ఈ వుద్యోగ బాధ్యత అవకాశం యివ్వటంలేదు సార్!'

'అంటే...'

'అవున్సార్! మాది పెద్దకుటుంబం! మా నాన్న బట్టలకొట్లో గుమాస్తా! మా అమ్మ జబ్బుతో మంచంలో వుంది టెన్త్ తప్పి ఇంట్లో కూర్చున్న ఓ అక్కయ్య ఎలిమెంటరీ స్కూల్లో చదువాపేసిన ఓ చెల్లాయి, అ,ఆ,లంటే ఏమిటో తెలియని ఇద్దరు తమ్ముళ్లు మా ఫామిలీ మెంబర్స్! మా నాన్న సంపాదించే సంపాదనతో మా యిల్లు గడవటం కష్టంగా వుంది. అందుచేతనే ఈ ఉద్యోగాన్ని చేపట్టాల్సొచ్చింది సార్!' అన్నాడు ఎంతో తేలికగా

'నీ ఉద్దేశంలో ఇది కూడా ఉద్యోగమేనా?'

'తప్పకుండా సార్! మీకు తెలీదేమోకాని మా నాన్నకంటే ఎక్కువే సంపాదిస్తున్నాను కనీసం రోజుకు రెండు జాక్‌పాట్స్ కొట్టడం ఖాయం! ఖర్చులన్నీపోను పదిరూపాయలు మిగుల్తాయి. చెప్పకోకూడదుకాని నాది గోల్డెన్ హ్యాండ్ సార్!' అంటూ తన చేతిని ముద్దుపెట్టు కొన్నాడు.

అతని ఆత్మవిశ్వాసానికి ఆశ్చర్యపోయాను

'మరి మీ నాన్నకీ విషయం తెలుసా?'

'తెలియవచ్చు! తెలియకపోవచ్చు! విజయవాడలో ఏదో జాబ్ చేస్తున్నానని చెప్తూవస్తున్నాను యింతకాలం. కాని నిజాన్ని ఎంతోకాలం దాయలేం సార్!'. నిజం తెల్సినా ప్రమాదంలేదు సార్! మా నాన్నకు తెల్సినా తెలియనట్లే ప్రవర్తిస్తాడు రాత్రి అయ్యేసరికి పదిరూపాయలు ఆయన చేతిలో పెడ్తాను

'మరి విజయవాడ వచ్చి సాయంత్రందాకా ఏం చేస్తావ్?'

'అలా అలా తిరిగి ఏ మ్యాట్నీనో చూసి మళ్లీ సాయంత్రం బండెక్కి ఉద్యోగులతో పేకాడతాను!'

అతని పరిస్థితిని తల్చుకొంటే నాకు జాలి కల్గింది. పేకాటతో సంసారాన్ని పోషిస్తున్నాడా?

'ఇలా చేయటం నీకు అవమానంగా లేదా?'

'ఎందుకు సార్! చాలా గర్వంగావుంది కూడా! బహుశా మీకు తెల్సివుండదు. పేకాటలో జోకర్‌గాడికి వ్యక్తిగతంగా విలువలేదు. ముక్కల

మధ్య వుంటే వాడికున్న విలువను అంచనా కట్టలేనంతగా వుంటుంది. ఈ డబ్బే సంపాదించకపోతే నాకు విలువ శూన్యం. ఏకాంతంగావున్న జోకర్‌గాడికి పేకాటలో గుర్తింపు లేనట్టుగా ఈ సంపాదనే లేకపోతే మా ఇంట్లో నా ఉనికిని గమనించేవారే వుండరు. పది రూపాయలు మా నాన్న చేతిలో పడవేస్తేనే నాకు వ్యక్తిత్వం వస్తుంది, గుర్తింపు వస్తుంది. ఇప్పుడు చెప్పండి సార్! జోకర్‌గాడికి నాకు పోలిక లేదంటారా ?

నాకు ఏం చెప్పాలో తెలియక 'ఆ పరిభాష నా కర్థంకాదు !' అన్నాను

అతను విరగబడి నవ్వేడు

అతని నవ్వులో వేదన వుంది.

అతని గుండెల్లో అగ్నిగుండం వుంది.

'ఏదైనా ఉద్యోగం చూసుకోవాలనిలేదా ?'

'ఉద్యోగం చేస్తేమటుకు ఇంతకంటె ఎక్కువ ఎలా సంపాదించగలను మాస్టారూ ? అయినా నాకు ఉద్యోగం ఎవరిస్తారు మాస్టారు ?' అంటూ మెల్లగా బెంచీమీద పడుకోవాల్చబోయాడు.

'ఎవరైనా యిస్తే చేస్తావా ?'

పడుకోబోతున్నవాడల్లా చటుక్కున లేచి కూర్చుని 'తప్పకుండా చేస్తాను సార్ !' అన్నాడు.

నేను చేతిలో వున్న డైరీని తీసి తెల్లకాగితమ్మీద ఓ అప్లికేషన్ వ్రాసి సంతకం చేయమన్నాను.

'ఏమిటి సార్ యిది ?' అన్నాడు.

'మా ఆఫీసులో వేకెన్సీ ఒకటి రాబోతుంది. అప్లికేషన్‌మీద సంతకంపెట్టు ! అదృష్టం బాగుంటే ఉద్యోగం రావచ్చు !' అన్నాను పెన్ అందిస్తూ.

'థాంక్యూ సార్ ! థాంక్యూ వెరీమచ్ !' అంటూ నా చేతిలోంచి పెన్ తీసుకొని సంతకం చేశాడు

* * *

—''హాం.. మాస్టారూ ! పార్వతిలేనిలోటు ఈరోజు కన్పిస్తూనేవుంది కదండీ !' అన్నాడు శర్మ నా భుజంతట్టుతూ.

గతాన్ని త్రవ్వుకొంటున్న నా మనస్సు ఆలోచనల గడ్డపారను అవతల పారేసి వర్తమానంలోకి వచ్చింది.

''గుడివాడ వచ్చేస్తూంది ! జాక్‌పాట్ వేయండి గురూ !'' అంటున్నాడు ప్రసాద్.

'జాక్‌పాట్‌కు టైమ్ లేదు. మామూలాట వేయండి !' అన్నాడు శర్మ.

మూర్తి ముక్కలు కలిపి అందరికీ పంచాడు

'పార్వతి ఎందుకని రాలేదంటారు ?' అని అడిగాను శర్మను.

'నాకేం తెల్సు బాబూ ! పార్వతి గురించి నాకంటె మీకే ఎక్కువగా తెల్సివుండాలి !' అన్నాడు శర్మ.

బల్లమీదున్న మాగజైన్ తీసి పేజీలు త్రిప్పసాగాను

రైలు వేగంగా పరుగులుతీస్తూంది.

పేకాట జోరుగా సాగుతూంది ! అందరూ

వేస్టు జోకర్

సస్పెన్స్ సినిమా చూస్తున్నట్లు నిశ్శబ్దంగా వున్నారు. గుండెల్ని అరిచేతుల్లో పెట్టుకొని ఆడుతున్నారు.

అలాంటి సమయంలో గుడివాడ స్టేషన్ వచ్చేసింది

బండి ఆగింది. అయినా ఆట పూర్తికాలేదు

క్లయిమాక్స్ సీన్‌కోసం తొందరపడుతున్న డైరక్టర్‌లా శర్మ తెగ హడావుడిప డుతున్నాడు

పేకలోంచి అందరూ తలో ముక్క తీసి ఎస్పృహతో క్రింద పడేస్తున్నారు.

ఆట రసపట్టులో వుంది.

హఠాత్తుగా శర్మ 'షో !' అంటూ అరిచాడు

'ఈ ముక్కకోసం ఎన్ని రౌండ్స్ తిరిగాయి గురూ !' అంటూ అప్పుడే తను పేకలోంచి తీసిన ముక్కను అందరికీ చూపించాడు శర్మ.

'జోకర్ వేస్ట్ ! పూర్‌ఫెలో ! ఇంతవరకు ఆటను సేవ్‌చేసి ఇప్పుడు తను వేస్ట్‌కార్డ్ అయ్యాడు !' అని శర్మ మిగతా వాళ్లకు చెప్తున్నాడు

అందరూ తమ శక్తిమేరకు ముడుపులు చెల్లించుకొని రైలు దిగారు.

వనితలకు మనవి
కొత్తరకం వంటలు క్లుప్తంగా వ్రాసి పంపితే త్వరగా పరిశీలించ వీలు —సం.

శర్మ, ప్రసాద్ నాకు ''గుడ్‌నైట్ !'' చెప్పి దిగిపోయారు.

వాళ్లవైపే చూస్తున్న నా కళ్లకు తళుక్కున ఓ మెరుపు మెరిసినట్లయింది. లైటు వెలుగులో ఆమె ముఖం స్పష్టంగా కన్పిస్తూంది. ఎంతో ఎండా దిగులు చోటు చేసుకొన్నప్పటికీ ఆమెలోని అందం నన్ను దృష్టిని ప్రక్కకు మరల్చనీయ లేదు. ఎప్పుడో ఎక్కడో చూసినట్లనిపించింది ఆలోచించాను అవును ! ఆమె తప్పకుండా పార్వతి అక్కే అయివుంటుంది. అవే కళ్లు, అదే ముక్కు, అదే రూపం ! . తప్పకుండా పార్వతి అక్కే అయివుండాలి..

రైలు కదిలేవరకు ఆమె వెళ్తున్నవైపే చూస్తూండిపోయాను

* * *

నెల రోజులపాటు ప్రివిలేజ్ లీవ్‌ను వాడుకొని తిరిగి డ్యూటీలో చేరటానికి వెళ్తున్న నాకు గుడివాడ స్టేషన్లో ప్రసాద్ కన్పించాడు అతను చెప్పిన సమాచారం వినగానే కొయ్యబారిపోయాను మనస్సంతా శూన్యమైపోయింది. నవనాడులూ కృంగిపోయాయి అలానే బెంచీమీద కూర్చుండి పోయాను.

'మీకీ వార్త ఎంత షాక్‌ను కల్గిస్తుందో నాకు తెల్సు మాస్టారూ ! మీకే కాదు ! ఈ నెల రోజుల నుంచి మేము ఈ విషాదాన్ని అనుభవిస్తున్నాం ! రోజుకోసారైనా పార్వతి మా కళ్ల ముందు మెదలాడుతుంది !'

'అసలీ ప్రమాదం ఎలా జరిగింది ?' వణుకుతూ అడిగాను

'పార్వతి రాలేదేమని మీరు ఆ రోజు అడిగారు గుర్తుందా ? గుడివాడ స్టేషన్లో వాళ్లక్క మమ్మల్ని కల్సుకొని పార్వతికి సుస్తీగా వుందని అయిదు రూపాయలుంటే యివ్వమని అడిగింది శర్మ యిచ్చాడు . పూర్‌ఫెలో... రెస్ట్ తీసుకోకుండా, కళ్లు తిరుగుతున్నా లెక్కచేయక స్టేషన్‌కు వచ్చాడట మర్నాడు ఎవరో ముసలమ్మ పట్టాలు దాటబోవటం చూసి ఎదురుగా వస్తున్న గూడ్సు బండి బారినుంచి ఆమెను తప్పించటానికి ప్రయత్నించాడు ముసలమ్మ ప్రాణాలను రక్షించాడు కాని తన ప్రాణాలను పోగొట్టుకొన్నాడు !'

ప్రసాద్ ఆ సంఘటనను చెబుతుంటే నా శరీరం వణికిపోయింది పార్వతి రూపం కళ్ల ముందు మెదిలింది.

'మా అందరికంటె మీకే అతి సన్నిహితంగా వుండేవాడతను ! పేరు పార్వతీశం అయినా మీరు ముద్దుగా 'పార్వతీ !' అని పిలిస్తే ఎంతో పరవశించేవాడు పాపం ! అతన్ని మర్చిపోవటం చాలా కష్టం !' అన్నాడు ప్రసాద్

'నేను మర్చిపోయినా యిది మర్చిపోనివ్వదు ప్రసాద్‌గారూ !' అంటూ జేబులోనుంచి కవరు తీసి అతనికి అందించాను.

'అపాయింట్‌మెంట్ ఆర్డర్ !' అన్నాడు ఆశ్చర్యంగా

'అవును ప్రసాద్ ! పార్వతికి నచ్చజెప్పి అప్లయి చేయించాను మా మేనేజరుకు చెప్పి అటెండర్ పోస్ట్‌కు పార్వతిని రికమెండ్ చేయించాను. నెల రోజుల క్రితమే ఈ పోస్టింగ్ అతనికి వస్తుందని నాకు తెల్సింది. ఆ శుభవార్తను అప్పుడే చెప్పాలనుకొన్నాను కాని మరెప్పటికీ చెప్పలేనన్న నిజం ఈనాడు తెల్సింది !' అన్నాను దిగులుగా

'ఈ ఆర్డర్ మీకెలా వచ్చింది ?' ప్రసాద్ అనుమానంగా అడిగాడు

'అప్లికేషన్లో అతను కేరాఫ్ అడ్రస్ నాదే యిచ్చాడు. నిన్ననే వచ్చింది ఆర్డర్ !'

''బాడ్‌లక్ !' అంటూ ప్రసాద్ ఆర్డర్ కాగితాన్ని నా చేతికిచ్చాడు.

''అతనిది చాలా పూర్‌ఫామిలీ ! అతను లేకుండా వాళ్ల సంసారం గడవటం చాలా కష్టం' పాపం వాళ్లెలా బ్రతుకుతారో ?' అన్నాను

ప్రసాద్ సిగరెట్‌ను వెలిగించుకొంటూ అన్నాడు ''పార్వతీశం లేనిలోటు వాళ్లక్క తీరుస్తుందిలే !'

అతని మాటల్లోని వ్యంగ్యం, గూఢార్థం నాకు అంతుపట్టలేదు.

'అంటే. ' అన్నాను

'ఆమె కూడా పార్వతీశంలా ఈ రైలు నమ్ముకొంది !'

'ఎందుకు ?'


'ఉద్యోగం చేస్తూందిగా !'

'ఏం ఉద్యోగం ?' ఆశ్చర్యంగా అడిగాను

'వ్యభిచారం !'

నా చేతిలోని కాగితం పెండోలోంచి వచ్చిన గాలితోపాటు పైకెగిరిపోయింది


నవరక్తిని. నవశక్తిని కలిగించే
నెస్కాఫే కమ్మని రుచితో
నూతనోత్సాహాన్ని
పొందండి.
నెస్కాఫే®
NESTLÉ
NESCAFÉ
instant coffee
నూటికి నూరుపాళ్లు స్వచ్ఛ
మైన కాఫీతో తయారయ్యే
ఒకే ఒక ఇన్‌స్టెంట్ కాఫీ
ప్రపంచంలోకెల్లా
అత్యధికంగా
అమ్ముడుపోయే
ఇన్‌స్టెంట్ కాఫీ



వారఫలం

3-2-1978 శుక్రవారం మొదలు 9-2-1978 గురువారం వరకు

మేషం:— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళా రంగాల్లో మీ కృషి రాణించగలదు.

వృషభం:— ఆందోళన కలుగుతుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. మీకంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. విలాస వస్తువులు కొంటారు.

మిథునం:— ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం మధ్యలో శ్రమ కలుగుతుంది. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు —ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం:— పోటీవారితో వాద ప్రతివాదాలు తగ్గవు. ప్రయాణాలు వాయిదా పడతాయి. రావలసిన డబ్బు అందుతుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారి పోవచ్చును. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవ కార్యాలు నెరవేరతాయి.

సింహం:— వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి

కన్య:— మీ కార్యక్రమాలు హడావుడిగా ఉంటాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ఇతరుల నిమిత్తం శ్రమ పొందవలసి వస్తుంది. స్త్రీలకు —దైవ కార్యాలు నెరవేరతాయి. ఎవరితోనూ వాదు పట్టింపులు తగవు.

తుల:— వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ప్రయాణాలు వాయిదా పడతాయి. ముమ్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృశ్చికం:— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులు సహాయం చేస్తారు. మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. స్త్రీలకు— —కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

ధనుస్సు:— ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందగలదు. వృత్తిలో పోటీ వారి పోటీ తగ్గుతుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

మైసూర్ పాక్

మైదాపిండి 1 గ్లాసు, పంచదార 1½ గ్లాసు, డాల్డా లేక నెయ్యి 2 గ్లాసులు, సోడా ఉప్పు చిటికెడు.

తయారుచేయు పద్ధతి:— మైదా పిండిని దోరగా వేయించాలి. ఒక గిన్నెలో ½ గ్లాసు నీళ్ళుపోసి చక్కెర వేసి స్టౌమీద పెట్టి తీగపాకం వచ్చేదాకా కలియపెట్టాలి. దానిలో మైదాపిండివేసి ఉండ కట్టకుండా కలియ పెట్టాలి. స్టౌమీద 5 నిముషాలుంచి ఒక పళ్ళెమునకు నెయ్యిరాసి ఈ పాకాన్ని దానిలోవేసి నలుచదరంగాచేసి మనకు ఇష్టం వచ్చిన షేపుల్లో కోసుకోవాలి. వీటిని తింటే వదిలి పెట్టరు

మైదాపిండితో బిస్కట్లు

కావలసిన వస్తువులు:— మైదాపిండి 1 కిలో, పంచదార ½కిలో, పాలు పావు శేరు నెయ్యి లేక డాల్డా 200 గ్రాములు, నూనె ½ కిలో

తయారుచేయు పద్ధతి:— ఒక గంట ముందుగా పాలల్లో పంచదారవేసి బాగా కలపాలి. మైదాపిండిని ఈ పాలు, నెయ్యితో పూరీపిండి మాదిరిగా కలుపుకోవాలి. దీనికి గాలి తగులకుండా మూత పెట్టుకోవాలి. ఒక గంట తరువాత పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసికొని పూరీల మాదిరిగా వత్తుకోవాలి. మనకు నచ్చిన డిజైన్స్‌లో చాకుతో కోసుకొని, స్టౌమీద బాణలి పెట్టి దానిలో నూనెపోసి అది కాగిన తరువాత కట్ చేసిన ముక్కలను దోరగా వేయించుకోవాలి. ఇవి నోట్లో వేసుకుంటే కరిగిపోతాయి. పిల్లలకు జబ్బుకూడా చేయవు.

అంబడిపూడి కళ్యాణి

మకరం:— వ్యతిరేకమైన వార్తలను వింటారు. విలువైన వస్తువులు పోవచ్చును. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

కుంభం:— సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వృత్తిలో ఆదాయం బాగుంటుంది. వారంమధ్యలో శ్రమ కలుగుతుంది. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. నూతన విషయాలను తెలుసుకొంటారు.

మీనం:— అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. కావలసిన డబ్బు అందుతుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. వారం ఆఖరులో ఫలితం లేని శ్రమ కలుగుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది పుణ్య కార్యాలు చేస్తారు.

—మహేష్



ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

పి. ఎస్ - బొంబాయి

పత్రిక చూడగానే మీ ప్రశ్నావళి పేజి తిప్పుతారు. మీ జవాబు లింత పొగరుగా వుండడానికి కారణం ఏమైనా వుందా!

ముక్కుమీద గుద్దినట్టు చెప్తే కాని కొన్ని విషయాలు వినరు. వెక్కిరిస్తే గాని పట్టించుకోరు. కొన్నింటిని తూలనాత్మకంగా చెప్తే పొగరంటారు పక్షపాతంగా చెప్తే చేతకాదంటారు. పోనీ అని వినయం ఉట్టి పడుతూ చెప్తే వీరికి పన్యాసి అంటారు. అందరి మాటలూ విని అష్టావక్రుడి లాగా తయారయ్యేకంటే నా ధోరణే రైటని నమ్మి రాసుకు పోవడమే బెస్టు.

విస్. ఆర్. కె. - రాజపాలెం

కొందరు యువకులు పెళ్ళికి వెనుకంజ వేస్తారు. కాని రోడ్లమీద అమ్మాయిల వంక అలా చూడడం ఎందుకు?

ఇది మరీ బాగుంది పెళ్ళికి తొందరపడ లేదు కదా అని కళ్ళకు గంతలు కట్టుకు నడవ మంటారా అబ్బాయిలని ?

వి. ఎల్. ఎన్ - విజయవాడ

మీకు వేర్పు వాకచక్యం వుందని గర్వం అవునా?

వేర్పు వాకచక్యం ప్రదర్శించడానికేగాని దాచు కుందుకుకాదే. గాలి కోడి ఇంట్లో ఏం చేస్తుంది? కప్పు ఎక్కి వున్నప్పుడే కదా దిక్కులు చూపెట్టేది.

బి. వి. ఆర్ - కోప్లి

మంచి పనిచేసినవాడు స్వర్గానికి పోతాడు. చెడ్డపని చేసినవాడు నరకానికి పోతాడు అంటారు.

అలా అని గ్యారంటీ లేదు!

డి. బి. పి. ఆర్ - అరవెల్లి

స్త్రీ జాతిని ఉద్ధరించాలంటే పురుషులను విమర్శించాలా ?

ఉద్ధరించవలసిన స్థితిలో స్త్రీ జాతిని దిగ జార్చిన కారణాలు ఏవో తెలుసుకోవాలి కద!

కె. ఆర్. ఆర్ - హైదరాబాదు

మీరు స్త్రీ జాతిని ఇంత వెనకేసుకు వస్తారు. కదా, సినిమాలలో కెబరెలలో నగ్న ప్రదర్శన లిస్తూ తైతక్కలాడుతున్న వాళ్లను గురించి ఏం మాట్లాడరేం!

ఏం మాట్లాడాలి! అది వారు వృత్తిగా స్వీక రించినప్పుడు!! అటువంటి వృత్తిలో రాబడి ఎక్కువ వున్నప్పుడు!! వాటి సెగబడి చూసి అందరూ వేలా గుమ్మరించకల ప్రేక్షకులున్న ప్పుడు.

పి. పి హెచ్. ఆర్ - ధర్మవరం

ఇంటికి జీవన జ్యోతిగా కావల్సిన ఆడదాన్ని మీరు ఆధునిక భావాలతో ఆ ఇంటికి జ్యోతి [నిప్పు]గా మారుస్తున్నారేమో.

ఏం! ఆముదం దీపాలుమాని విద్యుద్దీపాలకి మారవచ్చుగాని, ఇంటి ఆడది మాటుకు మార కూడదా?! అయినా నిప్పు అంటుకుంటుందే మోనని దీపం పెట్టుకోకుండా వుంటారా.!

బి. వి. ఆర్ - ద్రోణాచలం

ఇటు పొగడ్తనూ, అటు తెగడ్తనూ సమా నంగా స్వీకరించే సంస్కారవంతమైన మీ హృదయం అభినందనీయం అంటాను ఏమంటారు!

లది వృత్తి నేర్పిన పాటం అంటాను పొగడ్తకి ఉబ్బితెగడ్తకు కృంగిపోతే ఇంక ఏం రాయకల్గుతాం!

వై. ఆర్ - మడిపడిగ

అబ్బాయిలు, అమ్మాయిలు అన్నా చెల్లెళ్ళుగా కూడి వుంటే లోకం వారిపై నిందలు వేస్తే ఏం చెయ్యాలి!

మీలో పిరికితనం లేనప్పుడు లోకం వేసే నిందల కెందుకు లక్ష్యపెట్టాలి? అన్నా చెల్లెళ్లా కాకుండా అబ్బాయిలూ అమ్మాయిలు కేవలం స్నేహితులుగా వుండనే లేరా? స్నేహానికి చుట్ట రికం కలపక్కరలేదు. లోకానికి సంజాయిషీ చెప్పుకోనక్కర లేదు.

ఐ. వి. ఆర్. ఆర్ - వేలకొండపల్లి

స్త్రీల సమస్యలకు అర్ధంపడుతూ అటు స్త్రీలలో, ఇటు పురుషులలో స్త్రీల పట్ల న్యాయమైన ధోరణిలో ఆలోచించే లాగున చైతన్య వంతం కలిగించడానికి పాటుపడుతున్న మీతోటి రచయిత్రి రంగ నాయకమ్మపై మీరు వ్యంగ్య మైన వ్యాఖ్యానాలు చేయడం ఎంతవరకూ సమం జసం ?

హేతువాద బద్ధమైన సమస్యలను చైతన్య వంతం అయిన పరిష్కారాలను సూచిస్తున్న సోదరి రంగ నాయకమ్మపై వ్యంగ్య బాణాలు వేయడానికి నేనేం ఆవిడ ఆడబిడ్డనా? అయిన దాన్నా!! ఆమె గురించి నన్నడిగితే నాకు తెలియని సంగతి ఒప్పుకోడంలో తప్పులేదు అని నానమ్మకం దేవుణ్ని గురించి, రామాయణాన్ని గురించి నన్నడిగే కంటే హేతువాద బద్ధంగా సాంఘిక పరిజ్ఞానంతో జవాబు చెప్పకలదని ఆవిడ పేరు సూచించడం తప్పుకాదే!

రామాయణ విషవృక్షం కొంతమంది స్త్రీల ఆలోచనా ధోరణినే పూర్తిగామార్చి వేసింది

ఋథం ఇక్కడ డి. కె. విజృంభించిన కాలం లోనూ అంతే, రామర్, కృష్ణర్, మురుగన్‌లే మారిపోయి లంకేశ్వర్, వేదవేండన్, కాయెమొళి, తమిల్‌మొళి తమిల్ అశ్రఫిలు చాలా మంది వచ్చారు! కొన్ని పుస్తకాలూ, కొందరు వ్యక్తులూ అన్ని కాలాల్లోనూ ఇలా మారుస్తూ వస్తున్న ఉదంతాలు వుండనే వున్నాయి. దాల్లో వింతే ముంది ?

హిపోక్రసీకి మీరిచ్చే నిర్వచనం ?

ద్వంద్వ ప్రమాణాలకు పట్టం కట్టడం.

విల్. వి. ఎస్ - గూడూరు


పేను లేకపోతే ఆ ఇల్లు ఎలాగడుస్తుంది? అని తమబాధ ఇతురలకు చెప్పుకొంటారు. మీరు లేక ఇల్లు గడువదా ?

మహారాజులాగా గడుస్తుంది కాని తనే ఇంటికి ప్రాణంగా మనాలన్న తాపత్రయం ఇల్లాలిని అలా అవేలా తయారు చేస్తుంది.

కె. ఎస్. ఎన్ - షాద్‌నగర్

ఆడదానిమాట వినే మగవాడు ఏదీ సాధించ లేడంటారు మీరేమంటారు ?

వినక సాధించిన ఘనవిజయాలు కాసిని చెప్పమంటాను ?



క్రొత్తది!

అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్ఠమైన

ఆముదము

శుద్ధిచేసినది.
వాసనలేనిది

అమృతాంజన్ ఆముదము
సుప్రసిద్ధ అమృతాంజన్ కంపెనీ వారి
మరో విశిష్ఠమైన ఉత్పత్తి.

అమృతాంజన్ ఆముదము



మూడు
సైజులలో
లభిస్తాయి:
50 మి.లి
100 మి.లి
200 మి.లి

OBM 3270 TG

"ఆగు" అన్న తల్లి కేకకు గుమ్మందాటి లోనకు నాలుగడుగులు వేసిన సరోజ అక్కడే ఆగిపోయింది.

కూతురు కోసమే కాచుకు చూస్తున్న రమణమ్మ దగ్గరకొచ్చింది.

ముఖంలో క్రోధం!

ఈడ్చి కొట్టేటంతటి అసహ్యం.

కూతుర్ని కిందినుంచి పైకి పరీక్షగా చూసింది.

ఆ చూపుల్లో చిత్రమైన అర్థాలు ఆమెకే తెలుసు.

లైటు వెలుగులో సరోజ సరోజలాలేదు. మాసి, నలిగిన బట్టల్లో పీకి విసిరిన పాత చిత్తరువులా ఉంది. భుజాన వేలాడుతున్న ఎయిర్ బేగ్‌తో భారంగా కనబడుతోంది. అలసిపోయిన కళ్లల్లోని కాంతులు ఆరిపోయాయి. వాటిల్లోని భావాల రంగులు పాలిపోయాయి.

"ఈ రెండ్రోజుల్నుంచీ ఎక్కడున్నావ్?" మళ్లీ గద్దించింది.

"... ... ..."

"ఈ రెండ్రోజుల్నుంచీ ఎక్కడున్నావ్?" మళ్లీ అదే ప్రశ్న

సరోజ బెదరలేదు.

భయపడితే పనులు సాగవని తనకు తెలుసు.

తన తల్లి ఏమనుకున్నా బాధలేదు. కాని నిజం తనకు తెలుసు.

ఒక నిర్ణయాని కొచ్చింది.

"ఎక్కడుంటాను? - రాధ పెళ్లి దగ్గర."

రమణమ్మ పళ్ళు బిగించింది. కళ్ళల్లోంచి అగ్ని కురిపించింది.

"రాధ పెళ్లి దగ్గర— హూ— కాదు— నువ్వెక్కడో నా పరువు గంగపాలు చేస్తున్నావు."


"అమ్మా."

"అవునే— అవును. ఎక్కడో నీయిష్టాను సారంగా కళ్ళు మూసుకుపోయి ప్రవర్తిస్తున్నావ్— చెప్పు— నిజం చెప్పు."

సరోజ చుట్టూ సుడిగుండం ప్రారంభమవుతూంది. పదో తరగతిలోనే బడి మానిపించివేయగా, ముక్కుతూ, మూలుగుతూ యింట్లోనే కూర్చున్న వసంత కూడా

కొత్త కెరటం

జి. నరసింహమూర్తి



అవతల గుమ్మం దగ్గర నిలబడి అంతా చూస్తోంది.

ఎప్పుడూ మంచం వదలని జబ్బు తండ్రిని అగుపించని శక్తి నెమ్మదిగా అక్కడకు గెంటుకొచ్చింది.

అలసటగా నీరసంగా వున్న శరీరాన్ని అలాగే నిలదొక్కుకుంటూంది సరోజ.

"చెప్పవేమే" అంటూ చెట్లంత. కూతురు మీద విరుచుకు పడుతోంది రమణమ్మ

సంబంధాల కోసం ఊళ్ళమీద వెళ్ళిన కృష్ణారావు అప్పుడే లోనకొచ్చాడు. జరుగుతున గొడవ చూసి "ఏం జరిగింది" అని అడిగాడు.

అన్నను చూసిన వసంత లోనకు తప్పుకుంది ఏ గొడవ ముంచుకొస్తుందో నన్న భయంతో.

ఇప్పుడు సరోజ సుడిగుండంలో చిక్కుకుంది.

పొరుగు రాష్ట్రంలో ఉద్యోగం చేస్తున్నాడు కృష్ణారావు. కష్టార్జిత మంతా కూడగట్టుకొచ్చాడు చెల్లెలు పెళ్ళి చేయడానికి సెలవుమీద వచ్చాడు, కుటుంబ గౌరవాన్ని నిలపడానికి చెల్లి పెళ్ళి బాధ్యత తాను స్వీకరించాడు

తండ్రి శేషాద్రి కూతుళ్ళను కన్నాడు. అంతే. తన బాధ్యతల్ని మాత్రం కొడుకు మీద పడేసి మంచమెక్కాడు.

కూతురు బెండకాయలా ముదరకముందే పెళ్ళి జరిపించాలని అన్ని ఆశలూ కొడుకు మీదే పెట్టుకుంది రమణమ్మ

చెల్లెలు సరోజ అలా కనబడుతుందేమిటి? — అందుకే మళ్ళీ అడిగాడు కృష్ణారావు.

తల్లికి అదంతా చెప్పడానికి బెరుగ్గా ఉంది. మరోపక్క అభిమానం అడ్డొస్తుంది కాని చెప్పడం తప్పలేదు

"నువ్వు దీన్నో యింటిదాన్ని చెయ్యాలని అష్టకష్టాలూ పడుతున్నావు కృష్ణా — కాని ఇది చేస్తున్న సిగ్గుమాలిన పనులు చెప్పాలంటే మనందరికీ తలవొంపులు."

"అసలింతకీ జరిగిందేమిటి?"

"అడుగు — దాన్నే అడుగు — వద్దని నెత్తీ నోరూ కొట్టుకుంటున్నా కోటేశ్వరరావుగారి కూతురు రాధ పెళ్ళికని ఒక్కర్తే వెళ్ళిపోయింది. ఇంతక్రితమే కోటేశ్వరరావుగారి పెద్దబ్బాయి ఏదో పనిమీద ఈ ఊరొచ్చి యిలా పలకరించడానికొస్తే దీని గురించడిగాను. ఇదసలు వాళ్ళింటికెళ్ళనే లేదట — అయితే ఈ రెండ్రోజులూ ఎక్కడుంది?"

కృష్ణారావు ఏదో మాయజగత్తులో మతిహీనుడ్లా నిలబడిపోయాడు తాను వింటుందేమిటి?—తన చెల్లెలు గురించేనా? అదీకూడా సరోజగురించేనా?

పట్టువట్టి బిక్కాపోసయింది. తెలివైంది. చిన్నప్పటినుంచీ ఎంతో బుద్ధిగా ఉంటూంది. నేడిలా మారిపోయిందంటే నమ్మలేకుండా ఉన్నాడు.

"నిజమేనా?"

"లేకపోతే కన్నకూతురుమీద లేనిపోనివి చెప్పుకునే పాపాత్మురాలినను కున్నావా బాబూ! అయినా దీనికిది మొదటిసారి కాదు. కాలేజీలో ఏవో ముఖ్యమైన కాగితా లుండిపోయాయని వెళ్ళి నాలుగురోజులుగ్గాని తిరిగి రాలేదు. సరే వెళ్ళింది కాని వెళ్ళింది వెళ్ళి వట్టొచ్చిందా? మెళో గొలుసు పడేసుకొచ్చింది, ఇది గొలుసు పడేసుకొచ్చిందో ఎవరికైనా యిచ్చే వచ్చిందో ఎవరికి తెలుసు ఛీ వెధవ బతుకు."

రమణమ్మ ఆగ్రహం అసహ్యంగా మారుతుంది.

ఎక్కడో ఉద్యోగం చేస్తున్న కృష్ణారావుకి ముందెన్నడూ ఇటువంటి కుటుంబ సమస్యలు వినలేదు. యవ్వనంలో ఉన్న చెల్లెలు ఇంతింత పనులు ప్రారంభించిందని ఇంతవరకూ తనకు తెలియదు

సరోజ డిగ్రీ తీసుకున్న ఓ నెలకి కాలేజీలో పనుందంటూ బయలుదేరింది. కాలేజీ కెళ్ళాలంటే పదిమైళ్ళు ప్రయాణం చేయాలి. కూతురు గడపదాటితే గుండెల్లో రాయి పడ్డట్టుంటాది తల్లికి. ఆ చదువెలాగో అయిపోనిచ్చింది వద్దు వద్దంటూనే—కాని పెళ్ళి కావలసిన పిల్ల వీధిలోకి రావడమంటే అటు రమణమ్మకీ, ఇటు తండ్రికీ బాధగానే ఉంటుంది. తల్లీ తండ్రీ వెళ్ళొద్దంటున్నా సరోజ వెళ్ళిపోయింది వెళ్ళింది నాలుగు రోజులగ్గాని తిరిగి రాలేదు.

తర్వాత కూడా కాలేజీ మీద వంకపెట్టి

కొత్త కెరటం

వెళ్ళిందల్లా మూడు రోజులగ్గాని తిరిగి రాలేదు

ఇంటిలో ఇబ్బందుల్ని చూసిన సరోజ ఉద్యోగం చేస్తానని పట్టుపడితే, శుభ్రంగా పెళ్ళాడి సంసారం చేయడమే తమకు సంతోషమన్నారు

ఉద్యోగంలో చేరి పెళ్ళికి పంగనామాలెడుతుందన్న భయం - తమ సాంప్రదాయాలకు భిన్నంగా జరగక్కూడదన్నదే వాళ్ళ భావన

సరోజకి పై చదువులకెళ్ళే ఆర్థిక స్తోమత లేదు పరిస్థితుల కనుకూలంగా మారిపోవాలనుకుంది. స్త్రీకి సంఘంలో స్వాతంత్ర్యం ఉండాలంటే ఆర్థికస్వాతంత్ర్యం కోసం శ్రమించాలనుకుంది. తన ఆశయాలకు తల్లిదండ్రులు అడ్డుగోడలు ఎంత చదివించినా అంతేనని చిన్న కూతుర్నికూడా యింటిదగ్గరే కట్టేశారు. కాలం కలిసొచ్చి మొగుడొస్తే ఆమెకు విముక్తి లేకపోతే అంతే!

ఆశయాల్ని అవతలపెట్టి గృహిణి కావాలంటే కట్నం తన వ్యక్తిత్వాన్ని హేళన చేస్తుంది. కట్నంతో భర్తను కొనుక్కొని భార్యగా బతికేకంటే అసలు పెళ్ళి చేసుకోకుండా వ్యక్తిత్వం గల స్త్రీగా బతకడంలో హాయి ఉందని సరోజ ఉద్దేశ్యం.

ఆదర్శమూర్తులున్న దేశమే ఇది. కాని ఆడదాని కట్నంకాడ మాత్రంకాదు. స్త్రీ సాంఘిక విలువని కట్నంతో తూచే వ్యవస్థ మీద సరోజకు కక్ష!

కృష్ణారావు రెండు సంబంధాలు వెదికి తెచ్చాడు. కట్నం మాత్రం చుక్కలెక్కి కూర్చుంది. కట్నంమీద చుక్క లెక్కి కూర్చుంటున్నాయో చుక్కమీద కట్నం ఎక్కి కూర్చుంటుందో తెలియక కృష్ణారావు నానా తంటాలు పడ్డాడు.

సరోజ మాత్రం తనకా సంబంధాలు నచ్చలేదని బాహాటంగా చెప్పేసింది ఆ రెండు పార్టీలకూ.

తల్లి గుండెలు బాదుకుంది. తండ్రి కూతుర్ని తిట్టుకుంటూ కాండ్రించి ఊసాడు.

జరిగిందేదో జరిగిందని నాలుగురోజులుంచి పెళ్ళికొడుకులకోసం వేటాడి వచ్చాడు కృష్ణారావు. వాళ్ళు త్వరలో పిల్లను చూసుకోడానికి వస్తామన్నారు కాని తన చెల్లెలు ఇంటిపట్టున లేకుండా ఎక్కడెక్కడో తిరిగొస్తుందని తెలిస్తే తమ పరువేంకాను? పెళ్ళికావలసిన ఇంకో అమాయకురాలుండే!

వీళ్ళకోసం తన సర్వం త్యాగం చెయ్యాలనుకుంటున్నాడు. జరుగుతున్నది మాత్రం వేరు.

చెల్లెలు సరోజ పెళ్ళంటే ఎందుకలా ఎదురు తిరుగుతుందో ఆమె తిరిగే తిరుగుళ్ళవల్ల తన కర్మమవుతూంది. దీని వెనకేదో కుళ్ళు ఉంది

ఇదేదో తేల్చిపారెయ్యాలి, ఇక సహించేది లేదనుకున్నాడు కృష్ణారావు.

"సరోజా!, ఎక్కడికెళ్ళావ్?"

సరోజ ఏమీ చెప్పలేకపోతుంది. సుడిగుండంలో కొట్టుకుంటుంది.


"మాట్లాడవే?"

"ఏం మాట్లాడుతుందిరా దీనికింతవరకూ చదువు చెప్పించి వందుకు చేస్తున్న నిర్వాకం ఇది" తల్లి ఎత్తిపొడుపు!

"అదేంటో ఇపుడు తేలిపోతుంది. చెప్పు" అంటూ ముందు కొస్తున్నాడు కోపంగా.

"నన్ను మీరంతా ఎందుకిలా బాధ పెడ్తారు?" ఓర్చుకోలేక పోతుంది.

"మేమా నిన్ను బాధ పెడుతుంట?— హుఁ—నీకు పెళ్ళి చేయడానికి మే మెన్ని



అవస్థలు పడుతున్నామో నీకేంతెలుసు ?''

''నేను మీకు ముందు నుంచీ చెబుతున్నాను, నా పెళ్ళి విషయంలో ఎవరూ అవస్థలు పడవద్దని.''

''అంటే ?''

''అంటే ఏముందిరా బాబూ!, ఏ కులంతక్కువాడ్నో తెచ్చుకుని కొంప ముంచడానికి ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసిపోతుంటే.''

''నిజంచెప్పు'' కృష్ణారావు

''చెప్పవలసిందేమీలేదు—మీకు కులాలూ, సాంప్రదాయాలూ, వంశమర్యాదల మీదున్న అపారమైన జ్ఞానం ఆడపిల్లల అభిప్రాయాల్ని అర్థం చేసుకోవడంలో లేకపోతున్నందుకు విచారించాలి''

ఈ మాట ఛెళ్ళున తగిలింది కృష్ణారావుకి. కృష్ణారావుకే కాదు. అక్కడున్న అందరికీ.

''సరోజా! నువ్వు హద్దులు మీరుతున్నావు.''

''అలా అనుకుంటే నేనేమీ చెయలేను.''

''ఎంతైనా కట్నం యిచ్చి మంచి సంబంధం తెచ్చి నీకు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాను''

''చాలా సంతోషం అన్నయ్యా!— కాని నీ వంటి అన్నలున్న చెల్లెళ్ళు యికనైనా సిగ్గుపడాలి.''

''సరోజా.''

''అవును. కట్నంపోసి అమ్మేయ్యాలనుకుంటున్న నీ వంటి అన్నయ్య లున్నంత వరకూ నావంటి చెల్లెళ్ల జీవితాలు సజీవ సమాధుల్లో కుమిలిపోతాయి.''

కృష్ణారావుమీంచి రైలు చక్రాలు పరుగులు తీసినట్టయింది.

''అంత అహంకారమటే నీకు, అసలు సంగతేమిటో చెప్పు'' అంటూ తండ్రి కోపంతో ఉక్కిరి బిక్కిరై ఏది భరించ లేక విపరీతంగా దగ్గుతున్నాడు

''చెప్పడానికేముంది ఈ బుద్ధిమాలిన దానికి చదువు చెప్పించాము కనుక కడకు మన గొంతుక్కే తాడెయ్యడానికి తయారప్తుంది'' అంటూ తల్లి ప్రారంభించింది

''ఒకరి గొంతుకల్ని మరొకరు కోసుకునే రోజులు రాకూడదనే నా కోరిక'' అంటూ లోచనా పూర్వకంగా ఎటో చూస్తుంది.

''సరోజా !, చదువుకున్న దానివని

కొత్త కెరటం

ఇంతసేపట్నుంచీ ఓర్చుకున్నాను. అసలు నీ ఉద్దేశం ఏమిటి ?''

''ఉద్దేశ్యం – హుఁ – ఆడపిల్ల ఉద్దేశాలకెప్పుడైనా విలువనిచ్చారా ? - మీరే కాదు; ఈ దేశంలో ఎక్కడ చూసినా ఇంతే''

''అసలు సంగతేమిటో చెప్పు.''

''అది నీకనవసరం.''

కృష్ణారావు భగ్గున మండాడు కోపంతో ''రాక్షసీ'' అంటూ ఛర్రున ముందుకెళ్ళి కొట్టడానికి చెయ్యెత్తాడు

''అన్నయ్యా'' అంటూ ఆమె ప్రతిఘటిస్తూ వేసిన కేకకి కృష్ణారావు అలాగే నిలబడిపోయాడు

చెల్లెలు కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నాయి.

ఆమె సరోజలాలేదు అగ్నిశిఖలా ఉంది.

''చెయ్యిదింపు నా తోవకు అడ్డువస్తే అన్నవైనా తండ్రివైనా లెక్కచేయను. జాగ్రత్త !'' అని కారుమేఘంలా ఉరిమింది చకచకా లోనకెళ్ళిపోయింది

అంతా నిశ్చేష్టులైపోయారు.

ఒకరిముఖాలు మరొకరు చూసుకున్నారు.

కాని ఆ చూపుల్లో జీవంలేదు

అంతకుముందే బాంబు పడ్డట్టు ఆ ప్రదేశం ప్రకంపిస్తూంది.

రేపోమాపో పెళ్ళిచూపుల కొస్తున్నారు, నేనేం చెయ్యనంటూ కృష్ణారావు తల్లిదండ్రులంతో ఆలోచించాడు ఆ రాత్రి. ఎలాగైనా దీనిని ఎవడికో ముడిపెట్టకపోతే చేయిజారి పోవచ్చనే అనుమానం వాళ్ళనందర్నీ చుట్టుకొంది.

అయిదురోజులు గడిచాయి. ఆ అయిదు రోజుల్లోనూ రెండు సంబంధాలొచ్చాయి.

కట్నాలకాడ కొచ్చేసరికి కథ అడ్డం తిరిగింది.

నేను మీ యింటికి శాశ్వతంగా చాకిరీ చేయడానికొస్తున్నాను· పైగా చదువుకున్నాను ఒప్పుకుంటే ఉద్యోగం చేస్తాను. చాలీచాలని మీ జీతాలకి మరికొంత జీతం జతచేసి సంసారం స్వర్గమయం చేస్తాను చచ్చేవరకూ పీడించే ఆర్థిక సమస్యల్లో పడి జీవితాన్ని అసహ్యించుకునే మీకో నవజీవనం చూపుతాను నన్ను పెంచడానికేగా మీరు

కట్నం తీసుకుంటుంటే, నాకొచ్చే జీతంతో బతుకుల్ని సుఖమయం చేస్తాను.

కనుక కట్నం నాకెంత ఇస్తారో తేల్చమంది సరోజ.

వాళ్లకి కళ్లు తిరిగిపోయాయి.

కోమలాంగి కొత్త సిద్ధాంతం పాత సాంప్రదాయాలపై సరికొత్త యుద్ధంలా ఉంది.

నోరు మూసుకొని వెళ్లిపోయారు.

కృష్ణారావు ఆ అవమానం భరించలేకపోయాడు. చదువుకున్నదాని సంస్కారం ఇలా వెర్రితలలేస్తుందా? – దీనికింత గర్వమా?

జుట్టు పట్టుకు లాక్కుపోయి ఏ రెండో పెళ్లివాడి చేతనైనా పుస్తె కట్టించి దాని కళ్ళు తెరవాలనుకున్నాడు.

ఇల్లంతా గగ్గోలుగా ఉంది. తల్లీ, తండ్రీ కొడుకూ కొత్త ఆలోచనలు ప్రారంభించారు.

పెళ్లికోసం ఉన్న భూమీ, ఇల్లూ తనఖా రాస్తే వడ్డీమీద అయిదువేలు మాత్రం ఇస్తానని వో ఆసామీ అన్నాడు ఒకవేళ అమ్మాయిని తనకే యిచ్చి చేసినట్లయితే మూడువేలు కట్నం తీసుకొని వడ్డీ మాత్రం వదులుకుంటానన్నాడు.

ఇదికూడా బాగుందనుకున్నారు. పోయిన పెళ్లాన్ని కిరసనాయిలు పోసి అంటించినంత మాత్రాన ఈమెను కూడా అలా చేస్తాడనెక్కడుంది?–అందుకే ఇదే భాయం అనుకున్నారు.

సరోజకిదంతా తెలిసింది. అయినా ఏమీ మాట్లాడలేదు. అదేదో చూద్దాంలే అని ఊరుకుంది. అంతకంతా ప్రతిమించితే పెళ్లిపీటల మీద అందరికీ కావలసిన రీతిగా సత్కారం చెయ్యాలనుకుంది.

మరో రెండ్రోజులు గడిచాయి.

సరోజ లోన గదిలో ఉంది.

బయట "టెలిగ్రాం".అంటూ సైకిల్ బెల్ మ్రోగిస్తున్నాడు పోస్టుమేన్. సరోజ విని బయట కొచ్చింది. మామూలుగా యింటికొచ్చే ఉత్తరాలన్నీ కొన్నినెలల నుంచి సరోజే అందుకుంటుంది.

తాను బయట కొచ్చేసరికి కృష్ణారావు గబగబా సంతకం చేసి టెలిగ్రాం తీసుకుంటే దానిమీద వి. సరోజ కేరాఫ్ వి. శేషాద్రి అనుంది. చెల్లెలు పేరుమీద టెలిగ్రాం రావడం కొంత ఆశ్చర్యంగానే ఉన్నా అదేమై వుంటుందోనన్న ఆరాటంతో చించి చదివాడు. మళ్లీ చదివాడు.

అతవి ముఖం తెల్లబడి పోయింది.

టెలిగ్రాంలో ఉన్న బరువు మోయలేక అతని చేతులు వణుకుతున్నట్టున్నాయి.

తల్లీ తండ్రీ కంగారుపడి అడిగారు.

"సరోజకు బ్యాంకులో ఉద్యోగం వచ్చింది."

అంతా సరోజవేపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"ఆశ్చర్యంగా ఉందా?, నాకు ఉద్యోగం వచ్చింది. కుటుంబ గౌరవమంటూ, సాంప్రదాయాలంటూ ఆడదానికి ఉద్యోగం తగదన్నారు. నన్ను కట్టుకునేవాడికివ్వవలసిన కట్నంకోసం అప్పులుచేసి అన్నీ అమ్ముకొని నడిరోడ్డున పడడానికే మీరు సిద్ధంగా ఉన్నారు. కాదన్నానని నామీద కన్నెర్ర చేశారు. నాకూ ఆర్థిక స్వాతంత్ర్యం ఉందనీ, నేనూ సంపాదించగలననీ చెబితే నన్ను ఎగతాళి చేసారు. నాకు నచ్చినవాడితో పెళ్లాడి నా బతుకును తీర్చి దిద్దుకోగలనని నేనెన్నిసార్లు చెప్పినా మీరది వినిపించుకోలేదు.


కన్న తల్లిదండ్రులైన మీరు నా వివాహ బాధ్యత అన్నమీదకు తోసేశారు. నేడు నా పెళ్లి. రేపు చెల్లెలు వసంత పెళ్లి. అన్న పరాయి రాష్ట్రాల్లో కష్టాలనుభవిస్తూ ఆర్జించే మొత్తమంతా చెల్లెళ్ల కోసం ఖర్చు చేస్తూ ఉండాలి. ఇక మరో ఆధారం లేక తనఖాలమీద అప్పులు చేయాలి. చెల్లెళ్ల పెళ్లికోసం తన బతుకంతా కష్టాల్లో నాశనం కావాలి, ఈ దేశంలోఉన్న లక్షలాది అభాగ్యుల్లో అన్న కూడా ఒక్కడైపోవాలి. అంతేకదా! ఏం?– మాట్లాడరే?

అందుకే బతికే హక్కూ, బతకడానికి మార్గమూ స్వయంగా సంపాదించాలనుకొన్నాను.

ఆడదాని నుంచి కట్నం ఆశించే మగవాడు తిరిగి కట్నంగా ఆడదానికే ఇచ్చుకోవలసిన వ్యవస్థ వస్తే 'ఇది అన్యాయం, అక్రమం' అంటూ ఎదురుతిరగడా? అందుకే పెళ్లిచూపులకొచ్చే ప్రబుద్ధుల్నించి నేను కట్నం కోరాను కాని నన్నెవరూ అర్థం చేసుకోలేకపోయారు. నేనో అహంకారినని నిందించారు. కాని నిజం ఏమిటన్నది ఎవరికీ అక్కర్లేకుండా పోయింది.

కొత్తమార్గం తొక్కాను. ఉద్యోగం సంపాదించాలన్నదే ధ్యేయంగా పెట్టుకున్నాను కృషిచేసాను ఏవేవోవంకలు పెట్టి ఇంటర్వ్యూలకు వెళ్లాను. ఖర్చుకి డబ్బు కావలసి వస్తే వెళ్లోగొలుసు అమ్మాను.

ఆడది అబలగా పడున్నంతకాలమూ ఆమె పరిస్థితిలో మార్పురాదు తెగించాలి. తనకుతానై ముందుకు రావాలి అన్యాయానికి ఎదురు తిరగాలి. తనను తాను రక్షించుకోడానికి ప్రయత్నం చేయకుండా ఎవరో వచ్చి రక్షిస్తారనుకోవడం ఆత్మవంచన. ఆడదానికి అనాదిగా సంఘంవేసిన సంకెళ్లు తెంచుకొని ముందుకురకాలి. అప్పుడే స్త్రీజాతికి విమోచనం.



మాయాజాలం మణికట్టు

'చెమిలియన్ ప్లేయింగ్ కార్డు'

ఇంద్రజాల ప్రదర్శన యివ్వడం విషయంలో కొన్ని కొన్ని సందర్భాలలో మనం ఇంద్రజాలికుల మని ముందుగా తెలుపకుండా, ప్రదర్శనానంతరం మన అసలు విషయం బయట పడినప్పుడు అవతలివారు చెప్పలేనంత ఆనందాశ్చర్యాల్ని పొందుతారన డంలో సందేహం లేదు.

అది కాకినాడ కాస్మోపోలిటన్ క్లబ్. సాయంకాలం వాకేమీ తోచనప్పుడు సరదాగా క్లబ్‌లో బిలియర్డ్స్, టేబుల్ టెన్నిస్, వగైరా ఆడుతూ కాలక్షేపం చెయ్యొచ్చని క్లబ్‌లో మెంబరుగా చేరాను.

మెంబరుగాచేరి 15 రోజులయిందేమో, ఐదారుగురు మెంబర్లు పరిచయ మయ్యారు. రోజూ ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకోడం వల్ల మా పరిచయం కాస్తా స్నేహంగా మారడం, తర్వాత రాను రానూ, ఏ ఆట ఆడదల్చుకున్నా, మా గ్రూప్‌లో వాళ్లమే కలిసి ఆడుకుంటూండే వాళ్లం.

అట్లాగే ఒక సాయంకాలం నాడు మా గ్రూప్‌లో అందరమూ కలిసి మూడు ముక్కలాట (ఫ్లాష్ లేక రమ్మీ)ఆడుకుందా మని నిర్ణయించుకుని క్లబ్‌లో ఒక కార్నర్‌లో వున్న టేబుల్ చుట్టూ కూర్చుని ఆట ప్రారంభించాము

ఈ ఆటలో ముఖ్యంగా మూడు ఆసులు ఎవరికి వస్తే వాళ్లు గెలిచినట్లు.

మొదటి రెండాటలు మందకొడిగా సాగనిచ్చి, తర్వాత నా తడాఖా చూపించాను. అక్కడి నుంచి ప్రతి మూడు ఆటలకి రెండాటలు నేనే గెలవడం మిగిలినవాళ్ళంతా ఆశ్చర్యపోడం జరుగుతూ వచ్చింది.


అట్లా కాసేపు మా ఆట ఎంతో ఆసక్తి కరంగా నడిచింది.

తర్వాత మిత్రులలో ఒకడు అందర్నీ ఉద్దేశించి–"మిత్రులారా మనం యింత వరకు సరదాగా ఆడుకున్నాం. కాని మన ఆట యింకా ఆసక్తి కరంగా జరగాలంటే యీసారి 'మనం పందెం వేసుకుని ఆడదాం" అన్నాడు.

ఈ సారి ఆటలో ఎవరికి మూడు ఆసులు వస్తే వాళ్ళకి మిగిలిన వాళ్లంతా డబ్బులు వేసుకుని ఐస్‌క్రీం యిప్పించాలని నిర్ణయించు కున్నాము.

అందరికి ముక్కలు పంచడం జరిగింది. నాకు రెండాసులు, ఒక డైమండ్ రాణి వచ్చాయి.

నేను డైమండ్ రాణిని 2.వ చిత్రంలో చూపిన విధంగా ఆటీన్ ఆసుగా మార్చేసి



మొత్తానికి మూడు ఆసులు వచ్చినట్లుగా చూపెట్టి ఆట నెగ్గాను. అంతే! అంతా ఆశ్చర్యపోయారు !!

ఆ తర్వాత అందరూ కలిపి నాకు ఐస్‌క్రీమ్‌కొని ఇచ్చారు. కాసేపు మొహమాట పడినట్లుగా నటించి తర్వాత గుటుక్కు చప్పుడు కాకుండా ఐస్‌క్రీమ్ తినేసి మూతి తుడుచుకున్నాను.

ఇంతలో నా చిన్ననాటి స్నేహితుడు మురళీధర్ మమ్మల్ని సమీపించి

హల్లో మిష్టర్ కామేష్ హౌ డు యు డూ ..! మా క్లబ్‌లో మెంబరగా చేరి ఎన్నాళ్ళయింది? ఎప్పుడు చేరినట్లు ?? వీళ్ళంతా నీకెలా తెలుసు ??? అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

వెంటనే అందరూ...... "అదేమిటి కామేష్ నీకు బాగా తెలుసా !? హిం ఈజ్ ఏన్ ఎక్సుపర్టు యిన్ కార్డ్స్. ఇందాకటి నుంచీ అన్ని ఆటలు ఒకటే దంచి పారేస్తున్నాడు" అన్నారు.

"కామేష్ తెలీక పోవడమేమిటి! మేమిద్దరం చిన్నప్పటినుంచే కాలేజీలెవల్ వరకూ కలిసే చదువు కున్నాం. ఇప్పుడు మెజీషియన్ కామేష్‌గా బాగా తెలుసు !! అన్నాడు.

అంతే! నేను మెజిషియన్ అని తెలియగానే కాసేపు అంతా నిర్ఘాంత పోయారు !!

ఆ మరు నిముషం అందరూ ఏం నిర్ణయించు కున్నారో తెలియదు ఒక్కసారిగా అంతా లేచి నిలబడి టేబుల్ మీదున్న పేక ముక్కల్ని నాజేబులో కూరి, అమాంతంనన్ను కుర్చీలో సహా మోసుకెళ్ళి క్లబ్ గేటు దగ్గర వదిలేసి. యిక మాజోలికి రావద్దంటూ, ఒకరి మొహాలొకరు చూసుకుంటూ తప్పు కున్నారు.


ఇదంతా చూస్తున్న క్లబ్‌లోని మెంబర్లంతా, వాళ్ళని చూసి పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకున్నారు.

నేను మెజిషియన్‌ని కాబట్టే అన్నిసార్లు విజయం సాధించగల్గానని వాళ్ళకి తెలిసి పోయినప్పటికి, నేను ప్రతి పేక ముక్కకీ చిత్రంలో చూపిన విధంగా సన్నటి ఆసు ముక్క కాగితాన్ని అంటించి క్లబ్‌కు తీసుకు వచ్చానని వాళ్ళు తెలుసుకోలేక పోయినందుకు 'హమ్మయ్య' అనుకున్నాను. ఆ తర్వాత నుంచి వాళ్ళెవరూ నాతో పేకాడ మంటే పరిగెట్టేవారు.

గమనిక :– యీ అయిటమ్‌లో పేక ముక్కని మార్చేటప్పుడు 2 వ చిత్రంలో సూచించిన విధంగా పట్టుకుని అత్యంత వేగంగా మార్చాలి. వేగం తగ్గించి మార్చారనుకోండి. – ఇంతేసంగతులు

— భావరాజు కామేష్

యాదృచ్ఛికం



రాఘవరావు వేదగిరి

సికింద్రాబాద స్టేషన్ దగ్గర నుండి అప్పుడే కదిలింది నెంబరు 42 డబుల్ డెక్కర్ బస్ పరుగెత్తుకుంటూ వచ్చాడు జగన్ బస్ ఎక్కి క్రింది సైడ్‌లో డ్రైవర్ వెనుక ప్రక్క కూర్చున్నాడు ఏడెనిమిది మంది తప్ప ఎక్కువ మంది ప్రయాణీకులు లేరు. చేతి రుమాలతో ముఖం తుడుచుకుంటూ చుట్టూ పరికించాడు జగన్. ఎదురు సీట్లో ఒక లావాటి వ్యక్తి చుట్ట కాలుస్తున్నాడు బహుశ పల్లెటూరి వాడు కావచ్చు నీరుకావి పట్టిన పంచె లాల్చీ వేసుకున్నాడు. లాల్చీ ప్రక్క జేబుల్లో ఏవో కాగితాలు బయటకు తొంగి చూస్తున్నాయి.

"బాబూ! ఇది వుస్మానియా ఆసుపత్రి కాడికి పోతుంది కదా" జగన్ వంక చూస్తూ ప్రశ్నించాడా లావాటి వ్యక్తి.

"ఆఁ... పోతుంది నయాపూల్ స్టేజి అదే ఈ బస్సు లాస్టు స్టేజి– అక్కడ దిగండి ఎదురుగా ఉస్మానియా కన్పడుతుంటుంది." జవాబిచ్చాడు జగన్. ఇంతలో కండక్టర్ వచ్చి టికెట్లు ఇచ్చాడు ఇద్దరికి.

"ఈ టైములో లోనికి పోనిస్తారా బాబూ! మా చుట్టాలమ్మాయిని హాస్పిటల్ చేర్పించినారని చూద్దామని వచ్చినా బాబూ" అడిగాడు లావాటి వ్యక్తి

"ఆఁ ... ఆఁ ... పోనిస్తారు బస్సు దిగంగానే ఆలస్యం చేయకుండా వెళండి"

ఆలోచనా స్రవంతిలో మునిగిపోయాడు జగన్. సాయంత్రం ఏడు గంటలకు సుజాతతో అపాయింట్ మెంటు వుంది. కనీసం ఓ చీరైనా ప్రజంటేషన్ చేయక పోతే కోపం వస్తుంది ఆమెకు జేబులో డబ్బు లేదు ఎవరి నడిగితే ఇస్తారు అప్పు. ఎలా సంపాదించాలి ఆలోచిస్తున్నాడు జగన్.

షడన్ బ్రేకులో ఆగింది బస్సు. ఎదుటి లావాటి వ్యక్తి గబాల్న జగన్ సీటు పైకి వచ్చి పడ్డాడు అతని చుట్ట కంపు జగన్‌కి మరింత చిరాకు కలిగించింది.

"క్షమించండి బాబూ! పడాలని మీద పడ్లేదు" క్షమాపణలు తెలుపుకున్నాడా వ్యక్తి కాని జగన్ చూపులు అతని జేబులోంచి జారిపడ్డ లావాటి పర్సు మీద వున్నాయి.

"ఫర్లేదులేండి! ఇదే ఆఖరి స్టేజి ఆ రోడ్డు ఎదురుగా వున్నదే ఉస్మానియా, రోడ్డు దాటి వెళండి" అన్నాడు

లావాటివ్యక్తి రోడ్డు దాటుతున్నాడు.

జగన్ నెమ్మదిగా సీట్లోంచి లేచాడు. అటు ఇటూ చూశాడు. క్రిందనుంచి పర్సు తీసి చూశాడు ఏవో కాగితాలు వాటిమధ్యలో రెండు వందరూపాయల కాగితాలువున్నాయి. వచ్చనోట్లు రెండూ తీసి జేబులో పెట్టుకుని పర్సు బస్సులోనే పారేశాడు క్రిందకి దిగి వడివడిగా నడిచాడు తేలికపడ్డ మనస్సుతో.

* * *

కిరణ్ మనస్సు ఏమి బాగులేదు. ప్రొద్దున్నించి ఒక్క జేబుకూడా దొరకలేదు. రొండ్రోజుల్నించి వర్సమ్మ గడబిడచేస్తోంది "పాత బాకీ మొత్తం తీరిస్తేగాని ఈరోజు ఒక్కగ్లాసుకూడా పొయ్యదట. వెధవ లం... రేపు పోయేటప్పుడు కట్టుకు పోతుంది"

యాదృచ్ఛికం

తిట్టుకున్నాడు.

"అదృష్టం బాగుంటే ఈ బస్సులోనైనా మంచి జేబు దొరకాలి" అనుకుంటూ ఎదురుగావున్న డబల్ డెక్కర్ ఎక్కి కూర్చున్నాడు.

కాళ్లదగ్గరేదో తగిలితే చూశాడు కళ్లు చమక్‌మన్నాయి. పర్సు...

"అదృష్టం బావుంది ఈ రోజు వెతకబోయిన తీగ కాళ్లకు తగిలింది. పర్సు తీసి చూశాడు ముందు అరలో రూపాయి చిల్లర వెనుక అరలో ఏవో కాగితాలు.

"జోడిముం... కొడుకు. ఇంట్లో కాగితాలన్నీ పర్సులో పెట్టుకుని తిరగటం ఫేషన్ అయిపోయింది ఈరోజుల్లో" పర్సులో కాగితాలన్నీ పారేసి పర్సు పారేయటానికి ఇష్టంలేక పర్సు జేబులో వేసుకున్నాడు. బస్సులోంచి దిగి గబగబా నడిచాడు అదృష్టాన్ని వెతుక్కుంటూ.

పోలీస్‌స్టేషన్ ముందు వడుంమీద చేతులు పెట్టుకుని నిల్చుని వున్నాడు సబిన్‌స్పెక్టర్, ప్రక్కనే బెల్‌బాటమ్ యువకునితో మాట్లాడుతూ.

ఎస్.ఐ.ని చూస్తూనే గతుక్కుమన్నాడు కిరణ్.

"ఏరా కిరణ్! ఏం సంగతి. ఇంకేమైనా రౌడీవేషాలేస్తున్నావా! జాగ్రత్త నా ఏరియాలో మళ్లీ ఏమైనా చేశావా బొమికెలు ఏరేస్తాను జాగ్రత్త" హెచ్చరించాడు ఎస్.ఐ. కిరణ్‌ని చూస్తూ.

కిరణ్ దృష్టంతా బెల్‌బాటమ్ చొక్కా జేబులోంచి కన్పడుతున్న పచ్చకాగితాల మీదే వుంది.

"లేదుసార్! ఇప్పుడలాంటి పన్లన్నీమానేశాను. నౌకరీ దొరికితే బుద్ధిగా వుండాలని నౌకరీ కోసం ప్రయత్నిస్తున్నాను సార్ వస్తానుసార్" చెబుతూనే కాలుజారి బెల్‌బాటమ్ యువకునిపై పడ్డాడు కిరణ్.

రోడ్డవతల మందుల దుకాణంలో ఏదో గొడవ బయల్దేరింది. యస్. ఐ. గబగబా దుకాణంలోకి నడిచాడు, బెల్‌బాటమ్ యువకునితోసహా.

కిరణ్ హుషారుగా ఈలవేస్తూ పాన్ దుకాణంవద్ద నిలబడ్డాడు పాన్‌కోసం.

మందుల దుకాణంలో పెద్దగా అరుస్తూ కంగారు పడుతున్న లావాటివ్యక్తిని చూస్తూ కంగారుపడ్డాడు బెల్‌బాటమ్ యువకుడు.

యస్. ఐ ని చూస్తూ ఏడుపుగొంతుతో "మందులు రాసితెమ్మని డాక్టరమ్మ చెబితే దుకాణంలోకి వచ్చి మందులు కొని జేబులో చెయ్యి పెట్టేసరికి పర్సులేదండి నాపర్సు. అందులో రెండు వంద నోట్లున్నాయి" కంగారు పడుతున్నాడు లావాటివ్యక్తి.

బెల్‌బాటమ్ వ్యక్తి కంగారు అణచుకుంటూ పరామర్శ చేశాడు లావాటి వ్యక్తిని.

"ప్రొద్దున్న పాపం సికింద్రాబాద్ నుంచి నాతోబాటే వచ్చాడు సిటీ బస్సులో" యస్. ఐ తో చెబుతున్నాడు బెల్‌బాటమ్ పాంటు జగన్

యస్. ఐ. ఇదంతా గమనిస్తున్నట్లు లేదు. గబగబా పాన్ దుకాణం దగ్గరకు నడిచి కిరణ్ జుట్టు పట్టుకుని లాక్కొచ్చాడు

"వెధవా! చెప్పు తీశావా లేదా! నువ్వు ఎక్కడ వుంటే అక్కడో గొడవ తప్పదు చెబుతావా చెప్పవా" ఒక్కతన్ను తన్నాడు

"లేదుసార్ నాకేం తెలియదు. నిజం సార్ నమ్మండి" నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్న జగన్ జేబులు వెతికి పర్సు బైటకి తీశాడు యస్. ఐ.

"అదే సార్! అదేనాది అందులో రూపాయి చిల్లర రెండు వంద రూపాయిల నోట్లు మరికొన్ని కాగితాలు వుండాలి" హుషారుగా మెరుస్తున్న కళ్లతో చెబుతున్నాడు లావాటి వ్యక్తి.

జగన్ జేబులు తడుంకున్నాడు. ఆశ్చర్యం జేబులోంచి డబ్బు మాయం అయింది.

"ఇందాక కాలుజారి మీద పడినట్లు నటించి ఈ కిరణ్ గాడు కొట్టేయ్యలేదు కదా" తిట్టుకుంటున్నాడు.

యస్.ఐ. పర్సులో డబ్బు లావాటి వ్యక్తి చెప్పినట్లు వుండటం గమనించాడు.

"మీరు రిపోర్టు రాసివ్వండి, మిగిలిన విషయం నేను చూసుకుంటాను" అంటూ యస్. ఐ. కిరణ్‌ని తీసుకుని పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లాడు.

బెల్‌బాటమ్ వ్యక్తి జేబులో కొట్టేసిన డబ్బు బస్సులో దొరికిన పర్సు వీటి సంగతి అర్థం కావటంలేదు కిరణ్‌కి. నిరుత్సాహంగా శూన్యంలోకి చూస్తూ కటకటాల వెనుక నిలబడ్డాడు కిరణ్.

హైదరాబాద్ నోట్‌బుక్

—తిరుమల రామచంద్ర

గిరిజనాభ్యుదయం :

శ్రీ జగన్నాథరావు తెలంగాణా అభివృద్ధి సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా ఇవ్వడం వల్ల విధాన పరిషత్తు సభ్యుడు శ్రీ అమర్‌సింగ్ రాదోజాను ఆ పదవికి ముఖ్యమంత్రి నియమించారు. రాదోజా గిరిజనుడు (లంబాడీ). కాబినెట్ హోదాగల ఈ పదవికి నియమితుడైన తొలి గిరిజనుడు ఈయనేనని ముఖ్యమంత్రి తెలిపారు. పూర్వం ఆంధ్ర మహాసభవల్ల లంబాడీలలో ఎంతో చైతన్యం కలిగి విద్యాప్రచారమూ కలిగింది. పలువురు పట్టభద్రులు అయ్యారు. రాదోజా తమ వర్గం వారి శ్రేయస్సుకు పాటుపడతారని ఆశిస్తున్నాను.

నాంపల్లి జూనియర్ కళాశాల విద్యార్థులకు హితవు :

విద్యార్థుల ప్రధాన లక్ష్యం జ్ఞానార్జనమని కనుక విద్యార్థులు దానికోసం సంపూర్ణమైన శ్రద్ధ వహించాలని డిసెంబరు చివరివారంలో నాంపల్లి జూనియర్ కళాశాల విద్యార్థి సంఘం ప్రారంభోత్సవ సమయంలో ఉత్సవానికి అధ్యక్షత వహించిన శ్రీ తిరుమల రామచంద్ర, ముఖ్య అతిథి శ్రీ వానమామలై వరదాచార్యులు హితవు చెప్పారు. ప్రారంభంలో కళాశాల వైస్ ప్రిన్సిపాలు శ్రీ వి. రామకృష్ణారావు స్వాగతం చెప్పారు. ప్రిన్సిపాలు శ్రీ డి. శంకరరావు పరిచయం చేశారు. కళాశాల తెలుగుశాఖాధ్యక్షులు శ్రీ కాండూరి నరసింహాచార్యుల ధన్యవాదాలతో ఉత్సవం సమాప్తమయింది.

కన్నులవిందైన గులాబీల ప్రదర్శనం :—

పార్టీలు, చీలికలు, వాటిలో మళ్లీ చీటలు, తరుగు, మురుగు, ఇలా రాజకీయాలలో మునిగిన జనివారికి జనవరి 8 వ తేదీన షాపూర్‌వాడీలో హోటల్ సరోవర్‌లో జరిగిన గులాబీల ప్రదర్శనం ఊపిరాడేట్టు చేసింది. పరిమళాలు వెదజల్లే రంగు రంగుల గులాబీల వరుసలతో చిత్రవిచిత్ర రీతులతో ఈ ప్రదర్శనం కన్నుల పండువుగా వుంది. హైదరాబాద్ రోజ్ సొసైటీ దీనిని ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శనంలో శ్రీమతి టి ఇందిరా రెడ్డికి నాలుగు ప్రథమ బహుమతులు లభించాయి. ఆంధ్ర వ్యవసాయ విద్యాలయానికి రెండవ బహుమతి, కుమారి కె శాంతికి మూడవ బహుమతి లభించాయి పుష్పాలంకరణలో శ్రీమతి కె. మీనాక్షి దేవికి, బేలావహానికి మొదటి బహుమతులు, శ్రీమతి కృష్ణ కాశీనాథ్‌కు కె సిద్ధార్థకు రెండవ బహుమతులు లభించాయి. గవర్నర్ శ్రీమతి శారదా ముఖర్జీ దీనికి ప్రారంభోత్సవం జరిపారు

ప్రపంచ తెలుగు మహాసభ వాయిదా :—

వచ్చే ఏప్రిల్‌లో మలేషియాలో జరుగవలసిన ప్రపంచ తెలుగు మహాసభను సంవత్సరంపాటు (1978 వ సంవత్సరానికి) వాయిదా వేసినట్లు మలేషియా ఆంధ్ర సంఘం ప్రకటించింది గడచిన నవంబరులో ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతంలో ఏర్పడిన తుపానువల్ల కలిగి నష్టం దృష్ట్యా వాయిదా వేయడం జరిగిందని ఈ సంఘం ప్రకటించింది

రమణమూర్తి బృందం అమెరికా పర్యటన :

ఇటీవల జంటనగరాలలో శ్రీ మునునూరి వెంకట రమణమూర్తి, శ్రీ పి. సూర్యారావు పాటకచ్చేరీలు విన్నవారికి. వారిద్దరూ త్వరలో అమెరికాలో పర్యటించి కర్నాటక సంగీత సుధను అక్కడివారికి పంచి పెడతారని విన్నప్పుడు మనస్సు ఉప్పొంగకమానదు. శ్రీ వెంకటరమణమూర్తి ఇటీవల ఒంటరిగా, మిత్రుల ఆహ్వానంపై అమెరికా వెళ్లి న్యూయార్క్, బోస్టన్, వాషింగ్టన్, న్యూజెర్సీలలో కచ్చేరీలు జరిపి, వారిమెప్పుపొంది వచ్చారు. మన సంగీతమంటే చెవి కోసుకొంటున్నవారు అక్కడివారిలో వున్నారని ఆయన తెలిపారు ఈసారి ఈ జంటగాయకుల వెంట వయొలిన్ విద్వాంసులు శ్రీ కె. వి. రెడ్డి, మృదంగ విద్వాంసురాలు కుమారి నిడుమోలు సుమతి వెళ్లుతున్నారు. వీరంతా విజయవాడ సంగీతకళాశాలలో అధ్యాపకులు 1977 డిసెంబర్ 9న శ్రీయుతులు వెంకటరమణమూర్తి, సూర్యారావు సికిందరాబాద్ సంగీతకళాశాలలో హిందూస్తానీ జుగల్‌బంద్ పద్ధతిని పరస్పర సంపూరకంగా వారు కచేరీ జరిపి, రక్తి కట్టించారు.

ఉపశ్రుతి :—

ఏమిటిసార్, కాంగ్రెస్‌నుంచి నన్ను బహిష్కరించడానికి అధ్యక్షునికి అధికారంలేదని అంటున్నారే విడిపోయిన ప్రతిమంత్రీ ? అని ప్రశ్నించాడు ఒకరు నన్ను మా గురువుగారు చెప్పిన కథ ఒకటి జ్ఞాపకం వస్తున్నదండి. గురువు శిష్యుడ్ని శుంఠ త్వం—నీవు శుంఠవు అన్నాడట. స్వామీ, పునరుక్తిదోషం అన్నాడట శిష్యుడు ఎందుకంటే మొదట్లోనే నేను శుంఠను మరీ నిడిగా ఇప్పుడు చెప్పక్కర్లేదు అని శిష్యుని ఉద్దేశం అలాగే వీళ్లంతా కాంగ్రెస్‌నుంచి విడిపోయారు వాళ్లను బహిష్కరించినా ఒకటే, కావలించుకున్నా ఒకటే అన్నారు మా మాటలు వింటున్న ఒక జనతా పండితులు ●

ఉత్తరాలు

సీరియల్

సీరియల్ రాగమాలిక నాకెంతో నచ్చినది. ఇదేం న్యాయం అను కథ చాలా బాగున్నది. జి. వి. జి. గారి పేజి బాగుంది.

డి. రమణయ్య, [పండూరు].

*　　*　　*

ఈ సంవత్సరానికి ఆఖరు పత్రిక ముఖచిత్రం శుభ చాల బాగుంది. పెళ్లికోసం కథ చక్కగా వుంది. ఈ వారంలో రాగబంధం పూర్తయింది రచయిత్రి అన్ని సినిమా కథవలె రాశారనడానికి ఏమీ సందేహం లేదు.

వై. లక్ష్మి (విజయవాడ)

కథలు

13–1–78 నాటి సచిత్రవారపత్రిక అరుణా ఇరానీ ముఖచిత్రంతో చాలా ముచ్చటగా ఉంది. కావల నాగభూషణంగారి అమ్మాయిపోటో ఏమంత బాగా లేదు. ఉన్నకథలలో రెంటాల హనుమత్‌గారి ఇదేం న్యాయం కథ నన్నెంతో ఆకర్షించింది. ద్విభాష్యం రాజేశ్వరరావుగారి యెలిమెంట్ గొప్పకథ కాకపోయి నప్పటికీ చదువవలసినదే అనిపిస్తుంది. ముఖ్యంగా జొన్నలగడ్డ లలితాదేవి పి. వి. హిమబిందు ఈ వారం చాలా బాగుంది. హిమబిందువు లాంటివ్యక్తులు సమాజంలో, తరచుగా కన్పించుటమే ఈ కథకు నిదర్శనం. ఇంకా కార్టూన్లలో, సినిమా కబుర్లలో ఈ వారం పత్రిక ఆకర్షణీయంగా ఉందనడంలో అతిశయోక్తి లేదు.

కె. చిరన్‌కుమార్ [నేరేడుచర్ల]

*　　*　　*

13–1–78 నాటి అరుణా ఇరానీ ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక మాకెంతో నచ్చింది.

కథలలో ఎలిమెంట కథ చాలా బాగుంది


పి. వి హిమబిందు సీరియల్ చదువుతుంటె ఇంకా మున్ముందు హిమబిందు పాత్ర ఎలాగునయుంటుందోనని మనస్సు ఉవ్విళ్ళూరుతుంది

అల్లుమిల్లి రామారావు [కలకత్తా]

*　　*　　*

13–1–78 నాటి మా అభిమాన వారపత్రిక ముఖచిత్రం అరుణాఇరానీ అత్యంతఆకర్షణీయంగా ఉంది. కేవలం తెలుగు నటీనటుల ముఖచిత్రాలేగాక అటు హిందీతారల ముఖచిత్రాలను కూడా వేస్తున్నందులకు చాల సంతోషంగాఉంది. అమ్మాయిపోటో ఇదేం న్యాయం ? కథలు మాకు నచ్చాయి సీరియల్స్ రెండూ పోటాపోటీగా పరుగులు తీస్తున్నాయి. జి. వి జి గారి పేజీ పత్రికకే హైలైట్

న్యాయపతి రమేష్‌బాబు, [బరంపురం ఒరిస్సా] ●



ధర్మపథం

—బులుసు వేంకటరమణయ్య.

సరియైన పురుషార్థాలు

చతుర్విధ పురుషార్థాలు అందరూ ఎరిగినవే! అవి ధర్మం- అర్థం-కామం - మోక్షం అనేవి. మానవుని జీవితంలో ఈ నాలుగూ అవసరమైనవే! వీటిలో ఒక దానితో మరొక దానికి సంబంధమూ ఉన్నది


మనకు మనం చేయవలసిన విహితకృత్యాలు కొన్ని ఉన్నవి. అవన్నీ ధర్మం లెక్కలోకి వస్తాయి. వాటిని మనం నెరవేర్చవలెనంటే అర్థం—అంటే ధనం కావాలి. ధర్మాచరణలో ఆసక్తి ఉన్నట్లే ధన సంపాదనలోనూ ఆసక్తి ఉండాలి. ఇక డబ్బుంటే తమ కోరికలను నెరవేర్చుకోవాలని తోచడం సహజం. ఆ కోరికలే కామములు. ధర్మ-కామాలకు మధ్య ఉండే అర్థానికి ఆ రెండిటితోనూ సంబంధం ఉన్నది. కోరికలన్నీ తీరిన తర్వాత లౌకికాల పయిని స్పృహ కలిగి, నాల్గవ పురుషార్థమైన మోక్షం మీదికి బుద్ధి వ్యాపిస్తుంది. తగిన సాధనాలవల్ల దానిని పొందడం సాధ్యమవుతుంది.

కాని ధర్మాలను యథావిధిగా ఆచరించడం అందరికీ సాధ్యమౌతుందా? కాదు దానికి ఎంతో ధనం కావాలి అందరికీ ధన సంపాదన చేసే శక్తిసామర్థ్యాలు ఉండవు అట్టివారి కోసం మన ప్రాచీనులు ఎన్నడో సులభ మార్గంలో వీటి లక్షణాలను నిర్వచించారు.

"ఉపకారః పరోధర్మః
పరోఽర్థః కర్మనైపుణమ్.
పాత్రే దానం పరః కామః
పరోమోక్షో వితృష్ణతా"

తనకు శక్తి ఉన్నంతవరకూ ఇతరులకు ఉపకారం చెయ్యడంకంటె మేలైన ధర్మం లేదు. అదే ఉత్తమ ధర్మం అది చేస్తే అన్ని ధర్మాలూ ఆచరించినట్టే. తన కర్తవ్యాన్ని మనఃస్ఫూర్తిగా చెయ్యడమే ఉత్తమమైన అర్థం. (అర్థం అంటే ధనమే కాకుండా విషయం కూడా అవుతుంది.) ఏదైనా దానం చేసేటప్పుడు తగిన వారికి దానం చెయ్యడం కామం. పేరాశ లేకుండా వుంటే చాలు. అదే ముక్తి సమానం.

ఇవి అందరికీ సులభంగా ఆచరించడానికి అవకాశం వుంది. ఈపద్ధతి ననుసరించి ప్రవర్తిస్తే నాలుగు పురుషార్థాలను సాధించినట్టే అవుతుందని దీని అభిప్రాయం.



తాజా కాలమ్

(6వ పేజీ తరువాయి)

త్రోసిరాజన్న యిందిరమ్మ మీద సవరించిన సమన్లు వేసి మళ్ళీ "షా" చెప్పడానికి మరో ఎత్తు వేసింది. దీనికి యిందిరమ్మ 'ఎత్తు' ఏమిటా? అని పరిశీలకులు ఎదురు చూస్తున్నారు! జైపూర్‌లో జనవరి 15న ఆమెను విలేఖరులు "మీరు 19న 'షా' సంఘానికి హాజరు అవుతున్నారా?" అని అడిగితే "నాకు తెలియదు' అని జవాబు చెప్పడంతో 'లీగల్ డ్రామా'కే నాంది పడ్డట్లు అనుకోవాలి...

[వీరాజీ 16-1-78]

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor. S. Radhakrishna